సంపుటి : 78 సంచిక : 48 పుటలు : 52

# జాగృతి

కలి 5128 - శ్రీ పరాభవ భాద్రపద శుద్ధ చవితి
14-20 సెప్టెంబర్ 2026
వెల : ₹20/-



మోదీ @ 25



## నేపాల్ విపత్తు.. భవిత ప్రశ్నార్థకం!



## వృద్ధిరేటు పెరిగినా అసహనమేనా?

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా https://payit.cc/SYBqNRG267 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.



సెప్టెంబర్
17
నిజాం నిరంకుశత్వాన్ని, రజాకార్ల అకృత్యాలను ఎదిరించి
పోరాడిన సమరయోధులకు...
పోలీస్ చర్యతో నిజాం మెడలు వంచిన ఉక్కుమనిషి
సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ధీరత్వానికి ప్రణమిల్లుతూ...
సమస్త తెలంగాణ ప్రజానీకానికి...
తెలంగాణ
విమోచన దినోత్సవ శుభాకాంక్షలు!
అనుక్షణం దేశం కోసం ఆలోచిస్తూ...
అడుగడుగునా ప్రజల కోసం పరితపిస్తూ...
ప్రపంచ వేదికపై భారత ప్రతిష్టను ఇనుమడింపజేస్తూ...
'వికసిత్ భారత్' స్వప్నాన్ని సాకారం చేసేందుకు...
నిర్విరామంగా కార్యదీక్షతో ముందుకు సాగుతూ...
చెదరని చిరుమందహాసంతో 140 కోట్ల భారతీయుల
గుండెల్లో గూడుకట్టుకున్న...
ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారికి
హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు
25 సంవత్సరాల సేవ
• సుపరిపాలన • ప్రజా సంక్షేమం • దేశ నిర్మాణం
సేవా సంకల్ప్ అభియాన్
17 సెప్టెంబర్ నుంచి 17 అక్టోబర్ వరకు
మోదీ గారి ప్రజా జీవితంలో 25 సంవత్సరాల
సేవా ప్రస్థానం విజయవంతంగా పూర్తయిన
సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహించే సేవా
కార్యక్రమాల్లో భాగస్వాములమవుదాం.
భారతీయ జనతా పార్టీ - తెలంగాణ

# పర్యావరణం..

## ఈ సంవత్సరం దీపావళి సంచిక ప్రత్యేకం

- గర్భస్థ శిశువుల్లో, తల్లి పాలల్లో.. మైక్రో ప్లాస్టిక్ – రాబోయే తరాలకు తంట.
- కరిగిపోతున్న హిమాలయాలు – మన ప్రాణాలకు ముప్పు.
- కాలుష్య కాసారాలుగా జలవనరులు.. జీవవైవిధ్యరహితంగా అడవులు.
- పంచగవ్య సంపదలిచ్చే గోమాత.. మనవల్లే ఆ తల్లికి కడుపుకోత.
- అశ్రుధారలు కార్చుతున్న పర్యావరణం! ఈ విపత్తుకు కారణం మనం కాదా?
- విధ్వంసాన్నే అభివృద్ధిగా భ్రమిస్తూ భూమాతను బలి చేస్తున్న మనిషి.

### మన తక్షణ కర్తవ్యం..

- పర్యావరణానికి మేలు చేసే మన ఆచార, సంప్రదాయాల పునరుద్ధరణ.
- సీడ్ బ్యాంక్, ఆర్గానిక్ సేద్యం వంటి పర్యావరణ హిత ప్రయోగాలకు పెద్దపీట.
- మన ఆరోగ్యాన్ని కాపాడే వనవాసీ వైద్య విజ్ఞానాన్ని నిలబెట్టుకోవాలి.
- దేవతా వృక్షాల సంరక్షణ.

మొదలైన విషయాలపై పర్యావరణ విశేషజ్ఞుల విశ్లేషణలు



అదనపు కాపీల కోసం పాఠకులు, ఏజెంట్లు అక్టోబర్ 10లోగా జాగృతి కార్యాలయానికి 9959997013 నంబరుకు ఫోన్ / వాట్సప్‌లో సంప్రదించవచ్చు.

**పేజీలు : సుమారు 300**

**త్వరపడండి!**

jagritiweekly.com | facebook.com Jagriti Telugu Weekly | youtube.com/@Jagrititv | 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Managing Editor : Kurra Durga Reddy.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

ఎం. శ్రీనివాస్ : సర్క్యులేషన్ ఇన్‌చార్జ్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం**
**9959991304**
**(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

డిజైనర్ : చిగుళ్ల కుమార్

చివరకు బొద్దింకల దండు బదాబదలైంది. రెండుగా విడిపోయి.. రాజకీయ చర్చల్లో నిమగ్నమైంది. కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేతో విభేదించిన మనీష్ బ్రహ్మభట్ వర్గం సెప్టెంబర్ 3న సీజేపీ–డెమోక్రటిక్ పేరిట చీలిక గ్రూపును ఏర్పాటు చేసింది. ఆకాశానికి నిచ్చెన వేసిన అభిజీత్ దీప్కే అసలు రంగు ఇంత త్వరగా బయటపడుతుందని...పాపం వామపక్ష మేధావులు గ్రహించలేదు. అంతర్జాతీయస్థాయిలో...అహరహం శ్రమించి తయారు చేసిన ప్రణాళిక..అర్థంతరంగా అభాసుపాలు కావడంతో కుట్రదారుల గొంతులో వెలక్కాయ పడినట్టయింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మాధ్యమాలను మచ్చిక చేసుకుని మరీ..హస్తిన వేదికగా ఆడిన కృతక నాటకం..ఆఖరు అంకంలోనే అవమానాన్ని మూటగట్టుకుంది. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఇక దేశాన్ని తమ గుప్పిట్లో పెట్టుకున్నామనే ధీమాను వ్యక్తం చేసిన బొద్దింకల పార్టీ..అంతర్గతంగానే ప్రత్యర్థులను తయారు చేసుకుంది. అంతిమంగా చీలిపోయింది.

సద్యోజనితంగా కనిపించే ఉద్యమాలు, ఆందోళనలేవీ అంతస్సారంలో.. స్వచ్ఛందమైనవి కావు. వ్యక్తమయ్యే రూపం వెనుక అందుకు పూర్తిగా భిన్నమైన సారం ఉంటుంది. రూపసారాల మధ్య వ్యత్యాసాన్ని పసిగడితే..బొద్దింకల అసలు రంగు అర్థమవుతుంది. అందుకే మన పూర్వీకులు 'మెరిసేదంతా బంగారం కాదు' అన్నారు. బొద్దింకల ఆందోళనల వెనుక రాజకీయ ప్రయోజన కాంక్ష ఉందని..సాక్షాత్తూ సోనమ్ వాంగ్‌చుక్ తేల్చేసిన తర్వాత ఇప్పుడిప్పుడే యథాలాపంగా రైలెక్కి వెళ్లిపోయిన బొద్దింకలకు సత్యం ఆలస్యంగా అయినా బోధపడుతోంది.

ఢిల్లీ జంతర్‌మంతర్ ఆందోళనల్లో పాల్గొని, నిరాహార దీక్ష చేసి..నాటకీయతను దట్టించిన సోనమ్ వాంగ్‌చుక్ తాజా వ్యాఖ్యలు..కాక్రోచ్ జనతా పార్టీ అసలు రంగును బయట పెట్టాయి. అంతటితో ఆగలేదు, కాక్రోచ్ పార్టీ నేతలు కొత్త పార్టీ పెట్టినా, ఇప్పుడున్న పార్టీల్లో చేరినా వారికి తన తోడ్పాటు ఉంటుందని.. భరోసా ఇచ్చారు. కాక్రోచ్ జనతా పార్టీ చీలిక వర్గం నేత మనీష్ బ్రహ్మభట్..సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై చేసిన ఆరోపణలను బొద్దింకల ఆందోళనల్లో పాల్గొన్నవారు నిశితంగా

**శాలివాహన 1948 శ్రీ పరాభవ భాద్రపద శుద్ధ చవితి**

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

**విడి ప్రతి రూ.20**

**5 సం॥ల చందా రూ.4000** **సంవత్సర చందా రూ.850**

జాగృతి వారపత్రికను **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పొందుటకు: **రూ.1,474 (850+624)**

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

**– సర్క్యులేషన్ ఇన్‌చార్జ్, జాగృతి**

## లోపలి పేజీలలో...




ముఖపత్ర కథనం
**నేపాల్ విపత్తు.. భవిత ప్రశ్నార్థకం!** 6లో

ధారావాహిక నవల
6 **ఏ వెలుగులకీ ప్రస్థానం ?**
– గన్నవరపు నరసింహమూర్తి 20లో



జాగృతి పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు శ్రేయోభిలాషులకు
**వినాయకచవితి శుభాకాంక్షలు**



# జాగృతి

## సంపాదకీయం

పరిశీలించి, ఆత్మావలోకనం చేసుకోవాలి. అప్పుడు ఇలాంటి ప్రాయోజిత ఆందోళనలబారిన పడకుండా ఉంటారు. సామాజిక మాధ్యమాల వేదికగా 'సీజేపీ' ఆరంభమైనప్పుడే చాలామంది దీప్కే..కేజ్రీవాల్ బంటు అని తేల్చి చెప్పారు. ఆందోళనల ఉధృతిలో ఉన్న విద్యార్థి, యువకులు దాన్ని పెడచెవిన పెట్టారు.

ఆగస్టు చివరివారంలో సీజేపీకి రాజకీయ లక్ష్యాల గురించి మాట్లాడిన సోనమ్ వాంగ్‌చుక్..సెప్టెంబర్‌లో మాటమార్చి...సీజేపీ నిష్పక్షపాత సంస్థ అని, ఏ రాజకీయపార్టీకి సంబంధం లేకుండా తటస్థంగా ఉందంటూ కితాబు ఇచ్చారు. వాంగ్‌చుక్ అభిప్రాయాలు మారుతున్న దశలోనే మనీష్ బ్రహ్మభట్ అసలు

## అడ్డం తిరిగిన సీజేపీ కథ

గుట్టు బయటపెట్టాడు. అభిజీత్ దీప్కే స్థాపించిన 'కాక్రోచ్ జనతా పార్టీ'... కేజ్రీవాల్ నేతృత్వంలోని 'ఆమ్ ఆద్మీ పార్టీ'కి మరో రూపమని తేల్చేశాడు. సీజేపీలోకి కేజ్రీవాల్ పరకాయ ప్రవేశం చేశాడని స్పష్టంగానే ప్రకటించాడు.

కాక్రోచ్ జనతా పార్టీ చీలికకు సరిగ్గా నెల రోజుల ముందు ఓ ఆంగ్ల వార్తా సంస్థ..సీజేపీకి 'గ్లోబల్ టూల్ కిట్'-డీప్ స్టేట్‌కి ఉన్న సంబంధాన్ని తేటతెల్లం చేసింది. టూల్ కిట్‌కు ప్రధాన పరికరమైన స్వీడిష్ పర్యావరణ కార్యకర్త..గ్రెటా థన్‌బర్గ్ సీజేపీ ఆందోళనలను..భారతదేశంలో విద్యాసంస్కరణ ఉద్యమంగా కీర్తిస్తూ..ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసేందుకు ప్రయత్నించిందని సదరు వార్తా సంస్థ తన పరిశోధనాత్మక కథనంలో వెల్లడించింది. సీపీఎం అనుబంధ విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐసీజేపీ ఆందోళనలకు సంఘీభావంగా లండన్‌లో నిర్వహించిన ఊరేగింపులో గ్రెటా థన్‌బర్గ్ ఈ ఆందోళనలకు మద్దతు తెలిపింది.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ఆరంభ సమయంలో, అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు విసురుతున్న సవాళ్ల మధ్య కేంద్ర ప్రభుత్వం తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్న దశలో... ఈ స్థితిని అదనుగా చూసుకుని బొద్దింకలు జంతర్‌మంతర్ సహా పార్లమెంట్ భవనాల సముదాయాలను చుట్టు ముట్టాయి. మరోవైపు కాంగ్రెస్‌పార్టీ కేంద్రం చేపట్టిన 'గ్రేట్ నికోబార్ ప్రాజెక్టు' పై విష ప్రచారం మొదలు పెట్టింది. ఇదే సమయంలో బాంగ్లాదేశ్‌లో ఇస్లామిక్ రాడికలిస్టులు సీజేపీ ఆందోళనలకు సంఘీభావంగా ప్రదర్శనలు నిర్వహించారు. కెనెడాలోని ఖలిస్థానీ వేర్పాటువాదులు కూడా సీజేపీకి మద్దతు ప్రకటించారు. మరోవైపు జంతర్‌మంతర్‌లో సీజేపీ చేపట్టిన ఆందోళనల్లో అమెరికా పౌరులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. బ్రిటీష్ లేబర్‌పార్టీ నేత జెరెమీ కార్బిన్ సీజేపీ ఆందోళనలకు సంఘీభావం ప్రకటించారు.

జూలైలో ఢిల్లీ కేంద్రంగా సీజేపీ చేసిన ఆందోళనలకు అంతర్జాతీయ స్థాయిలో లభించిన మద్దతు, సంఘీభావం వెనుక డీప్‌స్టేట్ ఉందనేది బహిరంగ రహస్యం. అమెరికా వ్యూహాత్మక సైనిక స్థావరాలకు నిర్మాణానికి అంగీకరించకపోవడం, పహెల్గాం దాడి తర్వాత భారత్ ప్రతిదాడి, విదేశాంగ విధానం, దౌత్య సంబంధాల విషయంలో భారత్ స్వతంత్రంగా వ్యవహరించడంతో 'డీప్‌స్టేట్' రంగంలోకి దిగింది. భారత ప్రభుత్వాన్ని అస్థిరతకు గురిచేయడం, సామాజిక జీవితంలో అనిశ్చితిని, అశాంతిని రేకెత్తించడం వ్యూహాత్మక అవసరమని డీప్‌స్టేట్ భావించింది. ఇందుకు విద్యార్థులే సరైన ఆయుధమని అంచనా వేసింది. విద్యార్థులు, నిరుద్యోగులను స్వచ్ఛంద ఉద్యమకారులుగా భ్రమింపచేయడం వల్ల తమ ఎత్తులు పారతాయని డీప్‌స్టేట్ భావించింది. అయితే, కథ అడ్డం తిరిగి... సీజేపీ రెండు ముక్కలైంది. ప్రాయోజిత ఉద్యమాలెప్పుడూ దీర్ఘకాలం మనలేవనడానికి బొద్దింకల ఆందోళన ప్రబలమైన ఉదాహరణ. ★

14 సెప్టెంబర్ 2026, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ - బృహదారణ్యకోపనిషత్



40లో

కథ

**రంగు రెక్కలు**

- పద్మావతి రాంభక్త

ధరహాసం





| | | |
|---|---|---|
| వృద్ధిరేటు పెరిగినా అసహనమేనా? (ముఖపత్రకథనం-1) | - | 9 |
| కరవు నేలలకు జీవజలాలు (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| తిలక్ ఆశయం నేడు ఎటువైపు? (చర్చ) | - | 18 |
| గగనతలంలో మహిళా 'శక్తి' (మహిళ) | - | 23 |
| యురేషియా దిశమార్చనున్న ఎస్‌సీఓ (అంతర్జాతీయం) | - | 24 |
| అప్పుడు అలా...! ఇప్పుడు ఇలా..! (తెలంగాణ) | - | 28 |
| మణిపూర్ అగ్నికి ఆజ్యం ఆ రచనలే (గళమెత్తిన గతం) | - | 30 |
| చరిత్రను మళ్లీ చదవాల్సిన రోజు (ప్రత్యేక వ్యాసం) | - | 32 |
| ఐకమత్యం సాదిద్దాం (సందేశం) | - | 34 |
| దేశానికి సేవాకాలమే అమృతకాలం (మోదీ @ 25) | - | 44 |
| 'బంగారు' కలతో ఏషియాడ్‌కు భారత్! (క్రీడ) | - | 43 |
| సంక్రాంతికి ముందే సినిమా సందడి (సినిమా) | - | 50 |

# నేపాల్ విపత్తు..



ప్రకృతితో మమేకమై జీవించడం మానవ ధర్మం. మరి ప్రకృతి విపత్తులతో మమేకమై జీవించడం మానవుల దౌర్భాగ్యం. ప్రకృతికి దగ్గరగా మనుగడ సాగించవలసిన మనం ప్రకృతికి దూరంగా పారిపోవలసిన రోజులు వస్తున్నాయి. దీనికి ఇటీవల నేపాల్‌లోని త్రిశూలి నది, కాళీ, గండకి లోయలో వరదలు నిదర్శనంగా నిలిచాయి. దీనిని భౌగోళిక అపాయంగా అభివర్ణించవచ్చు. ప్రకృతి మనకు ఎంత సుఖాన్ని, సాంత్వనను ఇస్తుందో అంతే ప్రకోపించగలదు కూడా. అదే ప్రకృతి ధర్మం. అలాంటి ప్రకృతిని గౌరవించడం మానవ ధర్మం. ప్రకృతిని పరిరక్షిస్తేనే మానవ మనుగడ సుసాధ్యం.

మానవాళి ముఖ్యంగా "battle with nature ends in battle for life" అన్నది (ప్రకృతితో పోరాటం జీవనపోరాటంతో ముగుస్తుంది) గుర్తుంచుకోవాలి. ప్రకృతిని పరిరక్షించుకుందాం అని పర్యావరణ ప్రేమికులు గత కొన్ని దశాబ్దాలుగా గగ్గోలు పెడుతున్నా ఆచరించేవారు కొందరే ఐతే, పెడచెవిన పెట్టేవారే ఎక్కువ కదా! అందుకే ఈ విపరీతాలు. "When anger raises think of consequences" (ఆగ్రహం పెరిగినప్పుడు దాని పరిణామాలను గురించి ఆలోచించాలి)అన్నారు పెద్దలు. మనము ప్రకృతిని మన సుఖాలు, సౌలభ్యాలకోసం నాశనం చేస్తున్నాము. కానీ దాని పరిణామాలు ఒక రోజు దారుణంగా ఉంటాయన్న సంగతిని ఎప్పటికప్పుడు అలక్ష్యం చేస్తున్నాము కదా! మరి ఇదేకదా పర్యావరణ విఘాతమంటే!

**వరదల వెనుక కారణం**

ఉపగ్రహం ద్వారా సేకరించిన సమాచారాన్నిబట్టి అతి పెద్ద మంచు కొండ విరిగింది. అది కాస్త కరిగి దగ్గరలోనే ఉన్న మంచు ,నీటితో నిండిన విస్తారమైన సరస్సులోకి చేరుకుంది. ఆ సరస్సులోని నీరు పెల్లుబికి బయటకు పారింది.అది తనతోపాటు మట్టిని, చెట్లను, బండరాళ్లను తీసుకుని అతి వేగంగా వరదలా ప్రవహించింది.దిగువన ఉన్న ఊళ్లను ముంచెత్తింది. ఇందులో మనం ఊహించలేక పోయింది ఏమిటంటే ఎన్నడూ లేనంతగా అంత పెద్ద పరిమాణంలో మంచు కొండ విరిగిపడడం. తదనంతర పరిణామాలన్నీ మనం ఊహించదగ్గవే. అయితే ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే ఈ మంచుకొండ ఇంత పెద్ద పరిమాణంలో విరగడం కూడా మానవ తప్పిదమే. దాన్నే వాతావరణ మార్పు-గ్లోబల్ వార్మింగ్ అంటారు. ఆ కారణంగానే కొండ విరిగిపడిందని కొందరు శాస్త్రవేత్తల, పర్యావరణవేత్తల అంచనా. విపరీతమైన వాతావరణ మార్పులతో కొన్ని దశాబ్దాలు లేదా శతాబ్దాల తరువాత జరగాల్సిన ప్రకృతి విపత్తులు ఇప్పుడే చోటు చేసుకోవడం మనం చూస్తున్నాము. కాబట్టి చివరికి పలు మానవ తప్పిదాలు, అలాగే మానవుడింకా శాస్త్ర విజ్ఞానం ద్వారా తెలుసుకోలేని మంచుకొండల గర్భాలలో జరిగే మార్పులు, మానవ మేధకు బహుశా ఎప్పటికీ అందని భౌగోళిక అంశాలు ఇలా అన్నీ కలిసి ఈ పెనుముప్పునకు కారణం అని అనుకోవచ్చు.

**ప్రకృతికి ఆవిష్కరణల గొడ్డలిపెట్టు**

రోజురోజుకు కొత్త ఆవిష్కరణలు చేస్తూ తన మేధమీద మానవుడు మురిసిపోతున్నాడు. ఈ ఆవిష్కరణలలో కొన్ని ప్రకృతికి సరిపడవని తెలిసినా నిర్లక్ష్యం వహిస్తున్నాడు. అందుకే విపరీతాలు సంభవిస్తున్నాయన్న విషయాన్ని ఒప్పుకోవడానికి వెనుకాడుతున్నాడు. ఈ పోకడలిలాగే కొనసాగితే చివరకు వచ్చేది పెద్ద ప్రళయం. ప్రకృతిలో చివరకు మిగిలేది శూన్యం.. ఇది తథ్యం. ఎందుకంటే ప్రపంచమంతా శాస్త్ర, సాంకేతిక రంగాలలో ఒకే పోకడతో దూసుకుపోతోంది. అలాగే ఈ దేశం, ఆ దేశం అని లేకుండా దాదాపు అన్నిదేశాలలోనూ విపత్తులు సంభవిస్తున్నాయి. ఇప్పటికైనా మానవాళి మేల్కొనక తప్పదు.

**ధర్మో రక్షతి రక్షితః**

ఇక్కడ ధర్మం అంటే మానవుడు ప్రకృతి పట్ల పాటించవలసినది. అదే ప్రాకృతిక ధర్మం. దాన్ని పాటించనప్పుడు వినాశనం తప్పదు కదా! సైన్స్

# భవిత ప్రశ్నార్థకం!

అభివృద్ధి దాదాపు 400 ఏళ్లనుంచి జరుగుతోంది. ముఖ్యంగా ఇటీవలి రెండు శతాబ్దాలలో శరవేగంతో జరుగుతోంది. దీంతో ప్రకృతిలో ఎన్నో భౌతిక మార్పులు చోటు చేసుకున్నాయి. వాటిలో ఆనకట్టల నిర్మాణం, అరణ్యాలు, వృక్షాలు తొలగించి నగరాల ఆవిర్భావం, బొగ్గు, ఖనిజాలు, పెట్రోల్, సహజ వాయువు వెలికితీసి భూమిని గుల్ల చేయడం, ఇంధనాన్ని విపరీతంగా దహించివేయడంతో వాయు కాలుష్యం, వేల రకాల రసాయనాల ఆధారిత అనేక వస్తువుల ఉత్పాదన,ప్లాస్టిక్ తయారీ, ప్లాస్టిక్ వ్యర్థాలతో భూగర్భ పొరలలో శాశ్వత కాలుష్యం, కొండలు తవ్వి రహదారులు, సొరంగాల నిర్మాణం వంటి అత్యంత వేగంతో, ఎక్కువ సంఖ్యలో చేపడుతున్న ప్రకృతి విధ్వంసకారక చర్యలు ఉన్నాయి. ఇవి మానవాళికి ఉపయోగకరమే కానీ, ఇంత పెద్ద ఎత్తున అవసరం లేదేమో! యుగాంతంలో ప్రళయం గురించి చదివాము. కానీ ఈ కలియుగంలోనే వయనాడ్, నేపాల్ వరదల్లాంటి ప్రళయాలను చూస్తున్నాము. వీటిని ఎప్పుడైనా వచ్చే మహా ప్రళయానికి సంకేతాలుగా పరిగణించాలి. “థా కచా కచ్ భరా సోనా రావణ్ కి లంకా కి దీవార్ మే-ఏక్ రద్దీ భీ నహీమిలా రావణకో చల్తీ వార్ మే”(అంటే రావణుడి లంకలో గోడలన్నీ స్వర్ణమయమంట, అయినా ఆయన మరణింటప్పుడు ఏమీ ఉపయోగపడలేదట) అని ఒక స్వామీజీ అన్నట్టుగా మానవుడు అనేక శాస్త్రీయ ఆవిష్కరణల ద్వారా ఎంతో సంపత్తిని పెంచుకుంటున్నాడు. అయితే మనం ప్రకృతి విపత్తులలో చిక్కుకున్నప్పుడు ఇవన్నీ గడ్డిపరక మందం కూడా పనికి రావు. అందుకే మనం కృత్రిమ అభివృద్ధిని నిదానంగా, అత్యవసరమైన మేరకే చేపట్టి, ప్రకృతిని గౌరవించి, బతకడం నేర్చుకోవాలి. ఒక విషయం సుస్పష్టం. శాస్త్ర ఆవిష్కరణలు, శాస్త్రాభివృద్ధి ఇలాంటి ఘోర ప్రాకృతిక ఉత్పాతాలను కనిపెట్టి హెచ్చరించగలవేమో గాని అవి జరిగినప్పుడు వాటిని, వాటి ప్రభావాలను ఆపలేవు. అందుకే ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవడంతో పాటు పర్యావరణాన్ని విపరీతమైన ఒత్తిడికి గురిచేయకుండా మానవాళి చూసు కోవాలి. ఇప్పటికే హిమాలయ ప్రాంతంలో చాలాచోట్ల మంచు ఫలకాలు- గ్లాసియర్ల విస్తీర్ణం గణనీయంగా తగ్గుతున్నట్లు అంచనాలు తెలియచేస్తున్నాయి. హిమనీనదాలు తగ్గడమంటే అవి కరిగి, నదుల ద్వారా వరదల రూపంలో ప్రవహించడమే కదా! పర్యావరణ పరిరక్షణపై సరియైన దృక్పథంతో పరిరక్షించుకున్నప్పుడే ఇటువంటి ఘోర విపత్తులు సంభవించకుండా ఉండే అవకాశాలు మెండుగా ఉంటాయి. దీనికి ప్రతి ఒక్కరూ నడుం కట్టాలి. 2014లో కేదారనాథ్‌లో వచ్చిన ఆకస్మిక వరదలు, ఆ తరువాత ఉత్తరాఖండ్‌లో, అస్సాంలో, పలుమార్లు కేరళలోని వయనాడ్‌లో వచ్చిన వరదలు మనకెన్నో పాఠాలు నేర్పాయి. ఇలాంటి ఎన్నో ఘటనలు పర్యావరణహిత జీవనాన్ని నొక్కి వక్కాణిస్తున్నాయి. ఆ చేదు అనుభవాల తర్వాత నిజంగా మనమెన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నది ఆలోచించవలసిన విషయం. “అశ్వవేగంలో పథకాలు వేసుకుని అవ్వలాగా నెమ్మదిగా ఆచరిస్తే లాభం ఉండదుకదా!” పర్యావరణ పరిరక్షణలో ఇక ఏ మాత్రం అలక్ష్యం కుదరదని ఇటీవలి నేపాల్ ఉదంతం మనల్ని హెచ్చరిస్తోంది. IPL మ్యాచ్‌లు, బాక్సాఫీస్ హిట్ సినిమాలు, టీజర్లను కాదు మనం విశ్లేషించాల్సింది. పెద్ద పెద్ద పార్టీలు, బహుళ అంతస్తుల భవనాలలో విలాసవంతమైన నివాసాలు, 5 నక్షత్రాల వారసత్వాలు కాదు మనకు కావాల్సింది. ప్రకృతి






విపత్తుల నుండి మనల్ని మనం రక్షించుకోవడానికి ప్రభావవంతమైన కార్యాచరణలు ఏవేమి అమలుపరుస్తున్నాము? మనలో ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణలో ఎంత పాలుపంచుకుంటున్నాము అన్నది మనమందరమూ ఆత్మ విమర్శ చేసుకోవలసిన సమయం ఆసన్నమయిందని తరచుగా మన దేశంలో సంభవించే పర్యావరణ విపత్తులు సంకేతాలిస్తున్నాయి. ఇకపై ఇలా పర్యావరణాన్ని నిర్లక్ష్యం చేస్తూ వృథా చేసే సమయం లేదు మానవాళికి. సామాన్యమైనదైనా పర్యావరణ హిత జీవనమే మనకు ముఖ్యమైనదిగా భావించి ఆచరించినప్పుడే ఇటువంటి విపత్తులు సంభవించే అవకాశాలు తక్కువవుతాయి. ఇదే మనల్ని పరిరక్షించే జీవన సూత్రం. జీవన వేదం. నిజంగా జరగాల్సిందేమిటంటే మానవులు ఇంతకు ముందు జరిగిన ఇలాంటి విపత్తులను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే అనేక సమగ్ర విపత్తు నివారణ, నష్ట నివారణ చర్యలు చేపట్టాల్సింది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు ప్రతిసారీ విపత్తు జరిగిన కొన్ని రోజుల తరువాత విపత్తు నివారణ, నిర్వహణ చర్యల వేగం తగ్గిపోతోంది. ముఖ్యంగా విచ్చలవిడి పారిశ్రామీకరణ, తద్వారా విపరీతంగా రసాయనాలతో, ఖనిజ లోహాలతో ఆడుకుంటున్నాం. ఇవన్నీ పర్యావరణానికి విఘాతం కలిగించేవే కదా! రాకుండా ఉండాలే కానీ ఏ పరికరం ఇలాంటి విపత్తులను ఆపగలదు? ఇది మనం తక్షణమే ఆలోచించాల్సిన విషయం. "మానవ తప్పిదాలు" అన్నది ఈమధ్య ప్రతి పర్యావరణ విపత్తుకి ట్యాగ్‌లైన్‌గా మారింది.

ఈ సందర్భంలో హిమాలయ శ్రేణుల్లో జరుగుతున్న ఎటువంటి ప్రాజెక్టులయినా తాత్కాలికంగా ఆపి వాటిని పునః సమీక్షించాలి. భవిష్యత్తులో ఎవరు ఏమి చేయాలన్నా ఆచి తూచి అడుగులు వేయాలి. భారత్‌కు నీటి గండాలు నలువైపులా పొంచి ఉన్నాయన్నది నివేదికలలో చూస్తున్నాము.

సామాన్యమైనదైనా పర్యావరణ హిత జీవనమే మనకు ముఖ్యమైనదిగా భావించి ఆచరించినప్పుడే ఇటువంటి విపత్తులు సంభవించే అవకాశాలు తక్కువవుతాయి. ఇదే మనల్ని పరిరక్షించే జీవన సూత్రం. జీవన వేదం. నిజంగా జరగాల్సిందే మిటంటే మానవులు ఇంతకు ముందు జరిగిన ఇలాంటి విపత్తులను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే అనేక సమగ్ర విపత్తు నివారణ, నష్ట నివారణ చర్యలు చేపట్టాల్సింది.

పెరుగుతున్న నీటి మట్టాలతో సముద్రాలు ముంబై, కోల్‌కతా నగరాలను భవిష్యత్తులో ముంచెత్తే ప్రమాదముందటున్నారు శాస్త్రవేత్తలు. మన దేశం చుట్టూ విస్తారంగా ఉన్న సముద్ర తీరప్రాంతాలకు కూడా ప్రమాదం ఉండవచ్చు అంటున్నారు. ముఖ్యంగా అత్యంత సారవంతమైన తీరప్రాంతాలు లవణభరితమైన సముద్ర జలాలతో కలుషితమై, పంటభూములు సారాన్ని కోల్పోయి, వ్యవసాయం కష్టతరమవచ్చు. తీరాలలాగే హిమాలయాలలోని హిమనీనదాలు కరిగి, మనకు ఆకస్మిక వరదలు రావడం పరిపాటి అయింది. ఈ సందర్భాలలో శ్రీమద్భాగవతంలోని "పదం పదం యద్ విపదం" అనే ఒక వాక్యం గుర్తుకొస్తుంది. అంటే మానవాళికి అడుగడుగునా విపత్తులుంటాయి అని అర్థం. అందుకే ఇంకా అనేక సమగ్ర అధ్యయనాలుచేపట్టి, పర్యావరణ విపత్తులనుండి మనలను మనం కాపాడుకోవడం ఎంతైనా అవసరం. విపత్తు కలిగించే అవకాశమున్న 47 హిమనీనదసరస్సులను (glacier lakes) హిమాలయ ప్రాంతాలలో గుర్తించినట్లు నివేదికలు తెలియజేస్తున్నాయి. దీన్నిబట్టి సమస్య ఎంత తీవ్రమైనదో మనం అంచనా వేయొచ్చు. నేపాల్ కోసి నది వరద ఉదంతం లాంటి మరో ప్రమాదం పునరావృతం కాకూడదని ఆశిద్దాం. ఇదే చివరి ప్రకృతి విపత్తు కావాలి. ఇలాంటి ఇంకో విపత్తు సంభవించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవ డానికి, పర్యావరణాన్ని అకుంఠితదీక్షతో కాపాడుకోవ డానికి మానవాళి అంతా ఏకమై నడుం కట్టాలి.

**విపత్తులను అధిగమించడానికి సూచనలు**

1. ముందుగా హిమాలయాలనుంచి ప్రభావిత దేశాలలోని అన్ని నదీ పరీవాహక ప్రాంతాలలో వరద ముప్పు ప్రాంతాలను గుర్తించాలి. అక్కడి ప్రజలకు దూరంగా పునరావాసం కల్పించగలగాలి.
2. ఉపగ్రహం ద్వారా మంచుకొండలను, నదీపరీవాహక ప్రాంతాలను నిరంతరం గమనిస్తూ, ఏ చిన్న మార్పు కనిపించినా అంటే మంచు కరగడం, కొండచరియలు విరిగిపడడం, నీటి ప్రవాహానికి తాత్కాలిక అడ్డంకులేర్పడి నీరు ఎక్కువ జమ అవుతూ ఉండడం లాంటివి గమనించి తగు జాగ్రత్తలను హెచ్చరికలుగా చేయాలి.
3. కొండచరియల్లో, నదీ పరీవాహక ప్రాంతాలకు దగ్గరలో ఎటువంటి భారీ తవ్వకాలు, నిర్మాణాలు చేయకపోవడం, పెద్ద పెద్ద ఆనకట్టలు, సొరంగాలు, ఆనకట్టలు, జలవిద్యుత్పాదక ప్రాజెక్టులు చేపట్టరాదు.
4. పర్వత సానువుల మధ్యగా సాగే నదులకు కొండచరియలు విరిగిపడి ఆకస్మిక వరదలొచ్చే ప్రమాదం మెండుగా ఉంటుంది. కనుక అలాంటి నదీ పరీవాహక ప్రాంతాలలో కొత్త గ్రామాలు, నగరాల నిర్మాణాన్ని అనుమతించకూడదు.
5. వాతావరణ మార్పులకు దారి తీసే ఆధునిక విపరీత పోకడలను చాలావరకు ఆచరించరాదు.
6. హిమాలయ పర్వత, లోయ ప్రాంతాలలో తీర్థయాత్రలు, విహార యాత్రలు సంవత్సరంలో బహు కొద్ది సురక్షిత సమయాల్లోనే అనుమతించాలి.
7. వరదలు వచ్చే ప్రాంతాలలో కొన్ని శాశ్వత పునరావాస కేంద్రాలను నిర్మించి, వాటిని ఖాళీగా ఉంచాలి. అత్యవసర పరిస్థితులలో ప్రజలు వెంటనే ఆ సురక్షిత ఆవాసాలకు వెళ్ళగలగాలి.
8. వరదలు వచ్చే నదులమీద ఉన్న ఆనకట్టలు, వంతెనలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాలి.

మానవ సాంకేతిక ప్రగతి గతి తప్పకుండా పరిమితిలో ఉంటే పరిస్థితి మనచేతిలోనే ఉంటుంది. అలా కాకుండా పరిమితి మించితే, మానవ మనుగడ చివరకు అధోగతి పాలవుతుంది అన్న నిజాన్ని ఎప్పుడూ విస్మరించకూడదు.

**"లోకాః సమస్తా సుఖినోభవంతు"**



**మహావాది రామకృష్ణ**



# వృద్ధిరేటు పెరిగినా అసహనమేనా?

**ఈ సంవత్సరం ప్రథమ త్రైమాసికంలో మన దేశం 7.6 శాతం వృద్ధి రేటును సాధించింది. ఈ వృద్ధికి ఉత్పత్తి సేవల రంగాలు చోదకాలుగా ఉన్నాయి. మొదటి త్రైమాసికంలో పెట్టుబడులు 11.9 శాతం చొప్పున, గృహస్తుల వినిమయం 7.1శాతం, ఎగుమతులు 12శాతం పెరిగాయి. అయితే ఈ గణాం కాల విశ్వసనీయతను ప్రశ్నిస్తూ ప్రతిపక్షాలు, మరికొందరు ఆర్థికవేత్తలు, ప్రతిష్ఠిత వ్యక్తులు ఈ అంశాన్ని వివాదాస్పదం చేసే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో లేనంతగా, వృద్ధిరేటుపై వివాదం సృష్టించే ప్రయత్నం ఎందుకు జరుగుతుందనే సందేహం ఎవరికైనా కలగవచ్చు. అంతర్జాతీయ పరిణామాలు (యుద్ధం కారణంగా  చమురు సరఫరా ఇబ్బందులు సహా అనేక కారణాలవల్ల) అనుకూలంగా లేనప్పటికి మన అర్థవ్యవస్థ ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించే రీతిలో వృద్ధి చెందిందంటే, అందులో పాలకుల కృషికి మన్ననలు లభిస్తాయి కనుక రాజకీయపరమైన ఈర్ష్యవల్ల కొందరు దీంట్లో లోపాలు వెదకటం సహజంగా భావించవచ్చు. కానీ ఇదెంతవరకూ సమంజసం?**

చమురు ధరల అనిశ్చితి ప్రభావం మన వ్యవస్థపై పెద్దగా పడకుండా, ఎంతోమంది అంచనాలను తలక్రిందులు చేస్తూ మనం ఈ సంవత్సరం తొలి త్రైమాసికంలో 7.8శాతం వృద్ధిని సాధించటంలో పాలకుల పాత్ర హర్షణీయం. మన స్థూల జాతీయ ఉత్పత్తి స్థిరధరల ఆధారంగా గణిస్తే 81.36 లక్షల కోట్లగా, ప్రస్తుత ధరల ప్రకారం 88.27 లక్షల కోట్ల రూపాయలు నమోదైంది. ఈ సంవత్సరం మన ఉత్పత్తిరంగం 9.2 శాతం వృద్ధిని సాధించింది. అందులో విద్యుత్ పరికరాల ఉత్పత్తి అత్యధికంగా 27శాతం వృద్ధిని సాధించింది. అలాగే మన వస్తు సేవల ఎగుమతుల విలువ 80.36 లక్షల కోట్లుగా, ప్రస్తుత ధరల ప్రకారం 88.27 లక్షల కోట్ల రూపాయలుగా నమోదైంది. అలాగే మన వస్తు సేవల ఎగుమతులు 13.31 శాతం వృద్ధిని సాధించినట్లుగా గుర్తించాలి. ఇటువంటి గణాంకాల విశ్వసనీయతను ప్రశ్నించే రీతిలో, మన వృద్ధిరేటు 7.8 శాతం కాదు కేవలం 2.6 శాతం మాత్రమేనంటూ విపక్షాలు కొంతమంది మాజీ అధికారుల సాయంతో దీనిపై గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు.

అసలు ఇంతకీ ఈ గణాంకాల విషయంలో ఇలాంటి పరిస్థితి ఎందుకు వచ్చిందనే సందేహం కలగవచ్చు. మన స్థిరధరల రేటు గణనలో గతంలో బేస్ ఇయర్ 2011-12గా ఉండేది. మారిన కాలమాన పరిస్థితుల దృష్ట్యా ఈ బేస్ ఇయర్‌ని 2022-23గా మార్చారు. అలా మార్చినంత మాత్రాన స్థూల జాతీయ ఉత్పత్తి గణనలో పెద్దగా వ్యత్యాసాలు రాకుండా జాగ్రత్తలన్నీ తీసుకున్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వ సాధికారిక వివరణ ప్రకారం 2011- 12ని బేస్ ఇయర్‌గా తీసుకుని ఈ సంవత్సర తొలి త్రైమాసిక స్థూల జాతీయ ఉత్పత్తిని గణించినప్పుడు 86.05 లక్షల కోట్లకు చేరింది, అదే 2022-23 ప్రకారం చేస్తే మన స్థూల జాతీయ ఉత్పత్తి 80.32 లక్షల కోట్లుగా గణించారు. ఇలా గణించే విధానం మార్చి నందువల్ల ప్రభుత్వం


వైటల్ హార్వెస్ట్ లో జిఐ రైస్
స్మార్ట్ కార్బోహైడ్రేట్లు మిమ్మల్ని మరింత బలంగా చేస్తాయి
VITAL HARVEST
LOW GI RICE
షుగర్ కంట్రోల్ రైస్
జింక్, అధిక ఫైబర్,
అధిక ప్రోటీన్ సమృద్ధిగా ఉంటాయి.
5 కిలలో మరియు 26 కిలలో లభిస్తుంది.
వాట్సాప్‌లో గాని వెబ్‌సైట్‌లో గాని ఆర్డర్ చేయండి
70329 87770
vitalharvest.in
వికసిత భారత్‌వైపు అడుగులు వేయిస్తున్న
మన ప్రియతమ భారత ప్రధాని
శ్రీ నరేంద్ర మోదీ గారికి
76వ జన్మదిన శుభాకాంక్షలతో..
మీ కన్మంత శ్రీదేవి రెడ్డి
రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, భాజపా, తెలంగాణ, రంగారెడ్డి జిల్లా


మన ప్రియతమ నేత, భారత ప్రధాని
శ్రీ నరేంద్ర మోదీ గారికి
76 వ జన్మదిన శుభాకాంక్షలు
డాక్టర్ కిలారు దిలీప్, న్యాయవాది
రాష్ట్ర అధికార ప్రతినిధి, బిజెపి, ఆంధ్రప్రదేశ్


మన ప్రియతమ నేత, భారత ప్రధాని
శ్రీ నరేంద్ర మోదీ గారికి
76వ జన్మదిన శుభాకాంక్షలు
డాక్టర్ రామిరెడ్డి
రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, భాజపా, తెలంగాణ, కామారెడ్డి జిల్లా

వృద్ధిని ఎక్కువగా చూపించిందనే వాదనలో లోపం ఏంటో ఎవరికైనా అర్థమౌతుంది.

అయితే ఈ విషయాన్ని మరుగున పడేయటానికి అనేక వాదనలను తెరపైకి తీసుకువస్తున్నారు. ప్రభుత్వం ఈ వృద్ధిరేటును గణించేటప్పుడు ద్రవ్యోల్బణం వేరుగా తీసుకుందనే వాదనను కొందరు మాజీ అధికారులు తాము నమ్ముకున్న నాయకులకు తెలియజేశారు. సామాన్య ప్రజలను తప్పుదోవ పట్టించటానికి ఈ వృద్ధిరేటు గణనలో ప్రభుత్వం ద్రవ్యోల్బణాన్ని 2.5శాతంగా తీసుకుందని, వాస్తవానికి వినిమయదారుల ధరల సూచీ ప్రకారం ద్రవ్యోల్బణం 3.9 శాతంగా, టోకు ధరల సూచి ప్రకారం 9శాతం ఉందని ఆ మాజీ అధికారులు చూపే ప్రయత్నం చేశారు. వాస్తవంగా వృద్ధిరేటు గణించే విధానంలో ద్రవ్యోల్బణం వినిమయ ధరల సూచీని, టోకు ధరల సూచీని ఎప్పుడూ తీసుకోరు. ఎందుకంటే వినిమయ ధరల సూచీ కేవలం కొన్ని వస్తువుల ధర ఆధారంగా మాత్రమే గణిస్తారు. దానిలో సమగ్రత లేనందున దానిని ఎప్పుడూ పరిగణనలోకి స్థూల జాతీయ ఉత్పత్తి గణనలోకి తీసుకోరు. ఇక టోకు ధరల సూచీని, వస్తువులు పారిశ్రామిక ఉత్పత్తులు, వాటికి అవసరమైన ముడి సరకుల టోకు ధరల ఆధారంగా గణిస్తారు. కాబట్టి అది కూడా స్థూల జాతీయ ఉత్పత్తి గణనలో సమగ్రతను సూచించదు. కనుక, దానిని కూడా యథాతథంగా తీసుకోరు. స్థూల జాతీయ ఉత్పత్తి గణనలో, గృహస్తుల ఖర్చులు, పెట్టుబడులు, ప్రభుత్వ వ్యయం, ఎగుమతుల విలువ, సేవలవిలువ కూడా ఉంటాయి. కాబట్టి, ఈ స్థూల జాతీయ ఉత్పత్తి వృద్ధి రేటుకు తీసుకునే ద్రవ్యోల్బణాన్ని వేరుగా గణిస్తారు. ఈ విషయం ఆ మాజీ అధికారులకి కూడా తెలుసు. అయినా తాము నమ్ముకున్న నాయకులు ప్రజలకు సులభంగా చెప్పటానికి వీలుపడే విధంగా దీనిని తెరపైకి తెచ్చారు.

గత ఏడాది తొలి త్రైమాసికం మన ఆర్థికవ్యవస్థ 6.9శాతం వృద్ధిని నమోదు చేసింది. ఈ సంవత్సరం మన వృద్ధిరేటు దాదాపు 7శాతం వరకు ఉండవచ్చని గతంలో భారతీయ రిజర్వు బ్యాంకు అంచనా వేసింది. అయితే అంతర్జాతీయ అనిశ్చితి, ప్రతికూల వాతావరణం, డాలర్‌తో రూపాయ మారక విలువ, చమురు ధరలు వంటి అనేక కారణాలవల్ల రిజర్వు బ్యాంక్ అంచనాలు చేరుకోవడం కష్టమని ఈ అధికారులూ, నాయకులే గతంలో తమ అభిప్రాయాల్ని వెలిబుచ్చారు. అయితే వారి అంచనాలకు మించి 7.8 శాతం వృద్ధిరేటును సాధించినట్టు గణాంకాలను విడుదల చేయటం వారిని ఆశ్చర్యానికి గురిచేసి ఉండవచ్చు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఐటి, ఉత్పత్తిరంగం, వృత్తిపరమైన సేవలు, రియల్ ఎస్టేటు పలు రంగాలు ఈ వృద్ధికి ఊతమిచ్చినట్టుగా స్పష్టమౌతుంది. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోకుండా వస్తువుల, సేవల విలువను సూచించే నామినల్ జిడిపి ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 10.3 శాతం వృద్ధిని నమోదు చేసింది.

గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలంలో ఈ వృద్ధి 8.1 శాతం. ఎన్‌డీఏ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, ఆర్థిక వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించటం వంటి చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ విశ్లేషించారు. ఒకవైపు ప్రధానమంత్రి, మరోవైపు ఆర్థిమంత్రి చేసిన వ్యాఖ్యలను కొందరు జీర్ణించుకోలేక, ఈ వృద్ధిని తక్కువచేసే ప్రయత్నం చేస్తున్నట్టుగా అనిపించటంలో ఆశ్చర్యంలేదు. గత ఆరుమాసాలుగా మన వృద్ధిరేటును పెంచటానికి ప్రభుత్వం ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకున్నది. పరోక్ష పన్నుల రేట్లలో మార్పులు– ముఖ్యంగా జీఎస్‌టీ రేట్ల తగ్గింపు, వినిమయవస్తువులపై పన్నుల భారం తగ్గించటం, వడ్డీరేట్ల సవరణలు, అంతర్జాతీయ పరిణామాలవల్ల మన చమురు సరఫరా అంతగా ప్రభావితం కాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు వంటి అనేక చర్యల ఫలితాలు వృద్ధికి దోహదపడ్డాయని చెప్పటానికి పెద్ద ఆర్థికవేత్త అవ్వాల్సిన అవసరంలేదు.



**పరోక్ష పన్నుల రేట్లలో మార్పులు– ముఖ్యంగా జిఎస్‌టి రేట్ల తగ్గింపు, వినిమయవస్తువులపై పన్నుల భారం తగ్గించటం, వడ్డీరేట్ల సవరణలు, అంతర్జాతీయ పరిణామాలవల్ల మన చమురు సరఫరా అంతగా ప్రభావితం కాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు వంటి అనేక చర్యల ఫలితాలు వృద్ధికి దోహదపడ్డాయని చెప్పటానికి పెద్ద ఆర్థికవేత్త అవ్వాల్సిన అవసరంలేదు.**

ఒకవైపు అమెరికా వంటి దేశాల సుంకాల అనిశ్చితి ఉన్నప్పటికి డాలర్‌తో రూపాయి మారకం బలహీనపడటాన్ని అవకాశంగా మార్చుకుని మన ఎగుమ తులను పెంచుకునే ప్రయత్నం చేశాం. మన రూపాయి విలువ బలహీనపడటంవల్ల డాలర్లలో చూసుకున్నప్పుడు మన వస్తువులు చౌకగా అనిపిస్తాయి. ఉదాహరణకు ఒక వస్తువు ధర మన దేశంలో 25 రూపాయలు అనుకుంటే డాలర్ విలువ 75 రూపాయలు ఉన్నప్పుడు ఒక డాలర్‌కి 3 వస్తువులు వచ్చేవి. అదే డాలర్ విలువ 90 రూపాయలు దాటినప్పుడు ఒక డాలర్ కంటే తక్కువకే 3 వస్తువులు వస్తాయి. ఇలా మన రూపాయి 15శాతం బలహీనపడటాన్ని అవకాశంగా మార్చుకుని మన ఎగుమతులను 12 శాతం పెంచుకోగలిగాం. అలాగే గత కొన్ని నెలలుగా మన దేశంలో నూతన పెట్టుబడులు పెరగడం, ముఖ్యంగా సంప్రదాయేతర ఇంధన రంగంలో, మెటల్స్ రంగంలో, డాటా సెంటర్ల రంగంలో పెట్టుబడులు వేగం పుంజుకోవడం కూడా వృద్ధిరేటుపై కొంత సానుకూల ప్రభావం చూపిందని చెప్పవచ్చు. ఒక రకంగా చూస్తే ప్రభుత్వం గతంతో పోలిస్తే చాలా వేగంగా స్పందిస్తోంది. ఉదాహరణకు, పంచదార, ఉల్లిపాయల ధరలు పెరగటం మొదలవ్వగానే ప్రభుత్వం ప్రత్యేక రైళ్ల ద్వారా అవసరమైన చోట్లకి వాటి సరఫరాను పెంచి ధరల పెరుగుదలను నిలువరించే ప్రయత్నం చేసింది. ప్రభుత్వ చర్యలు సరిపోతున్నాయా? అవి ఆశించిన ఫలితాలు ఇస్తున్నాయా? వంటి అంశాలపై భిన్నమైన అభిప్రాయాలు ఉండవచ్చు. మన స్థూల జాతీయ ఉత్పత్తి గణాంకాలు, మన దేశంలో ఏ రంగాలు ఏ

స్థితిలో ఉన్నాయి, కార్పొరేటు సంస్థల ఆదాయాలు పెరుగుతున్నాయా? ధరల పెరుగుదల (ద్రవ్యోల్బణం) ఎలా ఉంది? ఈ ద్రవ్యోల్బణ ప్రభావం వడ్డీరేట్ల ఆదాయాలపై ఏ విధంగా ఉంది వంటి అనేక అంశాలకు ఇది సూచికగా పనిచేస్తుంది. సాధారణ పరిభాషలో చెప్పాలంటే మన దేశంలో ఆర్థిక కార్యకలాపాలు ఎలా ఉన్నాయనే అంశాన్ని తెలియ జెప్పటానికి ఇటువంటి గణాంకాలు ఉపయోగ పడతాయి. మన స్థూల జాతీయ ఉత్పత్తి వృద్ధిరేటు ఒక కొలమానం మాత్రమే. అది సమగ్రంగా మన అర్థవ్యవస్థను ఆవిష్కరించదనే అంశాన్ని గుర్తించాలి.

ఇలా చెబితే కొంతమంది ఆర్థికవేత్తలకి బాధకలుగవచ్చు. దేశంలో కొంతమంది గృహస్తుల వినిమయం తగ్గి వారు అవస్థలు పడుతున్నా, కొన్ని






రంగాలలో పరిశ్రమలు ఇబ్బందులకు లోనై లాభాలు, ఆదాయాల క్షీణతను అడ్డుకోలేక ఉక్కిరిబిక్కిరి అవ్వవచ్చు. కొన్ని రంగాలలో కార్యకలాపాలు గతం కంటే తగ్గవచ్చు. అయినా సరే, ఒక్కొక్కసారి జీడీపీ మంచి వృద్ధిరేటును సూచించ వచ్చు. అందుకే ఈ గణాంకాలను అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి. జీడీపీకీ, జీవీఏకి మధ్యలో ఉండే తేడాని కూడా మనం గమనించాలి. జీడీపీ గణనలో పన్నులు, సబ్సిడీలను కూడా పరిగణలోకి తీసుకుంటారు. అదే జివిఏ గణనలో కేవలం వస్తుసేవల విలువను మాత్రమే తీసుకుంటారు. ఏ రంగంలో జీవీఏ ఎంత పెరిగింది అనే వివరాలు మనకు మెరుగైన అవగాహనకు ఉపయోగ పడతాయి. ఈ వివరాల లోకి వెళ్లినపుడు మన వ్యవసాయరంగం కేవలం 3.6 శాతం వృద్ధిపొందగా, మైనింగ్ రంగం వృద్ధి గతంకంటే తగ్గి 22.4గా నమోదైంది. అందుకని మన ప్రాథమిక రంగం వృద్ధిరేటు 2.4గా నిలిచింది. ప్రాథమిక రంగంలో వ్యవసాయం, పశుసంపద, అటవీ ఉత్పత్తులు, మత్స్యసంపద, మైనింగ్, క్వారీ కలిసి ఉంటాయి. ఈ రంగాలలో వృద్ధి ఎక్కువ లేనప్పుడు, జీడీపీ వృద్ధిలో మన జనాభా మొత్తం భాగస్వామ్యం ఒకేరీతిలో లేదని అర్థం చేసుకోవచ్చు. అలాగే కేవలం ప్రజల వినిమయం, లేక ప్రభుత్వ ఉత్ప్రేరకాల వల్ల మాత్రమే మన జీడీపీ వృద్ధి చెందిందని చెప్పలేం. ఎందుకంటే మన పెట్టుబడులు 11.9 శాతం చొప్పున పెరిగాయి. ప్రైవేటు వినిమయం 7.1శాతం చొప్పుని వృద్ధి చెందింది. ప్రభుత్వ వ్యయం 4.3శాతం పెరిగింది. మన గణాంకాల విశ్లేషిస్తున్నప్పుడు మన ఉత్పత్తి పెరిగి, దానికి తగ్గట్టుగా వినిమయం పెరగకపోతే, ఉత్పత్తి దారుల వద్ద స్టాక్ పెరుగుతున్నదా అనే అంశాన్ని కూడా చూసుకోవాలి.

ఈ త్రైమాసికంలో అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం మన స్టాక్ అంతగా పెరగలేదు. ఉత్పత్తి పెరిగి, దానికి తగ్గట్టు వినిమయం పెరగనప్పుడు స్టాక్ ఎలా పెరగకుండా ఉంటుందనే అనుమానం కలగవచ్చు. మన ఎగుమతులు 12 శాతం పెరిగి వాస్తవ దిగుమతులు 1.1 శాతం తగ్గాయి కాబట్టి గణాంకాలను విశ్వసనీయమైనవిగా భావించవచ్చు. అయితే మన వృద్ధిరేటు ఎక్కువగా సేవల రంగం నుంచి వచ్చిందని గుర్తించాలి. సేవలరంగం వృద్ధి దీర్ఘకాలంలో స్థిరమైన వృద్ధిని అందించగలదా అనే అంశంపై భిన్నమైన వాదనలు ఉన్నాయి. అలాగే మన వృద్ధిరేటుకు తగ్గట్టుగా మన ఉపాధి అవకాశాలు మెరుగుపడటంలేదు. ఈ సంవత్సరం తొలి త్రైమాసికంలో 15ఏళ్లకి పైబడిన కార్మిక శక్తిలో రెగ్యులర్ వేతనజీవుల వాటా స్వల్పంగా పెరగటం శుభసూచకంగా భావించినా, నిరుద్యోగం రేటు గ్రామీణ ప్రాంతంలోనూ, పట్టణ ప్రాంతంలో కూడా పెరిగింది. అలాగే మన జనాభా కార్మిక నిష్పత్తి కూడా 52.8 శాతం నుంచి 51.7 శాతానికి తగ్గింది. మొత్తంమీద చూసుకుంటే కార్మిక శక్తి,ఉపాధి కల్పన వంటి వాటిల్లో ఫలితాలు ఆశాజనకంగా లేవు. వృద్ధిరేటు పెరిగిన స్థాయిలో మన దేశంలో ఉపాధి అవకాశాలు పెరగకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఉపాధి అవకా శాలు పెంచటానికి తీసుకోవలసిన చర్యలపై నిపుణుల సూచనల మేరకు అనేక సంస్కరణలను ప్రవేశపెట్టటం జరిగింది. అందులో భాగంగానే ప్రధానమంత్రి వికసిత భారత్ రోజ్‌గార్ యోజన అమలు జరిగి, ఉపాధి కల్పిస్తున్న యాజమాన్యాలకు ప్రోత్సాహకాలు ఇవ్వటం మొదలుపెట్టారు. మన దేశంలో ప్రధానమైన సమస్యలలో ఒకటి నిరుద్యోగం. చాలా మంది విశ్వవిద్యాలయాల నుంచి పట్టాలు అందుకున్నా ఉద్యోగం దొరకక ఇబ్బంది పడుతు న్నారు. పరిశ్రమ లకు, ఉపాధి కల్పించే సంస్థలకు అవసరమైన నైపుణ్యాలు మన విద్యా విధానంలో సరిగా లేకపోవడమని చాలామంది అభిప్రాయం. అందుకే, నైపుణ్యం పెంచటానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ విధానపరమైన మార్పులు చేశారు. స్కిల్ ఇండియా మిషన్ క్రింద ఆధునిక పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా నైపుణ్యాలను మెరుగు పరచటానికి భారీ కార్యక్రమాన్ని అమలుచేశారు. అలాగే దేశంలో ఐటీఐలలో మెరుగైన పద్ధతిలో శిక్షణ ఇవ్వడానికి చర్యలు తీసుకున్నారు.

| జీవన త్రైమాసిక విలువ (స్థిర ధరలలో) | | | |
|---|---|---|---|
| | 2025-26 | 2026-27 | వృద్ధి |
| **ప్రాథమిక రంగం** (వ్యవసాయం పశుసంవర్ధన, మత్స్య, మైనింగ్ వగైరా) | 13,56,557 | 13,96,196 | 2.9% |
| **సెకండరీ రంగం** (ఉత్పత్తి/తయారీ విద్యుత్, గ్యాస్, నిర్మాణం వగైరా) | 17,44,684 | 18,94,802 | 8.6% |
| **టెరిష్యరీ రంగం** (ఆర్థికసేవలు,ఐటి ట్రైన్స్‌పోర్ట్, హోటల్స్ వగైరా) | 37,19,880 | 40,91,454 | 10% |
| **నికరపన్నులు** (Net Taxes) | 7,25,108 | 7,53,700 | 3.9% |
| **జీడీపీ** | 75,46,230 | 81,36,153 | 7.8% |



ఉత్పత్తిరంగంలో ఉపాధి పెంచినవారికి (సంస్థలకు) వారు చెల్లిస్తున్న వేతనాల ఆధారంగా ప్రోత్సాహకాలు ఇవ్వటం మొదలుపెట్టారు. PMVBRY క్రింద గత సంవత్సరం రూ.99446 కోట్లను ప్రోత్సాహకాలు ఇవ్వటానికి ఖర్చుచేశారు. ఇన్నిరకాల ప్రయత్నాలు చేసినప్పటికి 15 నుంచి 26 సంవత్సరాల మధ్య వయసులో ఉన్నవారి నిరుద్యోగ రేటు 12 శాతం వరకు ఉన్నది. పట్టభద్రులైన పురుషులలో దాదాపు 30శాతం, మహిళలలో 37 శాతం నిరుద్యోగులుగా ఉన్నారు. ఇటీవల నీతీ ఆయోగ్ జరిపిన అధ్యయనం ప్రకారం మన దేశంలో 87 కోట్లమంది15 నుంచి 29 సంవత్సరాల వయసులోని వారు అటు ఉపాధి, నైపుణ్య శిక్షణ లేక నిరుద్యోగులుగా ఉన్నారు. ఒకప్పుడు  పట్టభద్రులను సమాజం ఎంతో గౌరవంగా చూసేది. వారికి ఏదో ఒక ఉద్యోగం కూడా వచ్చేది. ఇప్పుడు వారే అత్యధిక శాతం నిరుద్యోగులుగా ఉంటున్నారు. అలా అని ఇంజనీరింగ్ చదివినవారి పరిస్థితి బాగుందా అంటే ప్రతి అయిదుగురు ఇంజనీరింగ్ పట్టభద్రులలో కనీసం  ఒక్కరు నిరుద్యోగులుగా ఉన్నారు.

అన్ని రంగాలలో యాంత్రీకరణ పెరగడం, రోబోలు, ఏఐ వంటి వినియోగం పెరగటం, అనేక సంస్థలలో ప్రవేశస్థాయి ఉద్యోగాలు తగ్గటం, వ్యాపారంలో విపరీతమైన పోటీ, సమాజంలో విలువలు తగ్గి అవినీతిపెరగటం వంటి అనేక కారణాలవల్ల క్రమంగా ప్రవేశ స్థాయి ఉద్యోగాలు తగ్గిపోతున్నాయి. మరోవైపు చిన్న, సూక్ష్మ సంస్థలలో యాంత్రీకరణ వంటివి అంతగా లేకపోవటంవల్ల వాటిలో ఉపాధి అవకాశాలు ఉన్నా, వాటిల్లో పనిచేయడానికి చాలామంది ఇష్టపడటం లేదని ఇటీవల జరిపిన అధ్యయనంలో తేలింది. ఈ సంస్థలలో చేరినవారు దాదాపు అన్నీ తామై పని చేయాల్సిన అవసరం ఉండటం, సాంఘిక భద్రత లేకపోవడం, ఇందులో పనిచేసే వారికి సమాజంలో పెద్దగా గుర్తింపులేక పోవడం, తక్కువ వేతనం వంటి అనేక కారణాలవల్ల ఈ సూక్ష్మ సంస్థలలో ఉపాధి పొందటానికి యువత ఇష్టపడటంలేదు. ఇలాంటి సమస్యలపై అధ్యయనాలు జరిపించి పరిష్కారాలు కనుగొనడానికి ప్రయత్నాలు జరుగుతున్నా, ఆశించిన ఫలితాలు సమాజానికి అందటంలేదు. ఈ కారణంవల్ల దేశం సాధించిన వృద్ధిరేటును అంగీకరించమనే ధోరణి మంచిది కాదు.

ప్రభుత్వం ఈ వృద్ధిరేటు గణించటానికి పరిగణనలోకి తీసుకుని బేస్ ఇయర్‌ని మార్చటం ఇదే తొలిసారి కాదు అనే విషయం తెలిసినదే. స్వాతంత్ర్యానంతరం దీనిని 9 సార్లు మార్చారు.

| **బేస్ ఇయర్** | **ఎప్పుడు మార్చారు** |
|---|---|
| 1948-49 | 1959 |
| 1960-61 | 1967 |
| 1970-71 | 1978 |
| 1980-81 | 1998 |
| 1993-94 | 1999 |
| 1999-2000 | 2006 |
| 2004-2005 | 2010 |
| 2011-2012 | 2015 |
| 2022-23 | 2026 |

పైన పేర్కొన్న పట్టికలోని వివరాలు చూసినప్పుడు ఇది కాలానుగుణంగా జరిగే సర్దుబాటు అనే విషయం అందరికీ అర్థమౌతుంది. పోనీ ఇలాంటి మార్పులు కేవలం మన దేశంలోనే జరుగుతున్నాయా? అంటే అదీలేదు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలలో ఇది సాధారణంగా జరిగే అంశమే. అయినా ఈసారి దానిని  ఒక వివాదంగా మలిచే ప్రయత్నం జరిగింది. దేశం గణనీయమైన వృద్ధిరేటును సాధించి విషయం కొంతమందికి మింగుడు పడకపోవచ్చు. ఇలా వృద్ధిరేటు గణాంకాలను ప్రశ్నించటం, వృద్ధిరేటు పెరగడాన్ని తక్కువ చేయాలనే ప్రయత్నం చేయటం, ఈ అంశంపై వివాదాన్ని రేపే ప్రయత్నం చేయటం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా ఎన్‌డీఏ పాలనలో హెచ్చు వృద్ధిరేటును సాధించిన ప్రతిసారీ చిదంబరం, జైరాంరమేశ్ ఇలా ఎవరో ఒకరి నాయకత్వంలో ఇటువంటి సంఘటనలు జరిగాయి. ప్రజలకు వాస్తవాలు సరిగా తెలియజెప్పే ప్రయత్నం చేయకపోతే ఇటువంటివి జరుగుతూనే ఉంటాయి. ఈసారి వివాదాన్ని రేపడానికి మాజీ అధికారులను వాడుకున్నారని చెప్పక తప్పదు. మరో మాజీ అధికారి రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్‌గా కూడా చేసిన రఘురామ్ రాజన్ మన అర్థవ్యవస్థ  ఇంత పటిష్టంగా వృద్ధి చెందుతున్నా యువతకు ముఖ్యంగా పట్టభద్రులకి మంచి ఉపాధి అవకాశాలు ఎందుకు కల్పించలేక పోతున్నాం? విదేశీ ప్రత్యక్షపెట్టుబడులు ఎందుకు గణనీయంగా పెరగటంలేదు? ఇలా ప్రశ్నలని సంధిస్తూ ప్రభుత్వం చిప్స్‌తయారీకి అత్యంత ప్రాధాన్యతను ఇవ్వడాన్ని కూడా తప్పుపట్టారు.

అంతటితో ఆగక మన సాంకేతిక ముఖ్యంగా సమాంతర సాంకేతికకు అవసరమైన ఉత్పత్తులకు భారత్‌లో తయారుచేయాలనే ప్రభుత్వ విధానాన్ని హేళన చేస్తూ మైక్రోచిప్స్ చాలా ఉన్నాయి కనుక, వాటిని సునాయాసంగా విదేశాల నుంచి స్మగ్లింగ్ చేసుకోవచ్చని కూడా వ్యాఖ్యానించారు. ఇటువంటి వ్యాఖ్యలనుబట్టి వారి ప్రాధాన్యతలేంటో స్పష్టమౌతుంది. వాస్తవంగా దేశ హితంతో ఆలోచించే మాజీ అధికారులెవరైనా ఈ వృద్ధిని విమర్శించ దలుచుకుంటే వేరే విధంగా ప్రభుత్వానికి సూచనలు చేయవచ్చు.

అంతేకానీ, ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న దేశంగా అంతర్జాతీయ గుర్తింపు పొందుతున్న అంశాన్ని అనవసర వివాదాలలోకి లాగి గణాంకాల విశ్వసనీయలను ప్రశ్నించటం మాజీ అధికారుల స్థాయికి తగదు. ఇలాంటి పరిస్థితులు కొనసాగితే ఎంతో ఉన్నత స్థాయిలో పనిచేసినా కొంతమంది ఆలోచనలు అంతా ఉన్నతంగా ఉండవనే భావన ప్రజలకు బలపడుతుంది.

**– సాయి, ఆర్థిక నిపుణులు**

ప్రాథమిక రంగంలో వ్యవసాయం, పశు సంపద, అటవీ ఉత్పత్తులు, మత్స్యసంపద, మైనింగ్, క్వారీ కలిసి ఉంటాయి. ఈ రంగాలలో వృద్ధి ఎక్కువ లేనప్పుడు, జీడీపీ వృద్ధిలో మన జనాభా మొత్తం భాగస్వామ్యం ఒకేరీతిలో లేదని అర్థం చేసుకో వచ్చు. అలాగే కేవలం ప్రజల వినిమయం, లేక ప్రభుత్వ ఉత్ప్రేరకాల వల్ల మాత్రమే మన జీడీపీ వృద్ధి చెందిందని చెప్పలేం. ఎందుకంటే మన పెట్టుబడులు 11.9 శాతం చొప్పున పెరిగాయి. ప్రైవేటు వినిమయం 7.1శాతం చొప్పున వృద్ధి చెందింది.



# జయహెూ జీడీపీ

భారత ప్రభుత్వం సాధించిన అత్యంత కీలకమైన మైలురాళ్లలో ఒకటి మొదటి త్రైమాసిక (Q1) జీడీపీ 7.8%గా నమోదు కావడం. 2026–27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్ 2026) భారతదేశం సాధించిన 7.8% వాస్తవ జీడీపీ (Real GDP) వృద్ధి రేటు చాలా బలమైన సంఖ్య; ముఖ్యంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందకొడి వృద్ధి రేటుతో పోల్చినప్పుడు ఇది చాలా గొప్ప విషయం. తాజా అధికారిక గణాంకాల ప్రకారం వాస్తవ జీడీపీ రూ. 81.36 లక్షల కోట్లుగా ఉండగా, నామినల్ జీడీపీ 10.3% వృద్ధిని నమోదు చేసింది.

**భారతదేశం VS ప్రపంచం**

భారత్ జీడీపీ వృద్ధి రేటు 7.8% కాగా ప్రపంచం వృద్ధి రేటు 3.0%గా మాత్రమే నమోదైంది. భారత వృద్ధి ఆధిక్యత ప్రపంచ వృద్ధి కంటే 4.8 శాతం పాయింట్లు ఎక్కువగా ఉంది. తయారీ రంగం 9.2% వృద్ధితో సాధారణంగా బలహీనమైన ప్రపంచ పారిశ్రామిక వృద్ధి వేగాన్ని తోసిరాజనంది. సేవా రంగం 10% వృద్ధితో అనేక ఆర్థిక వ్యవస్థలకు సేవా రంగమే ప్రధాన ఆధారంగా ఉంది. ప్రైవేట్ పెట్టుబడులు 11.9% వృద్ధితో భారతదేశంలో పెట్టుబడుల పునరుజ్జీవనం కనిపిస్తోంది. ప్రైవేట్ వినియోగం 7.1% వృద్ధితో బలమైన దేశీయ డిమాండ్ కనిపిస్తోంది. వాస్తవ స్థూల విలువ జోడింపు (GVA) 8.2% గా ఉంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి(IMF) జూలై, 2026 అంచనాల ప్రకారం 2026లో ప్రపంచ వృద్ధి కేవలం 3.0%గా ఉంది. అంటే, భారతదేశం సాధించిన 7.8% త్రైమాసిక వృద్ధి రేటు, అంచనా వేసిన ప్రపంచ వృద్ధి రేటు కంటే 2.5 రెట్లు ఎక్కువ.

**గమనించవలసిన 7 ముఖ్యమైన అంశాలు**

**1.వేగవంతమైన ఆర్థిక వ్యవస్థ**

భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోంది. 7.8% త్రైమాసిక వృద్ధి రేటు, అంచనా వేయబడిన 3% ప్రపంచ వృద్ధి రేటు కంటే గణనీయంగా ఎక్కువ. ఇది ప్రపంచ ఆర్థిక వృద్ధికి ప్రధాన భాగస్వామిగా భారతదేశం యొక్క స్థానాన్ని మరింత బలపరుస్తుంది.

**2. విస్తృతమైన వృద్ధి**

వృద్ధి అనేది విస్తృత ప్రాతిపదికన (broad-based) సాగుతోంది. తయారీ రంగం 9.2% వృద్ధి చెందగా, సేవా రంగం కూడా బలమైన విస్తరణను నమోదు చేసింది. భారతదేశ వృద్ధి కేవలం ఒక రంగానికి మాత్రమే పరిమితం కాకుండా ఉండటం దీనికి ముఖ్య కారణం.

**3. జోరుగా ప్రైవేట్ పెట్టుబడులు**

ప్రైవేట్ పెట్టుబడులు వృద్ధికి ప్రధాన చోదక శక్తిగా మారుతున్నాయి. ప్రైవేట్ పెట్టుబడులు ఏడాది ప్రాతిపదికన సుమారు 11.9% పెరిగాయి. ఇది గణనీయమైన పురోగతి మరియు పెట్టుబడుల చక్రం బలపడుతోందనడానికి సంకేతం.

**4.దివ్యంగా దేశీయ వినియోగం**

దేశీయ వినియోగం దృఢంగా కొనసాగుతోంది. ప్రైవేట్ వినియోగం 7.1% పెరిగింది. బాహ్య పరిస్థితులు అనిశ్చితంగా ఉన్నప్పటికీ, భారతదేశం యొక్క భారీ దేశీయ మార్కెట్ సామర్థ్యాన్ని ఇది చాటిచెబుతోంది.

**5.అంచనాలను మించి రాణింపు**

7.8% వృద్ధి రేటు, ఆర్‌బిఐ యొక్క 7% అంచనా మరియు ఆర్థికవేత్తల సుమారు 7.1% అంచనాల కంటే గణనీయంగా ఎక్కువగా ఉంది.

**6. ప్రపంచ ప్రతికూలతల మధ్య వృద్ధి**

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఇంధన ధరల ప్రమాదాలు, ప్రపంచ వాణిజ్య అనిశ్చితి క్లిష్ట పరిస్థితులను సృష్టించాయి. 7.8% వృద్ధిని కొనసాగించగల భారతదేశ సామర్థ్యం, గణనీయమైన దేశీయ ఆర్థిక స్థితిస్థాపకతను ప్రదర్శిస్తుంది.

**7. వృద్ధి నాణ్యత కీలకం**

వాస్తవ స్థూల విలువ జోడింపు (GVA) 8.2%, పెట్టుబడి 11.9%, వినియోగం 7.1%, 12% పెరిగాయి. ఈ కలయిక, ఈ విస్తరణకు ఒక తాత్కాలిక కారకం కాకుండా ఆర్థిక వ్యవస్థలోని బహుళ అంశాలు మద్దతు ఇస్తున్నాయని సూచిస్తుంది.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సుమారు 3% వృద్ధి చెందుతుండగా, భారతదేశం 7.8% వృద్ధిని సాధిస్తోంది. ఇది కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదు. ఇది భారతదేశ ఆర్థిక స్థితిస్థాపకత, విస్తరిస్తున్న తయారీ రంగం, పెరుగుతున్న ప్రైవేట్ పెట్టుబడులు, బలమైన దేశీయ వినియోగానికి నిదర్శనం. భారతదేశం ప్రపంచ వృద్ధిలో కేవలం పాలుపంచుకోవడమే కాదు. అది అంతకంతకూ దానిని నడిపిస్తోంది. 7.8% అనేది భారతదేశం సంవత్సర వారీ త్రైమాసిక వృద్ధి రేటు కాగా, అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) వెల్లడించిన 3% అనేది వార్షిక ప్రపంచ వృద్ధి అంచనా. అందువల్ల, ఈ పోలికను కచ్చితమైన గణాంక పోలికగా కాకుండా, భారతదేశ వృద్ధి ప్రయోజనం స్థాయిని వివరించడానికి ఉత్తమంగా ఉపయోగించవచ్చు.



**డాక్టర్ కిలారు దిలీప్**
బీజేపీ ఏపీ రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జ్

# వినాయక చవితి శుభాకాంక్షలు

ASVINS
Specialty Hospitals
Care•Cure•Comfort

**40+** Years of Oncology Expertise
Over **7,00,000** Patients Treated
**75,000** Successful Surgeries





**Dr. G. Suryanarayana Raju**
M.S. Mch, FRCS, FUICC
Chief of Surgical Oncology
40+ Years of Experience



**Dr. D. Raghunadharao**
MD, DM, FRCP (London), FACP
Chief of Medical Oncology
40+ Years of Experience

Expert Treatment At Affordable Prices

We Expertise in Treating All Cancers

We do all types of Radical, Organ Sparing and Laparoscopic Surgeries

## SERVICES

**SURGICAL SPECIALTIES:**

Anaesthesiology • Breast Surgery • Bone & Soft Tissue Tumors • Gynaecology & Gynaec Oncology Head & Neck Oncology • Minimal Access Surgery • Neurosurgery • Plastic & Reconstructive Surgery • Surgical Oncology Thoracic Oncology • Transplant Surgery • Urology, Andrology & Endo Urology • Vascular Surgery

**MEDICAL SPECIALTIES:**

Bone Marrow Transplant • Cardiology • Chest Medicine • Endocrinology • Gastroenterology Hematology & Hemato Oncology • Internal Medicine • Intensive Care • Medical Genetics • Medical Oncology • Nephrology & Dialysis • Neurology • Orthopaedic & Rheumatology

## Asvins Specialty Hospitals

6-3-903/A&B, Raj Bhavan Road, Somajiguda, Hyderabad, Telangana 500082.

Book Your Consultation Now +91 9440445775

www.asvinshospitals.com

భీమవరంలో
# అశ్విన్ క్యాన్సర్ కేర్

**ప్రతి నెల మొదటి ఆదివారం**

ప్రముఖ సర్జికల్ అంకాలజిస్ట్



**డా॥ జి. సూర్యనారాయణ రాజు**
M.S. MCh, FRCS, FUICC సర్జికల్ అంకాలజీ అధినేత
వ్యవస్థాపక డైరెక్టర్, అశ్విన్స్ స్పెషలిటీ హాస్పిటల్స్
మాజీ సభ్యుడు, MARB, NMC, న్యూఢిల్లీ
మాజీ సహచరుడు. రీసెర్చ్ & ప్రాజెక్ట్స్ డీన్, రిజిస్ట్రార్, ప్రొఫెసర్
మరియు సర్జికల్ అంకాలజీ వ్యవస్థాపక అధిపతి, నిమ్స్

ప్రముఖ గైనో అంకాలజిస్ట్



**డా॥ రమణి GSV**
MS, OBG
కన్సల్టెంట్ గైనకాలజీ, గైనక్ అంకాలజీ &
ప్రివెంటివ్ అంకాలజీ

**అభినవ్ డయగ్నోస్టిక్స్, జెపి రోడ్, ఆనంద బ్లడ్ బ్యాంకు దగ్గర, భీమవరం**
**08816 224338**

**ప్రతి నెల రెండవ ఆదివారం**

ప్రముఖ హెమటో అంకాలజిస్ట్



**డా॥ గెంటే. విక్రమ్ కుమార్**
MBBS, MD ఇమ్యునో- హెమటాలజీ మరియు రక్త మార్పిడి (JIPMER),
పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ ఇన్ క్లినికల్ హెమటాలజీ (CMC వెల్లూర్), కన్సల్టెంట్ హెమటాలజీ మరియు హెమటో- అంకాలజీ

**లోటస్ డయగ్నోస్టిక్స్, జెపి రోడ్, ఆనంద బ్లడ్ బ్యాంకు దగ్గర, భీమవరం 08816 230555**

మిత్రా మెడికేర్ హాస్పిటల్, నిర్మలాదేవి ఫంక్షన్ హాల్ దగ్గర, పెదమిరం, పెద్ద అమిరం.

అపాయింట్మెంట్ కొరకు అచ్చయ్య: **98858 45775** సీత: 9618161032



# కరవు నేలల

**మూడు దశాబ్దాలుగా ఎదురుచూసిన కల ఎట్టకేలకు సాకారమైంది. ఆగస్టు 31న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను, సెప్టెంబరు 2న పోలవరం ఎడమ ప్రధాన కాలువను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా జాతికి అంకితం చేశారు. తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీల కూటమి అధికారంలోకి వచ్చాక వరుసగా జరిగిన ఈ రెండు ప్రారంభోత్సవాలు రాష్ట్రంలోని కరవు పీడిత జిల్లాల చరిత్రలో మైలురాళ్లుగా నిలిచిపోనున్నాయి.**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి పలు ప్రభుత్వాలు ప్రతిపాదించి, పూర్తి చేయలేకపోయిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు తొలిదశలు ఎట్టకేలకు వాస్తవ రూపం దాల్చాయి. కృష్ణా నదీ జలాలను వెలిగొండ జంట సొరంగాల ద్వారా నల్లమలసాగర్‌కు చేర్చే ఏర్పాటు ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల్లోని కరవు మండలాలకు ఊరటనివ్వగా, గోదావరి జలాలను తూర్పు కనుమలు దాటించి ఉత్తరాంధ్రకు తరలించే పోలవరం ఎడమ కాలువ తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ, అనకాపల్లి జిల్లాలకు కొత్త జీవం పోయనుంది. ఈ రెండు ప్రాజెక్టులు కలిసి రాయలసీమ అంచు ప్రాంతాలను, దక్షిణ కోస్తాను, ఉత్తర కోస్తాను కృష్ణా, గోదావరి జలాలతో అనుసంధానించనున్నాయి. దశాబ్దాలుగా వర్షాధార బతుకులు గడిపిన ఈ ప్రాంతాల ప్రజలకు ఇకపై సాగు, తాగునీటి భరోసా లభించనుంది. గోదావరి–కృష్ణా, గోదావరి–వంశధార నదుల అనుసంధానంలో ఇవి కీలక ఘట్టాలుగా నిలుస్తాయి.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో, కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లా పరిధిలో నెలకొన్న నీటి కష్టాలు వర్ణనాతీతం. మార్కాపురం, కనిగిరి, పొదిలి ప్రాంతాల్లోని చెరువులు వర్షాకాలంలో వరద నీటితో నిండినా, ఆ తర్వాత కొద్ది రోజుల్లోనే అడుగంటి పోతాయి. భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉండటంతో తాగునీరు కలుషితమై, స్థానికులు ఏళ్ల తరబడి ట్యాంకర్ల ద్వారా సరఫరా అయ్యే నీటిపైనే ఆధారపడాల్సి వస్తోంది. 'వర్షం కురిస్తేనే పంట.. లేదంటే పస్తులే' అన్నట్టుగా సాగింది ఇక్కడి రైతుల జీవనం. సాగునీరు లేక భూములు బీళ్లుగా మారడంతో పాటు, కరవు కాలాల్లో పశువులకు మేత దొరక్క, పోషణ భారమై, పలువురు రైతులు తమ పశు సంపదను తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉపాధి కోసం పట్టణాలకు వలస వెళ్లే కుటుంబాలు సైతం ఈ ప్రాంతంలో తక్కువేమీ కాదు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తికి గడువును 2020, 2022, 2023 సంవత్సరాల్లో పలుమార్లు ప్రకటించినా, అవి ఆచరణలోకి రాక ప్రజల ఎదురుచూపులు మరింత సాగాయి. ఫ్లోరైడ్ ప్రభావిత జలాలతో బాధపడుతున్న లక్షలాది మందికి సురక్షిత తాగునీరు, వేలాది ఎకరాలకు సాగునీటి భరోసా కల్పించడం వెలిగొండ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా నిర్దేశితమైంది. మార్కాపురం గుండా ప్రవహించే గుండ్లకమ్మ నదిపై ఆధారపడిన చిన్న చెరువులు తప్ప, ఈ ప్రాంతానికి శాశ్వత సాగునీటి వనరులు ఎన్నడూ లేకపోవడం ఒక చారిత్రక లోటుగా మిగిలింది.

అటు అల్లూరి సీతారామరాజు మన్యం, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లోనూ పరిస్థితి భిన్నంగా ఏమీ లేదు. మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో సాగునీరు కాదు కదా, తాగునీరు కూడా అందని ద్రాక్షగానే మిగిలింది. వర్షాభావంతో పొలాలు ఎండిపోవడం, భూగర్భ జలమట్టాలు పడిపోవడం ఆనవాయితీగా మారాయి. ఈ నేపథ్యంలో గోదావరి జలాలను తమ ప్రాంతానికి తరలించే పోలవరం ఎడమ కాలువ కోసం ఇక్కడి ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూశారు. "దశాబ్దాల కల నెరవేరింది" అని స్థానిక మీడియా అభివర్ణించినంతగా ఈ ప్రాంత ప్రజలు దీని కోసం వేచి చూశారు. సాంకేతికంగా చూస్తే, ఈ కాలువ గోదావరి నీటిని నాలుగు నదులు దాటిస్తూ, తూర్పు కనుమల గుండా సాగుతూ ఉత్తరాంధ్రకు చేరుస్తుంది. పాయకరావుపేట వద్ద నిర్మించిన గేట్లను తెరిచి, ఏలేరు నదీగర్భానికి దిగువన సైఫన్ ఏర్పాటు ద్వారా ఈ జలాలను అనకాపల్లి వైపు మళ్లించారు. తాండవ, వరాహ, మామిడిగెడ్డ పరిధిలోని 46,620 ఎకరాలకు ఇది మేలు చేస్తుంది. గోదావరి, వంశధార నదులను అనుసంధానించి ఉత్తరాంధ్రకు శాశ్వత సాగునీటి వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నది దీని అంతిమ లక్ష్యం. ఈ అనుసంధానం పూర్తయ్యాక అనకాపల్లితో పాటు విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలకూ గోదావరి జలాలు చేరనున్నాయి. అటు వెలిగొండ ప్రాజెక్టు శ్రీశైలం జలాశయం నుంచి జంట సొరంగాల ద్వారా కృష్ణా వరద జలాలను నల్లమల సాగర్‌కు తరలించే గ్రావిటీ పద్ధతిలో రూపొందించిన అతిపెద్ద ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచింది. కరవు నుంచి విముక్తి పొందాలని దశాబ్దాలుగా ఎదురుచూసిన ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలకు ఈ ప్రాజెక్టు పూర్తి ఒక కీలక సమాధానంగా నిలుస్తుంది.

ఖర్చులు, జల లభ్యత విషయానికొస్తే, రూ.10,200 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వెలిగొండ ప్రాజెక్టులో ఇప్పటివరకు రూ.7,983 కోట్లు ఖర్చు చేసి, 18.8 కిలోమీటర్ల జంట సొరంగాలు, 21.8 కిలోమీటర్ల ఫీడర్ కాలువలతో మొదటి దశను పూర్తి చేశారు. రెండో సొరంగంలో మిగిలిన లైనింగ్ పనులను,అందులో చిక్కుకున్న సొరంగం తవ్వే యంత్రం తొలగింపును హైకోర్టు అనుమతితో జూలై 2026 నాటికి పూర్తి చేశారు. ప్రస్తుతానికి 10.70 టీఎంసీల జలాలను నల్లమల సాగర్‌కు మళ్లించనుండగా, మిగిలిన పనులకు మరో రూ.1,900 కోట్లు అవసరమని, రెండో దశను 2028 నాటికి పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మొత్తంగా 30 మండలాల్లోని 4.47 లక్షల ఎకరాలకు సాగునీటి స్థిరీకరణ, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లోని 15.25 లక్షల మందికి తాగునీరు అందించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. మరోవైపు, కేంద్ర జల్ శక్తి శాఖ రూ.30,436.95 కోట్లకు సవరించిన అంచనాకు ఆమోదం తెలిపిన పోలవరం ప్రాజెక్టులో, తొలి దశను 41.15 మీటర్ల మట్టం వరకు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో ఎడమ కాలువ నిర్మాణం కోసమే ఇప్పటి వరకు రూ.4,192 కోట్లు వెచ్చించారు. ఈ కాలువ ద్వారా 23.44 టీఎంసీల గోదావరి జలాలను సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలకు వినియోగించుకునే వీలుండగా,



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్



# కు జీవజలాలు

తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ, అనకాపల్లి జిల్లాల్లోని 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 5.23 లక్షల మందికి తాగునీరు అందనుంది. నిర్వాసిత కుటుంబాలకు పరిహారం కింద పోలవరంలో రూ. 1,373.01 కోట్లు, పునరావాస పనులకు అదనంగా రూ. 1,581.08 కోట్లు ఖర్చు చేశారు. ఈ రెండు ప్రాజెక్టులు కలిపి మొత్తం ఏడు లక్షలకు పైగా ఎకరాలకు సాగునీరు, ఇరవై లక్షలకుపైగా మందికి తాగునీటి భరోసా ఇవ్వనున్నాయి.

ఈ ఏడాది సూపర్ ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ, గోదావరి నుంచి దాదాపు 900 టీఎంసీల వరద జలాలు సముద్రం పాలయ్యాయని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టిసీమ వంటి ఎత్తిపోతల పథకాల ద్వారా గోదావరి కుడి కాలువ మీదుగా ప్రకాశం బ్యారేజీకి ఇప్పటి వరకు మొత్తంగా 160 టీఎంసీలకుపైగా జలాలు మళ్లగా, ఈ సీజన్‌లో ఇప్పటివరకు 17.52 టీఎంసీలు మళ్లించారు. మొత్తంగా ఈ ఏడాది 32 టీఎంసీలు మాత్రమే వినియోగించగలిగినా, ఆ నీరు కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాల డెల్టా పంటలకు కొంతమేర ఆసరాగా నిలిచింది. పోలవరం ప్రాజెక్టు పూర్తయి ఉంటే, వృథాగా పోయిన ఆ 900 టీఎంసీల్లో కనీసం 300 నుంచి 350 టీఎంసీలను కృష్ణా, రాయలసీమ, ఉత్తరాంధ్రలకు మళ్లించే వీలుండేదని మంత్రి పేర్కొన్నారు.



నిజానికి 2019 నాటికే పోలవరం పనులు 72 శాతం పూర్తయ్యాయి. ఆ ఏడాది గెలిచిన వైసీపీ ప్రమాణ స్వీకారం చేసిన రోజే పనులు నిలిపివేసి, రివర్స్ టెండరింగ్ పేరుతో జూన్ నుంచి నవంబరు వరకు నిర్మాణ సంస్థ లేకుండానే వదిలేసింది. కాఫర్ డ్యామ్‌లలో ఖాళీలు పూడ్చకపోవడంతో 2020 సెప్టెంబరు వరదలకు డయాఫ్రం వాల్ దెబ్బతిన్నదని నీతి ఆయోగ్ నియమించిన ఐఐటీ హైదరాబాద్ నిపుణుల కమిటీ నివేదిక సైతం స్పష్టం చేసింది. ఫలితంగా ప్రాజెక్టు వ్యయం రెట్టింపునకు పైగా పెరిగింది. ఆ ఐదేళ్లూ వృథా కాకుండా ఉండి ఉంటే, కృష్ణా, గోదావరి డెల్టాలతో పాటు ఉత్తరాంధ్ర రైతులకు ఏళ్ల క్రితమే జలయోగం లభించేది. పదేళ్లుగా కృష్ణా డెల్టా రైతులు గోదావరి మిగులు జలాలపైనే ఆధారపడటం ఇక్కడ గమనార్హం.

వెలిగొండ ప్రాజెక్టు విషయంలోనూ ఇదే తరహా జాప్యం స్పష్టంగా కనిపిస్తుంది. 2024 ఎన్నికలకు నెల ముందు, మార్చిలో సొరంగాల తవ్వకం పూర్తయిందంటూ అప్పటి వైసీపీ ప్రభుత్వం హడావిడిగా ప్రారంభోత్సవం నిర్వహించింది. కానీ టన్నెల్ హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం, రెండో సొరంగంలో లైనింగ్ పనులు, ఫీడర్ కాలువల లైనింగ్, రిటైనింగ్ వాల్స్, వంతెనల నిర్మాణం వంటివి ఇంకా మిగిలే ఉన్నాయి. నీటి చుక్క విడుదల చేయకుండానే జరిగిన ఆ ప్రారంభోత్సవాన్ని "ఫేక్" అంటూ రాజకీయ పార్టీలు విమర్శించాయి. 2024 జూన్‌లో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వం వెలిగొండను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి, తొలి అసెంబ్లీ సమావేశం లోనే 2026 ఖరీఫ్ నాటికి మొదటి దశ పూర్తి చేస్తామని చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. నిర్వాసిత కుటుంబాలకు పరిహారం, పునరావాస పనులు వేగవంతం చేసి, ఇప్పటికే రూ. 768 కోట్లను 6,206 మంది నిర్వాసితులకు అందించడంతో పాటు, ఈ ఏడాది బడ్జెట్‌లో మరో రూ. 906 కోట్లు కేటాయించారు. ఫలితంగా, చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసిన సరిగ్గా 30 ఏళ్లకు, ఆగస్టు 31న ఆయన చేతుల మీదుగానే కృష్ణా జలాలు నల్లమల సాగర్‌లోకి ప్రవహించాయి. మాటలు కాదు, చేతల్లో నిరూపించిన ఈ రెండు ప్రాజెక్టుల పూర్తి, కరవు నేలలపై ఆధారపడ్డ లక్షలాది జీవితాల్లో వెలుగులు నింపనుంది. కరవు ప్రాంతాల ప్రజలకు ఇది కేవలం నీటి వనరు కాదు, వారి జీవితాల్లో కొత్త ఆశలు చిగురింపజేసే మలుపు. ★


Heartiest 76th birthday wishes to our beloved
Our Hon'ble Prime Minister Sri Narendra Modi.



Ala Chandrasekhar Yadav
High Court Advocate
Central Govt Counsel
Platinum member of A.P. High Court Advocates Association
OBC National Leader
9949991639





# తిలక్ ఆశయం నేడు

**వినాయక చవితి రాగానే దేశమంతటా ఒక కొత్త ఉత్సాహం నిండుతుంది. వీధి వీధినా వెలిసే మండపాలు, మైకులలో మోగే భక్తిపాటలు, విద్యుత్ దీపాల కాంతులు అలరిస్తాయి. అయితే, ఈ హడావుడి, ఆడంబరాల వెనుక పండుగ అసలైన పరమార్థం మరుగున పడిపోతోందా? అనే ప్రశ్న తొలిచివేస్తోంది. కేవలం విగ్రహాల కొలతల పోటీలు, డీజేల హోరు, ఆడంబరాలకే ఉ త్సవాలను పరిమితం చేయకుండా, సామాజిక చైతన్యానికి, ప్రకృతి పరిరక్షణకు వేదికలుగా మార్చడమే నేటి అత్యంత ఆవశ్యకమైన మార్పు.**

1893లో లోకమాన్య బాలగంగాధర్ తిలక్ వినాయక ఉత్సవాలను ఇళ్ల నుంచి వీధుల్లోకి తీసుకువచ్చి 'సార్వజనిక ఉత్సవాలు'గా మార్చడం వెనుక ఒక గొప్ప వ్యూహం ఉంది. నాటి బ్రిటిష్ పరిపాలనలో ప్రజలు గుమిగూడే అవకాశం లేకపోవడంతో, పండుగతో ప్రజలందరినీ ఒకే చోటకు చేర్చి జాతీయభావం, ఐక్యత, సామాజిక సంస్కరణల గురించి ప్రచారం చేశారు. కానీ నేడు ఉత్సవ మండపాలు ప్రదర్శనకు లేదా కేవలం వినోదానికి వేదికలుగా మారడం తిలక్ కన్న కలలకు విరుద్ధం.

పండుగ ఆధ్యాత్మిక మూలాలు ప్రకృతితో విడదీయరాని బంధాన్ని కలిగి ఉన్నాయి. 'మృత్తికయే పరబ్రహ్మం' అనే భావనతో స్వచ్ఛమైన మట్టితో రూపాన్ని చేసి, నవరాత్రుల పూజ అనంతరం నీటిలో కరిగించడం సృష్టి, స్థితి, లయల సత్యానికి నిదర్శనం. అయితే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, రసాయన రంగులు వాడటం వల్ల మన జలవనరులు విషతుల్యమై జలచరాలు నశిస్తున్నాయి. ప్రకృతిని పూజించే వేడుకలోనే ప్రకృతికి హాని తలపెట్టడం ఎంతవరకు సమంజసం? 'మట్టి వినాయకుడి'ని ప్రతిష్ఠించి, పూజించిన పత్రిని సహజ సిద్ధంగా నిమజ్జనం చేయడమే నిజమైన ఆధ్యాత్మిక ఆచరణ.

సృష్టి చక్రం ఎప్పుడూ ఈ మూడు దశల చుట్టూనే తిరుగుతుంటుంది. నిమజ్జన ప్రక్రియ ఈ మూడు దశలను స్పష్టంగా వివరిస్తుంది.



తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి
8008577834

### సృష్టి, స్థితి, లయల చక్రానికి భౌతిక నిదర్శనం

స్వచ్ఛమైన మట్టితో ఒక రూపాన్ని తీర్చిదిద్దడం. ఈ భూమి మీద జీవం (సృష్టి) ఆవిర్భావానికి సంకేతం. మట్టి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేసి, నవరాత్రుల పాటు భక్తిశ్రద్ధలతో పూజించడం(స్థితి). ఒక మనిషి లేదా జీవి భూమి మీద గడిపే సార్థక జీవితానికి ప్రతీక. పూజల అనంతరం ఆ మట్టి రూపాన్ని తిరిగి జలాల్లో కలపడం(లయ). మట్టి నుంచి పుట్టినది తిరిగి పంచభూతాలలో విలీనం అవ్వడం ప్రకృతి సహజ ధర్మం అని ఇది బోధిస్తుంది.

మన శరీరం పంచభూతాలతో (భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం) నిర్మితమైంది. మట్టి రూపంలో ఉన్న స్వామిని, జలంలో నిమజ్జనం చేయడం ద్వారా మన మూలాలు ఎక్కడున్నాయో మనం స్మరించుకుంటాం. పూజలో వాడే 21రకాల పత్రులు, పండ్లు అన్నీ ప్రకృతి ప్రసాదించినవే. దేవుడి రూపంలో మనం సాక్షాత్తూ ఆ ప్రకృతి మాతనే ఆరాధిస్తున్నాం.

విగ్రహాన్ని మాత్రమే కాదు, మనలోని అహంకారాన్ని, మోహాన్ని, అజ్ఞానాన్ని కూడా ఆ నీటిలో వదిలేసి రావడం నిమజ్జనం అంతరార్థం. దేహం శాశ్వతం కాదని, ఆత్మ మాత్రమే శాశ్వతమని ఇది గుర్తు చేస్తుంది. సృష్టి రహస్యాన్ని చాటిచెప్పే ఈ క్రతువులో 'మట్టి వినాయకుడి' పూజకే అసలైన ప్రాధాన్యం ఉంది. 'ప్లాస్టర్ ఆఫ్ పారిస్' లాంటి రసాయనాలతో చేసిన విగ్రహాలు వాడటం ప్రకృతి ధర్మానికి విరుద్ధం. మనం ప్రకృతికి హాని చేయకుండా, పర్యావరణ హితంగా జరుపుకున్నప్పుడే ఈ పండుగ పరమార్థం నెరవేరుతుంది.

'మృత్తిక' అంటే మట్టి. ఈ విశ్వానికి, సమస్త ప్రాణికోటికి మూలం, ముగింపు ఈ మృత్తికయే. ఉపనిషత్తులు, వేదాలు ప్రకటిస్తున్న అద్వైత సత్యాన్ని, పరబ్రహ్మ తత్వాన్ని అత్యంత సులభంగా అర్థం చేసుకోవడానికి 'మట్టి' ఒక ఉత్కృష్టమైన ఉదాహరణ. 'మృత్తికయే పరబ్రహ్మం' అన్న భావన కేవలం భౌతికమైన మట్టిని పూజించడం కాదు. ఆ మట్టి వెనుక ఉన్న అనంతుడైన పరమాత్మను, సృష్టి రహస్యాన్ని దర్శించడం.

ఛాందోగ్య ఉపనిషత్తులో ఉద్దాలక మహర్షి తన కుమారుడైన శ్వేతకేతువునకు ఆత్మజ్ఞానాన్ని బోధిస్తూ ఒక అద్భుతమైన ఉదాహరణ చెప్పాడు. 'యథా సోమ్య ఏకేన మృత్పిండేన సర్వం మృన్మయం విజ్ఞాతం స్యాద్వాచారఖహణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్" ఒక్క మట్టి పిండం తత్వాన్ని తెలుసుకుంటే, మట్టితో చేసిన కుండలు, ప్రమిదలు, పాత్రలు వంటి సమస్త వస్తువుల తత్వం తెలిసినట్లే. రూపాలు, పేర్లు వేరైనా, వాటిలో ఉన్న ద్రవ్యం "మృత్తిక" ఒక్కటే.

ఈ జగత్తులో నామరూపాలు (కుండ, పాత్ర, విగ్రహం) అనేవి కేవలం తాత్కాలిక మార్పులు. కానీ వాటికి ఆధారమైన మట్టి మాత్రమే శాశ్వతమైన సత్యం. అలాగే, ఈ అనంతవిశ్వంలో కనిపించే చరాచర జగత్తంతా నామ రూపాల రూపంలో ఉన్న పరబ్రహ్మమే. ఆ పరబ్రహ్మమే ఉపాదాన కారణం (వస్తువుకు మూల ద్రవ్యం).



# ఎటువైపు?



సృష్టి ఆవిర్భావంలో ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథివి అనే పంచ భూతాలేర్పడ్డాయి. వీటిలో అన్నింటినీ తనలో ఇముడ్చుకుని, జీవ జాలానికి ఆధారమై నిలిచేది పృథివి లేదా మృత్తిక. మట్టిలో విత్తనం పడితే చెట్టవుతుంది. ఆ చెట్టు ఇచ్చే ఆహారంలలో జీవులు బతుకుతున్నాయి. మన శరీరం కూడా ఆహార రసాల ద్వారా మట్టి నుంచే తయారైంది (అన్నమయ కోశం). మనం తినే ఆహారం, తాగే నీరు, పీల్చే గాలి, మోసే భూమి– లక్ష్మీస్వరూపమని ఆరాధిస్తాం.  జననం అనే మట్టి నుంచి మొదలై, మరణం అనే  లయం వరకు జీవితం సాగుతుంది.

మన పూర్వికులు సృష్టి సత్యాన్ని నిత్య జీవితంలో గుర్తుచేసుకోవడానికి మృత్తికను పూజావిధానంలో భాగం చేశారు. మట్టి రూపం తాత్కాలికం, దానిలోని తత్వం అనంతం.  యజ్ఞయాగాదులు, విశేష పూజలు చేసే ముందు స్వచ్ఛమైన మట్టిని తీసుకువచ్చి పూజించడం అనాదిగా వస్తున్న ఆచారం. మృత్తిక మనకు నేర్పే పాఠం సమభావం – త్యాగం. కుండగా మారినా, భవనానికి ఇటుకగా మారినా, దేవుడి విగ్రహంగా మారినా, తిరిగి తొక్కిసలాడే నేలగా మారినా మట్టి తన స్వభావాన్ని కోల్పోదు. అహం కారాన్ని వీడి, నామరూపాల వెనుక ఉన్న ఏకత్వాన్ని దర్శించడమే 'మృత్తికయే పరబ్రహ్మ' అనే తత్వానికి నిజమైన అర్థం.

**నిమజ్జన ప్రక్రియ - వైజ్ఞానిక ఆలోచన**

భాద్రపద మాసంలో జరుపుకునే మట్టి గణపతి పూజ, నిమజ్జన ప్రక్రియ కేవలం ఆచార వ్యవహారా లకే పరిమితం కాకుండా, లోతైన ఆధ్యాత్మిక వేదాంతాన్ని అద్భుతమైన వైజ్ఞానిక సూత్రాలను తనలో ఇముడ్చుకుంది.  నిరాకారుడైన పర బ్రహ్మానికి ఆకారాన్ని ఇచ్చి ఆరాధించడం సాధనలో మొదటి మెట్టు. భాద్రపద శుక్ల చతుర్థి నాడు మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించి 'ప్రాణప్రతిష్ఠ' ద్వారా దైవత్వాన్ని ఆవాహన చేస్తాం. నవరాత్రులు పూజలందుకున్న స్వామిని నీటిలో నిమజ్జనం చేయడం ద్వారా 'ఏ రూపానికైనా ముగింపు తప్పదు' అనే సత్యాన్ని తెలుసుకుంటాం. రూపం నశించినా తత్వం శాశ్వతంగా ఉండి పోతుందని ఇది బోధిస్తుంది.  నిమజ్జన సమయంలో "మమ" (నాది) అనే మమకారాన్ని, అహంకారాన్ని నీటిలో విడిచిపెట్టి స్వచ్ఛమైన ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవడమే దీని నిజమైన అర్థం. వర్షాకాలంలో వచ్చే భాద్రపద మాసంలో ఈ పూజ జరుపుకోవడం వెనుక పూర్వికుల అద్భుతమైన వైజ్ఞానిక ఆలోచన ఉంది.

వర్షాకాలంలో చెరువులు, నదులు, కాలువల నిండా కొత్త నీరు చేరుతుంది. పూజ కోసం మట్టిని సేకరించే నెపంతో ఊరిలోని చెరువుల ఒడ్డులను, కాలువలను శుభ్రం చేసేవారు. ఈ ప్రక్రియ నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుతుంది.  నిమజ్జనంతో పాటు మనం వేసే 21 రకాల పత్రి నీటిలోని హానికర బాక్టీరియాను చంపి, సహజమైన ఫిల్టర్‌లా పని చేస్తాయి. ఈ మూలికా పత్రాలతో పాటు పుట్టమట్టి లేదా స్వచ్ఛమైన మట్టి నీటిలో కలవడంవల్ల, నీటిలోని హానికర బాక్టీరియా నశించి నీరు శుద్ధి అవుతుంది. ప్రకృతి నుంచి లభించే మట్టి, మూలికలతో పూజించి, తిరిగి ఆ ప్రకృతికే సమర్పించడం ద్వారా జీవసమతుల్యత పరిరక్షిత మవుతుంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులను కాదని, సాంప్రదాయ 'మట్టి గణపతి'ని పూజించినప్పుడే ఈ ఆధ్యాత్మిక, వైజ్ఞానిక రహస్యాలు నెరవేరుతాయి.

మనం ఆచరించి చూపిస్తేనే పిల్లలు ప్రకృతిని ప్రేమించడం నేర్చుకుంటారు. ఆడంబరాల కంటే భక్తి, ప్రకృతి రక్షణే ముఖ్యమని భావితరాలకు మార్గదర్శకత్వం వహించినట్లవుతుంది. నేటి ఉత్సవ మండపాలు కేవలం భక్తి పాటలకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతను భుజానికెత్తుకోవాలి. నవరాత్రుల సందర్భంగా  ఉచిత రక్తదానం, వైద్య పరీక్షల నిర్వహణ, విద్యా, ఉద్యోగ అవకాశాలపై చైతన్య కార్యక్రమాలు, ప్లాస్టిక్ నిషేధం, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టడం సమాజానికి ఎంతో ఉపకరిస్తుంది.

భక్తి అనేది కేవలం పూజలతో ముగిసేది కాదు. అది తోటి జీవుల పట్ల, ప్రకృతి పట్ల చూపే కరుణలో ప్రతిబింబిస్తుంది. ఆడంబరాలను పక్కన పెట్టి, తిలక్ ఆశయాల బాటలో పర్యావరణ స్పృహతో ఐక్యంగా అడుగులు వేసినప్పుడే 'ఉత్సవం నుంచి నిజమైన సామాజిక చైతన్యం' సాధ్యమవుతుంది. అదే మనం ఆ విఘ్నేశ్వరునికి ఇచ్చే నిజమైన నీరాజనం! ★





# ఏ వెలుగులకీ ప్రస్థానం? 6

'మేస్టారు గారూ! మా చెల్లి ధరణి చంటిపిల్లను నా దగ్గర వదిలేసి వెళ్లి యింది. తెల్లవారి పోలీసులు ఇక్కడికి వచ్చారని మా తమ్ముడి ద్వారా తెలిసి వెళ్లిపోయింది" చెప్పింది గౌరి.

ఆమె మాటలు నాకాశ్చర్యం కలిగించాయి.

"ఎక్కడికి వెళ్లింది? అసలే పోలీసులు గాలిస్తున్నారు. వాళ్లకి దొరికితే ప్రమాదం. అయినా నువ్వెందుకు ఆమెను వెళ్లనిచ్చావు? అడిగాను.

"అది ఆలోచించే స్థితిలో లేదు బాబూ! అందుకే వెళ్లిపోయింది. సోమన్న దగ్గరకు వెళుతానంది. ఈ పోలీసుల గొడవ తగ్గిన తరువాత వస్తానంది. అంతవరకూ నేను పిల్లను చూడక తప్పదు. మరో మార్గం కూడా లేదు.దానికేటి అవుతుందోనని బెంగగా ఉంది బాబూ!" అంది గౌరి ఏడుస్తూ.

"ఈ మన్యంలో ఏ జరుగుతున్నదో నాకూ అర్థం కావటం లేదు గౌరీ! అందరూ బిక్కు బిక్కుమని బతుకుతున్నారు. అరాచకం రాజ్యం ఏలుతోంది. నక్సలైట్లు తుపాకులు పట్టుకొని కొండల మీద కూర్చుంటే... ఇక్కడ గిరిజనులు సుఖంగా ఉంటారా? వాళ్లు ధైర్యం ఉంటే ప్రజల్లోకి వచ్చి పోరాడాలి. మధ్యలో మీరంతా నలిగిపోతున్నారు. అయినా మీ ఆక్రందనలు వినేదెవ్వరు?

బధిర శంఖారావం! దశాబ్దాల నుంచి మన్యం ప్రాంతాలన్నీ ఇలానే బాధలతో రగిలిపోతున్నాయి. నక్సలైట్ల వైఖరిలో మార్పులేదు. ప్రభుత్వాల దమనకాండ ఆగటం లేదు.

ధరణి పిల్లని నీ దగ్గర వదిలేసినట్లు ఎవ్వరికీ తెలియనీయకు. ఈ విషయం పోలీసులకు తెలిస్తే నిన్ను హింసిస్తారు" అన్నాను.

"చెప్పను బాబూ! ఆ పిల్లను దాని తల్లి దగ్గరికి చేర్చే బాధ్యత నాపై ఉంది. తండ్రి ఎక్కడ ఉన్నాడో తెలియదు. అసలు వాడు వస్తాడో, రాడో తెలియదు. కనీసం తల్లి ఉన్నా పరవాలేదనుకున్నాను. ఇప్పుడు అది కూడా వెళ్లిపోయింది. ఆ పిల్లను ఆ దేవుడే కాపాడాలి. నా పిల్లల్నే నేను పోషించుకోలేక పోతున్నాను. వాళ్లకి తోడు ఇప్పుడు ఇది. మా కష్టాలకు అంతులేకుండా ఉంది సార్" అని అంది గౌరి కన్నీళ్లు తుడుచుకుంటూ.

"గౌరీ! నీ చెల్లెలు కుటుంబం కష్టాల్లో ఉంది. వాళ్లని నువ్వే ఆదుకోవాలి. కొన్నాళ్లు ఓపిక పట్టు. మళ్లీ మంచి రోజులు వస్తాయి. అంత వరకు నువ్వే ఆ కుటుంబానికి అండగా ఉండాలి" అని ఓదార్చారు.

ఆ మర్నాడు సాయంత్రం నా దగ్గరకు ఒక న్యూస్ ఛానల్ విలేకరి వచ్చాడు. అతన్ని నేనెప్పుడూ చూడలేదు. ముప్పై ఏళ్లుంటాయి అతనికి.

అతను వస్తూనే "సార్! నేను 'నిజం' ఛానల్ విలేఖరిని. నా పేరు రమేష్. పోలీసులకు, గిరిజనులకు జరిగిన గొడవకు సంబధించిన వివరాలను, వార్తల్ని కవర్ చేశాను. మరిన్ని వివరాలు సేకరించేందుకు వచ్చాను. దాని గురించి మీతో మాట్లాడాలనుకుంటున్నాను" అన్నాడతను.

"పదండి. స్కూల్‌కు కెళదాం" అంటూ అతన్ని లోపలికి తీసికెళ్లాను.

అతను కొండెక్కి రావడం వల్ల బాగా అలసి పోయినట్లు కనిపిస్తున్నాడు. అతనికి మంచినీళ్ల సీసా ఇచ్చాను. అతను అందులోని నీళ్లన్నీ గడగడ తాగే



సాదు.ఆ తరువాత చెప్పడం మొదలు పెట్టాడు.

"సార్! మొన్న ఈ ఊరికి చెందిన ధరణి అనే అమ్మాయి సహా చాలామంది యువతీ యువకులను పోలీసులు అరెస్టు చేసిన సంగతి మీకు తెలుసు. ఆమె తన భర్త ఎక్కడున్నాడో తనకి తెలియదని చెప్పినా వినకుండా వాళ్లు ఆమెను హింసించడం, దాంతో ఈ చుట్టుపక్కల యువకులు పోలీసు స్టేషన్‌పై దాడి చేయడం మీకు తెలుసు. పోలీసులు ధరణిని చాలా ఘోరంగా హింసించారు. ఆమెను కొట్టరాని చోట్ల కొట్టారు.పెట్టరాని హింసలు పెట్టారు. వాటిని నేను ఓ చెట్టుచాటు నుంచి నా కెమెరాలో చిత్రీకరించాను. ఆ వీడియో నా దగ్గర ఉంది. అది చూస్తే పోలీసులు ఎంతటి ఘోరమైన పని చేసారో అర్థం అవుతుంది" చెప్పాడు రమేష్.

"చాలా ఆశ్చర్యంగా ఉంది రమేష్ గారూ..మీ చెప్పింది వింటుంటే. అయినా మీరు పోలీస్ స్టేషన్ దగ్గరికి ఎలా వెళ్లగలిగారు? మీరు చాలా ప్రమాదకరమైన పని చేసారు. మీరు పోలీసుల కంటబడితే పరిస్థితి ఎంత దారుణంగా ఉండేదో కదా? అయినా ఇందుకు మిమ్మల్ని అభినందించక తప్పదు" అన్నాను.

"మాస్టారూ! మా జర్నలిస్టు వృత్తిలో ఇవి మామూలే. భయపడితే నిజం బయటకు రాదు. సమాజంలోని అవినీతిని, దౌర్జన్యాలను వెలికి తీయాలంటే ధైర్యం చెయ్యక తప్పదు. ఇప్పుడు రాజకీయ నాయకులు, అధికారులు ఒకటై పోయారు. న్యాయవ్యవస్థ తనకు తానుగా జోక్యం చేసుకోలేదు. కాబట్టి నాలుగవ స్తంభం అయిన పత్రికలే ఈ పని చెయ్యాలి" అన్నాడు రమేష్.

"ఈ వృత్తిలో చేరిన రోజే ప్రాణం మీద ఆశ వదులుకున్నాను. ప్రాణం మీద ఆశలేనప్పుడు ఎక్కడికైనా వెళ్లవచ్చు.అందుకే పోలీసుల దాష్టీకాలు, దౌర్జన్యాలనూ చిత్రించగలిగాను. కానీ వీటిని మా పత్రికా ఆఫీసుకు చేరవేయడం ఓ పెద్ద పని. ఇక్కడ నెట్ సౌకర్యం ఉంటే ఆ పని చెయ్యగలిగేవాడిని. నేను వీడియో, ఫోటోలు తీసినట్లు పోలీసులకు తెలిసిపోయింది.వాళ్లు మా పత్రిక ఎడిటర్‌కి ఫోన్ చేసి తమకు వ్యతిరేకంగా ఏమీ ప్రచురించవద్దని చెప్పారు"



"మరిప్పుడేం చేస్తారు? ఇంత కష్టపడీ వాటిని చిత్రించిన తరువాత మీ యాజమాన్యం ప్రచురించక పోతే ఉపయోగం ఏమిటి? ప్రపంచానికి ఇవి ఎలా తెలుస్తాయి? పైగా పోలీసులకు తెలుసు అంటున్నారు కాబట్టి మీ ప్రాణాలకు కూడా ప్రమాదం"అన్నాను.

"ఎప్పుడైతే రాజకీయ నాయకులు పత్రికాధిపతులయ్యారో అప్పుడే జర్నలిజం పూర్తిగా భ్రష్టుపట్టి పోయింది. చాలావరకు ప్రతి పత్రిక, ఛానల్ రాజకీయ పార్టీల కొమ్ము కాస్తున్నాయి. ఒకప్పటి నైతిక విలువలు ఇప్పుడు పత్రికా రంగంలో లేవు.అందుకే నేను వెలికితీసిన ఈ నిజం వెలుగు చూస్తుందో లేదో తెలియదు. అందుకే ఈ దగ్గరికి వచ్చాను" అంటూ రమేష్ నాకు ఒక పెన్ డ్రైవ్ ఇచ్చాడు.

**'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన**

"సార్! ఇందులో నేను తీసిన ఫోటోలు, వీడియో ఉన్నాయి. నేను గానీ పోలీసులకు దొరికిపోతే నన్ను బతకనివ్వరు. ఎన్‌కౌంటర్ చేసేస్తారు. అందుకే ఈ పెన్‌డ్రైవ్ మీకిస్తున్నాను. దయచేసి దీన్ని మీరు కలెక్టర్ గారికి గానీ ,ఎస్పీ గారికి చేరే ఏర్పాటు చేయండి. పత్రికలకిస్తే వాళ్లు వేయరు.

ప్రస్తుతం నేను పద్మవ్యూహం లాంటి ఈ ఏజెన్సీలో చిక్కుకుపోయాను. ఇక్కడ నుంచీ బయట పడటం కష్టం. నిజం ఆలస్యంగా మేలుకొంటుంది. అప్పటికే అబద్ధం లోకం చుట్టేసి, గమ్యం చేరు కుంటుంది" అన్నాడు రమేష్.

"మీ ఉద్దేశ్యంలో ఎవరిది తప్పంటారు? పోలీసులదా?నక్సలైట్లదా? గిరిజనులకు వీళ్లు మేలు చేస్తున్నట్లా?లేక అన్యాయం చేస్తున్నారా?" అడిగాను.

"ఇద్దరిదీ తప్పే సార్! 'కరవమంటే కప్పకు, విడవమంటే పాముకు కోపం ' అన్నట్లు ఇద్దరి తీరూ ఒకటే. రెండు పక్షాల నరమేధం మధ్యలో గిరిజనులు నలిగిపోతునారు. తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్నామని పోలీసులు,పేద గిరిజనులకు జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తున్నామని నక్సలైట్లు ఎవరికి వారు తమ చర్యలను సమర్థించుకుంటున్నారు. వాళ్లిద్దరూ గిరిజనుల కోసమే పాటుపడుతున్నామని చెబుతున్నా, అది వాస్తవరూపం ధరించటం లేదు. నక్సలైట్లను పట్టుకోవడానికి పోలీసులు గిరిజనులను పావులుగా వాడుకుంటు న్నారు. అలాగే నక్సల్స్... పోలీసుల నుంచి తప్పించుకోవడానికి గిరిజనులను అడ్డుపెట్టు కుంటున్నారు. ఈ తీరుతో మన్య ప్రాంతం



గన్నవరపు నరసింహమూర్తి

ఏ విధమైన అభివృద్ధికి నోచుకోకుండా ఉంది. పరిస్థితి ఇలాగే ఉంటే ఇంకో వందేళ్లైనా ఈ ప్రాంతం అభివృద్ధి చెందదు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, డాక్టర్లు ఎవ్వరూ ఈ ప్రాంతానికి రావటానికి భయపడుతున్నారు. వచ్చినా మనస్ఫూర్తిగా పనిచేయ లేకపోతున్నారు.

ఈ చుట్టుపక్కల ఉన్న పది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఒక్కదానిలో కూడా డాక్టరు లేడు. నర్సులతోనే వైద్యం జరుగుతోంది. ప్రాణాపాయం సంభవిస్తే డోలీ కట్టి కిందకు తీసుకు వెళ్లాలి. దీనికి కారణం ఎవరు? గిరిజనులను ఎవరు ఉద్ధరిస్తారు? వీళ్ల ఆక్రందనలను ఎవరు వింటారు చెప్పండి?

దేశంలో ప్రజాస్వామ్యం ధనవంతుల చేతిలో కీలుబొమ్మ. రాజకీయ నాయకులు, అధికారులు చేతులు కలిపి దేశాన్ని దోచుకుతింటున్నారు. వీళ్లని అడిగే వాళ్లెవరు లేరు. మొన్నటి దాకా పత్రికలకు భయపడేవారు కానీ ఇప్పుడవి కూడా ధనవంతులు, పెట్టుబడీదారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఇక ప్రజలను ఆదేవుడే రక్షించాలి" అన్నాడు రమేష్.

"ఒకే రమేష్! పోలీసుల కంటబడకుండా జాగ్రత్తగా ఉండండి. ఈ పెన్‌డ్రైవ్‌ని కలెక్టర్, పోలీసు అధికారులకు చేరవేసి ఈ దౌర్జన్యాలను బయటకు తెచ్చే ప్రయత్నం చేస్తాను" అని హామీ ఇచ్చాను.

రమేష్ వెళ్లిపోయాడు. ఆ తరువాత అతని ఆచూకీ తెలియలేదు. ఏమయ్యాడో తెలియదు. అతను సమాజం గురించి ఎంతో ఆలోచించి జీవితాన్ని కూడా పణం పెట్టి ఆ వీడియో, ఫొటోలు తీశాడు.

కానీ అధికార పదఘట్టనల కింద నలిగి పోయాడేమో. అతను బయట ఉంటే సమాజానికి నగ్నసత్యాలు తెలుస్తాయని అధికారులు, రాజకీయ నాయకుల భయమే అతన్ని మాయం చేసిందేమో! ఈ దేశంలో అవినీతి, ఆశ్రిత పక్షపాతం, స్వార్థ పరత్వం ఎందరో నిరపరాధ యువకుల ప్రాణాలను బలితీసు కుంటున్నాయి.

'ఈ దేశం మాకేమిచ్చిందని కాదు, దీనికి మనమేమిస్తున్నాం' అని యువత ఆలోచించాలని కుహనా మేధావి వర్గం చెబుతూ ఉంటుంది. మరి రమేష్ లాంటి యువకులకు ఈ దేశం ఏమిచ్చింది? నిజాన్ని ఎంత దాచినా అది అంకురంలా బయటకు వస్తుందని విప్లవకారులు, రచయితలు చెబుతూంటారు. కానీ రమేష్ లాంటి అంకురాలను చిదిమేసే ప్రయత్నాలతో నిజాన్ని సమాధి చేస్తున్న అరాచక శక్తులను ఎవరు అడ్డుకోగలరు?

దేశంలో ఇంకా 46 శాతం ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువన ఉండటానికి ఎవరు కారకులు? దేశపు సంపదలో 90 శాతం కేవలం 200 మంది కార్పొరేట్ దిగ్గజాల దగ్గర ఉండటానికి కారణం ఎవరు? ప్రభుత్వ పరిశ్రమలు ఎందుకు నష్టాల




పాలవుతూ, ప్రైవేట్ పరిశ్రమలు లక్షల కోట్ల లాభాలను ఎలా ఆర్జిస్తున్నాయి?

దేశంలోని ప్రముఖ విద్యాకేంద్రాలైన ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఎమ్ లాంటి వాటిలో చదువుకున్నవారు, అమెరికా వంటి ధనిక దేశాలకు సేవ చేయడానికి వలస పోతుంటే ఈ ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి? వారు చదివింది ఈ దేశ ప్రజల డబ్బుతో...కానీ వాళ్లు ఇతర దేశాల సేవలో పడి మాతృదేశానికి ద్రోహం చేస్తునారు? ఇదా మన అభివృద్ధి అంటే?

ఆలోచనలతో నామస్తిష్కం వేడెక్కిపోసాగింది. పెళ్లి కోసం బడికి నెల రోజులు సెలవు పెట్టి ఆ రాత్రి ఇంటికి బయలుదేరాను. బయలు దేరుతుండగా, మరోసారి గౌరి వచ్చి తన చెల్లెలు ధరణి గురించి చెప్పి ఏడ్చింది.

"మాస్టారు గారూ! నా చెల్లెలు వెళ్లిపోయి వారం పైగా అయింది. దాని పిల్లను ఎలా పెంచాలో అర్థం కావటం లేదు. నా పరిస్థితి కూడా అంతంత మాత్రంగా ఉంది" ఏడుస్తూ చెప్పింది.

"గౌరీ! మీ చెల్లెలు పోలీసుల దౌర్జన్యాలను తట్టుకోలేక వెళ్లిపోయింది తప్ప కావాలనీ కాదు. కొన్నాళ్లు ఎదురు చూడటం మినహా ఏం చెయ్యగలం చెప్పు? పరిస్థితులు అనుకూలిస్తే తను, భర్త సోమన్న తిరిగి వస్తారు. అంతవరకు నువ్వే ఆ పిల్లని కంటికి రెప్పలా చూడాలి. నేను నా పెళ్లి నిమిత్తం మా ఊరు వెళుతున్నాను. అయినా.. నా కెందుకో ఇక్కడ పని చేయాలనిపించడంలేదు. బహుశా ఇక్కడి నుంచి బదిలీ కోసం ప్రయత్నిస్తాను. అది జరగకపోతే మళ్లీ వస్తాను. ఏమైనా ధైర్యంగా ఉండు. అని చెప్పి మా ఊరు బయలుదేరాను.

ఇంటికి చేరే ముందు... నేను జిల్లా కేంద్రంలో కలెక్టర్, ఎస్పీ గార్లను కలసి విలేకరి రమేష్ ఇచ్చిన పెన్‌డ్రైవ్‌లను అందచేశాను. ఏజన్సీవాసుల సమస్యలను వారికి వివరించాను.

గిరిజన యువకులను హింసించిన పోలీసులపై చర్య తీసుకుంటామని వాళ్లిద్దరూ నాకు హామీ ఇచ్చారు.

* * *

ఊరు చేరిన పది రోజుల తరువాత కౌసల్యతో నా వివాహం జరిగింది. ఈలోగా మా నియోజకవర్గ ఎమ్మెల్యే ద్వారా డి.ఈ.ఓ.ని కలసి బదిలీ చెయవలసిందిగా కోరాను. అదృష్టవశాత్తు మా ఊరికి దగ్గరలోని మిరపవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నన్ను బదిలీ చేశారు.

అప్పటి వరకు ఏజన్సీ ప్రాంతంలో సమస్యలు ఎదుర్కొన్న నాకు ఈ స్కూలులో ఉద్యోగం సంతృప్తి నిచ్చింది. ఇది చెప్పాలంటే పెద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. ఇరవై మంది ఉపాధ్యాయులు ఉన్నారు. స్కూల్లో 200 మంది పిల్లలు చదివేవారు. నేను ఆరు, ఏడు తరగతులకు పాఠాలను బోధించేవాడిని.

మా ఊరికి మిరపవలస పదిహేను కిలోమీటర్ల దూరం. బైక్ మీద రోజూ 9 గంటలకు స్కూలుకెళ్లి సాయంత్రం వచ్చేవాడిని. సంవత్సరం పాటు మా కాపురం హాయిగా సాగింది. కౌసల్య చాలా మంచిది. మా తల్లిదండ్రులను, కుటుంబాన్ని బాగా చూసుకునేది.

సంవత్సరం తరువాత కౌసల్యకు పిల్లల మీద దృష్టి మళ్లింది. ఆమెకు తల్లి కావాలనే కోరిక బాగా ఉండేది. కానీ ఆమె కోరిక ఫలించటం లేదు. ఒకసారి ఇద్దరం పక్క పట్నం వెళ్లి డాక్టరుకి చూపించు కున్నాము. మా ఇద్దర్నీ పరీక్షించి న డాక్టరు, నా భార్యకు ఫెలోపియన్ ట్యూబ్స్ మూసుకుపోయి ఉన్నాయని, అది పుట్టుక నుంచి ఉన్న సమస్య అనీ, దానివల్ల ఆమెకు పిల్లలు పుట్టే అవకాశం లేదనీ చెప్పాడు.

ఆ మాటలు కౌసల్యను బాగా నిరాశ పరిచాయి. అయినా, రెండవ అభిప్రాయం కోసం తనను విశాఖపట్నంలో ఒక గైనకాలజీ స్పెషలిస్టుకు చూపించాను. ఆమె కూడా అన్ని పరీక్షలు చేసి, మొదటి డాక్టర్ చెప్పనదానినే ధ్రువీకరించారు.

"ఆపరేషన్ చేస్తే ఏమైనా ఫలితం ఉంటుందా' అని డాక్టర్‌ను అడిగాను. అది సాధ్యం కాదని డాక్టర్ చెప్పడంతో నిరాశతో వెనుతిరిగాము.

అప్పట్నుంచీ కౌసల్య డిప్రెషన్‌లోకి వెళ్లిపోయింది. తాను తల్లిని కాలేనన్న చేదు నిజాన్ని ఆమె జీర్ణించుకోలేక పోయింది. అప్పటి వరకూ ఎంతో చలాకీగా, సరదాగా, ఆరోగ్యంగా ఉండే కౌసల్య, ఈ సమాచారం తెలిసినప్పటి నుంచి మూగనోము పట్టింది. ఆమెలో ఉత్సాహం తగ్గిపోయింది.

రాను రాను ఆమె ఆరోగ్యంలో మార్పులు మొదలయ్యాయి. సరిగ్గా భోజనం చెయ్యకపోవడం వల్ల నీరసంతో బరువు బాగా తగ్గింది. తెల్లగా నిగనిగలాడుతూ ఉండే తన ముఖంలో కళ తప్పింది.

(సశేషం)

# గగనతలంలో మహిళా 'శక్తి'



**సరిహద్దుల్లో శత్రువులను ఎదుర్కొనే యుద్ధ విమానాల కాక్‌పిట్ నుంచి దేశ రక్షణ వ్యూహాలను రచించే ఎయిర్ హెడ్‌క్వార్టర్స్ వరకు... నేడు భారత మహిళా శక్తి సరికొత్త అధ్యాయాన్ని ఆవిష్కరిస్తోంది. నిన్నటివరకు కేవలం కొన్ని విభాగాలకే పరిమితమైన మహిళలు, ఇటీవలి సుప్రీంకోర్టు తీర్పుతో 'పర్మనెంట్ కమిషన్' హక్కును సాధించుకుంటూ పురుషులతో సమానంగా దేశ సేవలో భాగస్వాములవుతున్నారు. మహిళా అధికారులు కీలకమైన పీఠాలను అధిరోహిస్తున్నారు. తాజాగా ఎయిర్ వైస్ మార్షల్ శక్తి శర్మ సాధించిన చారిత్రాత్మక విజయంతో రక్షణ రంగంలో సరికొత్త అధ్యాయం మొదలైంది.**

ఒకప్పుడు అసాధ్యం అనుకున్న రక్షణ రంగ శిఖరాలను భారత మహిళలు సుసాధ్యం చేసి చూపిస్తున్నారు. ప్రపంచంలోనే అత్యంత కఠినమైన 'కంప్యూటరైజ్డ్ పైలట్ సెలెక్షన్ సిస్టమ్' పరీక్షలను దాటుకుంటూ వాయుసేనలో ఫైటర్ పైలట్లుగా దూసుకుపోతున్నారు. ఎయిర్ వైస్ మార్షల్ శక్తి శర్మ సెప్టెంబర్ 1, 2026న ఎయిర్ హెడ్‌క్వార్టర్స్‌లో అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ బాధ్యతలను స్వీకరించడంతో ఐఏఎఫ్ చరిత్రలో అపూర్వ ఘట్టం నమోదైంది. భారత సాయుధ దళాలలో వైద్యేతర విభాగం నుండి టూ-స్టార్ ర్యాంక్ అయిన 'ఎయిర్ వైస్ మార్షల్' పదవిని సాధించిన తొలి మహిళా అధికారిగా శక్తి శర్మ సరికొత్త చరిత్ర సృష్టించారు.

భారత రక్షణ రంగంలో వైద్య విభాగం కాకుండా, ఇతర విభాగాల నుండి 'ఎయిర్ వైస్ మార్షల్' హోదాను అందుకున్న మొట్టమొదటి మహిళ... శక్తి శర్మ. జూన్ 18, 1994న ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విద్యా విభాగంలో ఆమె నియమితులయ్యారు. దీనికి ముందు ఆమె ఎయిర్ కమోడోర్ హోదాలో కపుర్తలాలోని సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ముమ్మొందు మూడు రక్షణ దళాల నుండి ఒక సైనిక్ స్కూల్‌కు నాయకత్వం వహించిన తొలి మహిళా అధికారి కూడా ఆమెయే కావడం విశేషం. భారతీయ మహిళాశక్తికి, రక్షణ రంగంలో వారి ఎదుగుదలకు ఈ నియామకం ఒక గొప్ప మైలురాయిగా నిలిచింది.

ఆకాశంలో సగం అనే నానుడికి అద్దంపడుతూ భారత మిలిటరీలో మెడికల్ విభాగానికి చెందని ఒక మహిళా అధికారి టూ-స్టార్ ర్యాంక్ సాధించడం దేశ చరిత్రలో ఇదే మొదటిసారి. పొలిటికల్ సైన్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన శక్తి శర్మ, డిఫెన్స్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్‌లో మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీని కూడా పొందారు. ఆర్మీ, నావీ, ఎయిర్ ఫోర్స్ త్రివిధ దళాల మొత్తంలో ఒక సైనిక్ స్కూల్‌కు కమాండింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించిన మొట్టమొదటి మహిళా అధికారిగా కూడా ఆమె గుర్తింపు పొందారు.

మహిళలు ఒకప్పుడు అసాధ్యం అనుకున్న పనులు నేడు సుసాధ్యం చేస్తున్నారు. భారత రక్షణ రంగంలోని మూడు దళాలలో (ఆర్మీ, నావీ, ఎయిర్ ఫోర్స్) పురుషులతో సమానంగా కీలక బాధ్యతలను నిర్వహిస్తున్నారు. భారత సాయుధ దళాల్లో అధికారిగా లేదా విధి నిర్వహణలో చేరడం అత్యంత కఠినమైన ప్రక్రియ. యు.పి.ఎస్.సి. నిర్వహించే ఎన్.డి.ఎ, సి.డి.ఎస్ లేదా ఎఎఫ్ సీఏటి వంటి కఠినమైన రాత పరీక్షలలో ఉత్తీర్ణత సాధించడం మొదటి అడుగు. సర్వీస్ సెలక్షన్ బోర్డు నిర్వహించే ఇంటర్వ్యూ ద్వారా 5 రోజుల పాటు జరిగే ప్రక్రియలో అభ్యర్థి శారీరక, మానసిక కార్యకుశలత, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వాన్ని క్షుణ్ణంగా పరీక్షిస్తారు. ఆర్మీ వైద్య పరీక్షలు అత్యంత ప్రమాణాలతో కూడుకుని ఉంటాయి. స్వల్ప ఆరోగ్య లోపాలు ఉన్నా తిరస్కరించే అవకాశం ఉంటుంది. అలాంటి ఎన్నోకఠిన సవాళ్లను అధిగమించి సైన్యంలో కీలకపదవిని లేదా స్థాయిని సాధించడం ద్వారా శక్తి శర్మ ప్రత్యేక గుర్తింపు పొందారు.

ఆర్మీలో కీలక బాధ్యతలు వహించడమంటే వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడం, దళాలను నడిపించే సామర్థ్యం వంటి ప్రత్యేకమైన నాయకత్వ ప్రతిభ కలిగి ఉండాలి. శిక్షణలో ప్రతిభ కనబరచడంతో పాటు బాధ్యతల్లో చూపిన నిబద్ధత, క్రమశిక్షణ, నిరంతర సాధన శక్తి శర్మను ఉన్నత స్థానానికి చేర్చాయి.

ప్రస్తుతం శక్తిశర్మ సాధించిన పదవిని నిర్వర్తించడం కూడా ఆషామాషీ విషయం కాదు. భారత వైమానిక దళంలో ఎయిర్ వైస్ మార్షల్ అనేది అత్యంత కీలకమైన టూ-స్టార్ ర్యాంక్. ఆర్మీలోని 'మేజర్ జనరల్', నేవీలోని 'రియర్ అడ్మిరల్' పదవులకు ఇది సమానం. ఈ స్థాయిలోని అధికారులు వైమానిక దళ వ్యూహాత్మక, నిర్వహణ, పరిపాలనా విభాగాను నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తారు. వారి బాధ్యతలు ప్రధానంగా 3 విభాగాలుగా ఉంటాయి.

**వ్యూహాత్మక, సైనిక బాధ్యతలు:** ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్ (ఏఓసి) కీలకమైన సరిహద్దు ప్రాంతాల్లోని ఎయిర్ కమాండ్లకు, అడ్వాన్స్‌డ్ హెడ్‌క్వార్టర్స్‌కు నాయకత్వం వహిస్తారు.

**యుద్ధ వ్యూహాల అమలు:** ఆయా ప్రాంతాల్లో ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు, ఫైటర్ జెట్ల మోహరింపు, అత్యవసర సమయాల్లో వైమానిక దాడుల వ్యూహాలను పర్యవేక్షిస్తారు.

**త్రివిధ దళాల సమన్వయం:** ఆర్మీ, నేవీ అధికారులతో కలిసి ఉమ్మడి సైనిక చర్యలు విజయవంతంగా జరిగేలా సమన్వయం చేసుకుంటారు.

**ఎయిర్ హెడ్‌క్వార్టర్స్‌లో కీలక పదవులు:** *అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ :* ఢిల్లీలోని ఎయిర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎడ్యుకేషన్, ట్రైనింగ్, ఇంటెలిజెన్స్, ఆపరేషన్స్ లేదా ప్లానింగ్ వంటి ప్రత్యేక విభాగాలకు హెడ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారు.

**విధాన రూపకల్పన:** ఎయిర్ ఫోర్స్‌కు కావలసిన కొత్త సాంకేతికతలు, విద్యా కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, వ్యూహాత్మక విధానాలను రూపొందిస్తారు.

**శిక్షణ, విద్యా నిర్వహణ, శిక్షణా సంస్థల పర్యవేక్షణ:** ఎయిర్ ఫోర్స్ అకాడమీలు, సైనిక పాఠశాలలు, డిఫెన్స్ విద్యా సంస్థల ప్రమాణాలను మెరుగుపరచడం.

**సిబ్బంది నిర్వహణ:** వేలాదిమంది సైనికులు, అధికారుల సంక్షేమం, క్రమశిక్షణ, వనరుల సమర్థవంతమైన వినియోగాన్ని పర్యవేక్షించడం.

భారత సైన్యంలో చేరడమే ఒక పెద్ద సవాలు. అలాంటిది కీలక బాధ్యతలను చేపట్టడం అంటే సాధారణ విషయం కాదు. దీంతో సైన్యంలో చేరాలని కలలు కనే వేలాదిమంది యువతకు, ముఖ్యంగా మహిళలకు శక్తిశర్మ సాధించిన విజయం స్ఫూర్తినిస్తోంది.



**జయశ్రీ ఆచంట**
సీనియర్ జర్నలిస్ట్




# యురేషియా దిశమార్చ

**కిర్గిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో భద్రత, సాంకేతికత, వాతావరణ మార్పులు, డిజిటల్ సహకారం వంటి రంగాలకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సదస్సులో భారత్ చొరవతో మొత్తం 13 ముఖ్యమైన ఒప్పందాలతో పాటు 28 అధికారిక పత్రాలపై సభ్య దేశాలు సంతకాలు చేశాయి. సభ్య దేశాల భద్రతకు ఎదురవుతున్న సవాళ్లు, ముప్పులను తిప్పికొట్టేందుకు ఒక 'యూనివర్సల్ సెంటర్' ఏర్పాటుకు ఆమోదం లభించింది.**

ఉగ్రవాదం, వేర్పాటు వాదం, సరిహద్దు నేరాలను అరికట్టడానికి సభ్య దేశాల మధ్య నిఘా సమాచార మార్పిడిని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. సరిహద్దుల గుండా జరిగే మాదక ద్రవ్యాల అక్రమరవాణా, నార్కో-టెర్రరిజంను అడ్డుకోవడానికి ప్రత్యేక 'యాంటీ నార్కోటిక్స్ సెంటర్' కార్యనిర్వాహక కమిటీ నిబంధనలను ఆమోదించారు. సభ్య దేశాలలో మత్తుపదార్థాల వినియోగాన్ని తగ్గించడం, చికిత్స, పునరావాస రంగాల్లో ఉత్తమ పద్ధతులను పంచుకోవడానికి 2030 వరకు ఒక కార్యాచరణను రూపొందించారు. కృత్రిమ మేధ (ఏఐ) బాధ్యతాయుతమైన, సమగ్రమైన వినియోగంపై పరస్పర సహకారం కోసం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఇందులో భారత్ తన డిజిటల్, ఏఐ అనుభవాలను తోటి దేశాలతో పంచుకోనుంది. వాతావరణ అనుకూల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి కోసం ప్రత్యేక వేదికను ఏర్పాటు చేస్తూ ఎంఓయూ కుదుర్చుకున్నారు. అత్యవసర పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సభ్య దేశాలకు పరస్పర సహాయం అందించేలా ఒప్పందాలు జరిగాయి. ఎస్సీఓ చార్టర్‌లో అధికారిక భాషగా ఇంగ్లీష్‌ను చేర్చేందుకు సభ్య దేశాలు అంగీకరించాయి. సభ్య దేశాల పురాతన సంస్కృతుల మధ్య మార్పిడిని ప్రోత్సహించడానికి ఈ ఏడాది చివరిలో భారత్ వేదికగా మొదటి 'సివిలైజేషన్ డైలాగ్ ఫోరమ్' నిర్వహించనున్నారు. 2025-26 కాలానికి కిర్గిస్థాన్ విజయవంతంగా నిర్వహించిన ఎస్సీఓ అధ్యక్ష బాధ్యతలను, తదుపరి 2026-27 కాలానికి పాకిస్తాన్‌కు బదిలీ చేశారు.

**భారత వాణిని వినిపించి నరేంద్ర మోదీ**

ఈ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ భారత వాణిని ప్రపంచ వేదికపై గట్టిగా వినిపించారు. భద్రత, అనుసంధానత, అవకాశం అనే మూడు కీలక అంశాలపై భారత్ దృక్పథాన్ని స్పష్టంగా చాటిచెప్పారు. ఉగ్రవాద వ్యవస్థను సమూలంగా అంతం చేయాలని, ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే దేశాల ద్వంద్వ ప్రమాణాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావుండకూడదని మోదీ ప్రపంచ దేశాలకు బలమైన సందేశం ఇచ్చారు. ఉగ్రవాదం, వేర్పాటువాదం, అతివాదం వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు సభ్య దేశాలన్నీ ఎలాంటి తారతమ్యాలు లేకుండా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపు నిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, సంక్షోభాల నడుమ కూడా భారత్ 7.8 శాతం బలమైన జీడీపీ వృద్ధి రేటును సాధిస్తోందని వెల్లడించారు. ప్రాంతీయ ప్రయోజనాలు, ద్వైపాక్షిక సంబంధాలు బలపడేలా కీలక చర్చలు జరిపారు.

**'స్విఫ్ట్' కు ప్రత్యామ్నాయంగా 'బ్రిక్స్ పే'**

బ్రిక్స్ కూటమి తరఫున సరికొత్త ఉమ్మడి కరెన్సీ రూపకల్పనపై ఎటువంటి అధికారిక నిర్ణయమూ తీసుకోలేదు. అయితే, అమెరికా డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించడానికి, సభ్య దేశాల మధ్య ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడానికి బదులుగా డిజిటల్ చెల్లింపుల వ్యవస్థపై కీలక అడుగులు పడ్డాయి. బ్రిక్స్ కూటమికి ఒకే ప్రత్యేక కరెన్సీని తీసుకురావాలనే ప్రతిపాదనను భారతదేశం వ్యతిరేకించింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ... భారత్ సొంత కరెన్సీ అయిన 'రూపాయి'ని అంతర్జాతీయంగా బలోపేతం చేయడానికే ప్రాధాన్యత ఇస్తుందని, కొత్త బ్రిక్స్ కరెన్సీకి మద్దతు ఇవ్వదని స్పష్టం చేశారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో బ్రిక్స్ దేశాల సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీలను ఒకదానితో ఒకటి అనుసంధానించే ప్రతిపాదనపై చర్చలు జరిగాయి. దీనివల్ల భారత్ ప్రవేశపెట్టిన 'ఈ-రూపీ' వంటి డిజిటల్ కరెన్సీలను ఉపయోగించి ఇతర బ్రిక్స్ దేశాలతో నేరుగా, సులభంగా వ్యాపార లావాదేవీలు జరుపుకోవచ్చు. పాశ్చాత్య దేశాల అధీనంలో ఉన్న స్విఫ్ట్ చెల్లింపుల వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా 'బ్రిక్స్ పే', క్రాస్-బోర్డర్ పేమెంట్స్ ఇనిషియేటివ్‌ను బలోపేతం చేయాలని నిర్ణయించారు. డాలర్ల అవసరం లేకుండా భారత్ (యూపీఐ), రష్యా, చైనా, బ్రెజిల్ వంటి దేశాలు తమ సొంత స్థానిక కరెన్సీలలోనే (ఉదాహరణకు రూపాయి-రూబెల్) తక్కువ ఖర్చుతో, క్షణాల వ్యవధిలో అంతర్జాతీయ చెల్లింపులు ముగించుకునేలా సాంకేతిక మౌలిక వసతులను సిద్ధం చేస్తున్నారు. ఒక సాధారణ కరెన్సీ నోటుకు బదులుగా, కేవలం దేశాల మధ్య వాణిజ్య విలువను లెక్కించడానికి 'యూనిట్' అనే డిజిటల్ వ్యవస్థను నిపుణులు ప్రతిపాదించారు. దీని విలువలో 40% బంగారం మీద, మిగిలిన 60% బ్రిక్స్ దేశాల కరెన్సీల బాస్కెట్ మీద ఆధారపడి ఉండేలా ప్రణాళికలు సాగుతున్నాయి.

**యూపీఐను ఆమోదించే అవకాశాలు అధికం**

భవిష్యత్తులో బ్రిక్స్ కూటమిలో భారతదేశపు యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) చెల్లింపుల వ్యవస్థను ఆమోదించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే, దీనిని నేరుగా ఒకే అప్లికేషన్‌గా కాకుండా, ప్రతి బ్రిక్స్ దేశపు స్థానిక డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలతో అనుసంధానించేలా చర్చలు జరుగుతున్నాయి. భారత్ తన యూపీఐ సాంకేతికతను ఈ బ్రిక్స్ పే వేదికతో అనుసంధానం చేయడానికి సిద్ధంగా ఉంది. ఇప్పటికే రష్యాకు చెందిన 'ఫాస్టర్ పేమెంట్స్ సిస్టమ్'తో భారత




# మున్న ఎస్‌సీఓ

యూపీఐని అనుసంధానించే పనులు చివరి దశకు చేరుకున్నాయి. భారత రూపే కార్డులను, రష్యాకు చెందిన 'మీర్' కార్డులను పరస్పరం ఆమోదించు కునేలా ఒప్పందాలు జరుగుతున్నాయి. ఇది పూర్తయితే రష్యాలో యూపీఐ వాడకం అధికారికంగా ప్రారంభమవుతుంది. బ్రెజిల్ దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన 'పిక్స్' చెల్లింపుల వ్యవస్థ కూడా మన యూపీఐ లాంటి సాంకేతికతతోనే పనిచేస్తుంది. అలాగే, భారత్–బ్రెజిల్ మధ్య డిజిటల్ లావాదేవీలకు త్వరలోనే ఆమోదం లభించే అవకాశం ఉంది. భారత్ వేదికగా ఈ నెల్లో జరగనున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఈ 'క్రాస్–బోర్డర్ పేమెంట్స్' (సరిహద్దు చెల్లింపుల) అంశంపై భారత్ కీలక ప్రతిపాదనలు చేయనుంది. ఇందులో యూపీఐ వ్యవస్థను బ్రిక్స్ దేశాల డిజిటల్ కరెన్సీలతో అనుసంధానించే తుదినిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

**చైనా అలిపేతో లింక్‌కు అంగీకరించని భారత్**

ఆసియావ్యాప్తంగా15 కోట్లమందికి పైగా వ్యాపారుల వద్ద భారతీయ పర్యాటకులు నేరుగా యూపీఐ ద్వారా చెల్లింపులు చేసుకునేలా 'అలిపే' సంస్థ, భారత ప్రభుత్వానికి ఒక ప్రతిపాదనను పంపింది. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ, భద్రతా సంస్థలు జాతీయ భద్రత, సైబర్ మోసాలు, డేటా లీకేజ్ కారణాలను చూపుతూ ఈ ప్రతిపాదనను తాత్కాలికంగా నిలిపివేసాయి. చైనాకు చెందిన జాతీయ భద్రతా చట్టాల ప్రకారం, ఆ దేశంలోని టెక్ కంపెనీలు తమ ప్రభుత్వానికి, నిఘా సంస్థలకు సహకరించడం తప్పనిసరి. టిక్‌టాక్, ఆలిపే, వీచాట్ వంటి యాప్‌ల ద్వారా భారతీయ పౌరుల లొకేషన్, బ్రౌజింగ్ హిస్టరీ వంటి సున్నితమైన సమాచారాలు చైనా ప్రభుత్వ చేతుల్లోకి వెళ్లే ప్రమాదముందని నిపుణులు హెచ్చరించిన నేపథ్యంలో భారత ప్రభుత్వం సమాచార సాంకేతిక చట్టం (ఐటీ యాక్ట్, 2000)లోని సెక్షన్ 69ఏ ప్రకారం అత్యవసర అధికారాలను ఉపయోగించి ఈ యాప్‌లను బ్లాక్ చేసింది.

**బ్రిక్స్ సదస్సుపై ప్రభావం**

బిష్‌కెక్‌లో జరిగిన ఎస్‌సీఓ సదస్సు విజయాలు, అక్కడ కుదిరిన ప్రాంతీయ అవగాహనలు న్యూఢిల్లీలోని 'భారత్ మండపం' వేదికగా జరగబోయే 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుపై అత్యంత కీలకమైన ప్రభావాన్ని చూపనున్నాయి. ఎస్‌సీఓ సదస్సులో ప్రపంచనేతల మధ్య జరిగిన చర్చలు, వ్యూహాత్మక అడుగులు రాబోయే బ్రిక్స్ అజెండాను నిర్దేశించేలా ఉన్నాయి. ఎస్‌సీఓ ప్రధానంగా ప్రాంతీయ భద్రత, ఉగ్రవాద నిర్మూలనపై దృష్టి పెట్టగా.. భారత్ తన అధ్యక్షతన జరిగే బ్రిక్స్ చర్చలను ప్రపంచస్థాయికి తీసుకెళ్లనుంది. రాబోయే బ్రిక్స్ సదస్సు ముఖ్య ఉద్దేశ్యం 'స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, స్థిరత్వం కోసం నిర్మాణం'. ఎస్‌సీఓ లో సాధించిన పర్యావరణ, విపత్తునిర్వహణ, ఏఐ ఒప్పందాలను ఇక్కడ మరింత విస్తృతం చేయనున్నారు. ఎస్‌సీఓ సదస్సులో ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య జరిగిన ఆత్మీయ సంభా షణలు తీవ్ర ఉత్సుకతను రేకెత్తించాయి. ఎస్సీఓ సదస్సు ఈ ముగ్గురు నేతల మధ్య ఉన్న సరిహద్దు, వ్యూహాత్మక విభేదాలను తగ్గించడానికి వేదికగా పనిచేసింది. దీనితో రాబోయే బ్రిక్స్ సదస్సులో భారత్ ఇటు రష్యా, చైనాలతో కూడిన కూటమిని నడిపిస్తూనే, అటు పాశ్చాత్య దేశాలతో తన సత్సంబంధాలను సమతుల్యం చేసుకునే అవకాశం లభిస్తుంది. ఎస్‌సీఓలో పశ్చిమ ఆసియా సంక్షోభం, అంతర్జాతీయ రవాణామార్గాల రక్షణపై జరిగిన చర్చలు బ్రిక్స్ సదస్సులో నూతన ఆర్థిక, ఇంధన ఒప్పందాలు రూపుదిద్దుకోవడానికి మార్గం సుగమం చేస్తాయి.

**ప్రత్యేక ఆకర్షణగా మోదీ**

కిర్గిస్థాన్ రాజధాని బిష్‌కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచ దేశాల అధినేతల మధ్య ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన ప్రవర్తన, చాతుర్యం తీవ్ర ఉత్సుకతను రేకెత్తించాయి. అధికారిక గ్రూప్ ఫోటో తీయడానికి ముందు ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పరస్పరం కరచాలనం చేసుకున్నారు. ఆ వెంటనే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా వారితో చేరారు. ప్రపంచం లోనే అత్యంత శక్తిమంతమైన ముగ్గురు నేతలు (రష్యా, చైనా, భారత్) ఒకచోట చేరి నవ్వుతూ, సాధారణ విషయాలు మాట్లాడుకోవడం చూసి అంతర్జాతీయ దౌత్య నిపుణులు ఆశ్చర్యపోయారు. తీవ్ర అంతర్జాతీయ ఉద్రిక్తతల నడుమ ఈ ముగ్గురి కలయిక ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సదస్సు వేదికపై పుతిన్, ప్రధాని మోదీని ఆత్మీయంగా హత్తుకుని స్వాగతించారు. పుతిన్‌తో జరిగిన ద్వైపాక్షిక చర్చల్లో మోదీ స్పష్టమైన హితవు పలికారు. 'యుద్ధంలో గడిచే ప్రతి రోజూ మానవాళిని వెనక్కి నెడుతుంది. మనం అంతం లేని యుద్ధం నుండి యుద్ధాల అంతం వైపు సాగాలి' అని ముఖా ముఖిగా మోదీ అనడం గ్లోబల్ మీడియాలో హెడ్‌లైన్స్‌గా నిలిచింది. పాశ్చాత్య దేశాల ఆంక్షల నడుమ రష్యాతో స్నేహాన్ని కాపాడుకుంటూనే, యుద్ధాన్ని వ్యతిరేకించే భారత్ స్వతంత్ర విదేశాంగ విధానం ఆసక్తిని రేపింది.

**పాకిస్తాన్ ఫోటో రాజకీయం**

సదస్సు ముగిసిన తర్వాత పాకిస్తాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ కార్యాలయం సోషల్ మీడియాలో ఒక ఫోటోను పోస్ట్ చేసింది. అందులో వారు ప్రధాని మోదీని, ఇరాన్ అధ్యక్షుడిని ఫోటో నుండి 'క్రాప్' చేసి కేవలం షెహబాజ్ షరీఫ్ సెంటర్‌లో ఉండేలా ఎడిట్ చేశారు. కానీ ప్రధాని మోదీ తన సోషల్ మీడియాలో అందరితో కలిసి ఉన్న పూర్తి ఒరిజినల్ గ్రూప్ ఫోటోను పోస్ట్ చేశారు. దీనితో పాకిస్తాన్ చేసిన చిన్నపిల్లల చేష్టలు ప్రపంచం ముందు బయటపడి నవ్వులపాలయ్యాయి. సదస్సు ముగిసిన తర్వాత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ గంభీరంగా ముందడుగు వేస్తూ నడిచి వెళ్తుండగా.. వెనుక ఉన్న పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను అందుకోవడానికి పరుగెత్తుకుంటూ వెళ్లిన దృశ్యాలు కెమెరాకు చిక్కాయి. ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. ఒకవైపు భారత్ గ్లోబల్ లీడర్‌గా హుందాగా వ్యవహరిస్తుంటే, పాకిస్తాన్ మాత్రం ప్రపంచ దృష్టిని ఆకర్షించడానికి ఎలా ఆరాట పడుతుందో ఈ ఒక్క దృశ్యం స్పష్టం చేసిందని నెటిజన్లు వ్యాఖ్యానించారు. సదస్సు జరుగుతున్న సమయంలోనే మోదీ ఇటు రష్యా, చైనాలతోపాటు అటు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, అర్మేనియా ప్రధాని నికోల్ పాషిన్యాన్, కిర్గిస్థాన్ అధ్యక్షుడు సాదిర్ జాపరోవ్‌లతో వరుసగా ద్వైపాక్షిక చర్చలు జరిపారు. తీవ్రమైన భౌగోళిక రాజకీయ విభేదాలు ఉన్న దేశాల నేతలతో కూడా మోదీ ఏకకాలంలో సత్సంబంధాలు నడపడం అందరి లోనూ ఉత్సుకతను పెంచింది.



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

# పురాణాల్లో జంతువుల ప

హిందూ పురాణాల్లో పలు రకాలైన జంతువుల ప్రస్తావన ఉండడమే కాకుండా వాటి ప్రాముఖ్యత కూడా విస్తారంగా వర్ణించారు. ప్రతి జీవిలో దేవుడు ఉన్నాడనే భావన కలిగిన హిందూ మతం ఓ మహోన్నత జీవ వైవిధ్య పరిరక్షణ మహా మంత్రాన్ని అందించింది. అనేక రకాల జంతువులను దేవతా రూపాలుగా కొలవడం కూడా జరుగుతోంది. సాధారణ చిన్న మూషికం నుంచి భయానక పులి, సింహం లాంటి వన్యప్రాణుల వరకు అన్ని రకాల జంతువుల ప్రస్తావన ఉంది. మనకు అత్యంత విశ్వాసపాత్రమైన కుక్క లేదా పిల్లి నుంచి పక్షులు, గోమాత, ఏనుగు వరకు అన్ని జంతువుల పాత్రలు మన పురాణ ఇతిహాసాల్లో ప్రస్తావించారు. హిందూ సమాజంలో జంతువులు జీవితాల్లో భాగం అయిపోయాయి. 'సర్వప్రాణి సేవయే మాధవ సేవ' అనే నినాదం మన జీవనవిధానంలో ఇమిడిపోయింది. పలు రకాల జంతువులు దేవుళ్లు, దేవతలకు వాహనాలుగానే కాకుండా కొన్ని వారి సేవలో పునీతమయ్యాయి. మన సంస్కృతిలో జంతువులను జ్ఞానం, విశ్వాసం, భక్తికి ప్రతిరూపాలుగా భావిస్తున్నాం. హిందూపురాణాలు, వేదాలు, ఇతిహాసాల్లో పేర్కొన్న కొన్ని జంతువుల గూర్చి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. గోపాలకుడిగా కృష్ణయ్య గోవుల కాపరిగా మారిపోయాడు.



**వినాయకుడి వాహనంగా ఎలుక**

ఆది దేవుడైన గణేశుని వాహనంగా ఎలుక లేదా మూషికాన్ని చూస్తున్నాం. వినాయకున్ని మూషిక వాహనుడిగా పిలుస్తాం. చిన్న ఆకారం కలిగిన ఎలుకపై భారీ వినాయకుడు స్వారీ చేయడం వెనుక పరమార్థానికి వివరణ ఉంది. కోరికలకు చిహ్నంగా భావించే చిట్టి ఎలుక మన మనసులో దొంగచాటుగా దూరి మనల్ని పక్కదారి పట్టిస్తుందని పేర్కొన్నారు. గణేశుడు తన కోరికలను నియంత్రించుకోవడానికి కోరిక అనే ఎలుకను వాహనంగా చేసుకున్నాడని పేర్కొన్నారు. ఆయన వాహనంగా భక్తుల పూజలందుకుంటున్నది ఈ మూషికం.

**శ్రీ విష్ణువు వాహనం - గరుత్మంతుడు**

విష్ణువుకు సేవ చేస్తూ అత్యంతవేగంగా ప్రయాణించే దివ్యపక్షి రాజు గరుడుడు. అత్యంత శక్తివంతమైన పక్షిగా గురుత్మంతుడికి పేరుంది. వేగంగా, అతిబలశాలిగా పేరొందిన గరుడ పక్షిని చెడుపై పోరాడగల యోధుడిగా వర్ణించారు. గురుడు తన తల్లిని పాముల బారిన పడకుండా రక్షించడానికి చేసిన ప్రయత్నంలో తన యజమానిని రక్షించడానికి, సత్యానికి ప్రతీకగా చెబుతారు.

**శివుడి వాహనం - నంది, మెడలో నాగుపాము**

శివుడి ధర్మం, బలానికి ప్రతిరూపం వృషభం. మహాశివుడి అత్యంత విశ్వాసపాత్రమైన సేవకుడిగా నందిని భావిస్తారు. శివుడి ముందు గంభీరంగా కూర్చొని ఉన్న నంది తన ప్రభువును కంటికి రెప్పలా కాపాడుకుంటూ శివ రక్షణకు సిద్ధంగా ఉండడం చూస్తున్నాం. అత్యంత శివభక్తుడైన నంది భక్తిని మెచ్చి తన వాహనంగా చేసుకున్నాడని మన పురాణాలు వెల్లడిస్తున్నాయి. శక్తి, సంయమనం, సత్యం, ధర్మం, న్యాయం, క్రమశిక్షణలకు మారు పేరుగా నందిని పూజిస్తున్నాం. నందీశ్వరుడి చెవుల్లో చెప్పిన కోరికలను శివుడు వింటాడని కూడా నమ్మకం ఉండడం విశేషం. శివుడి మెడలో ఉండే నాగుపాముకు వాసుకి అని పేరు. క్షీరసాగర మథనంలో వాసుకిని మంధర పర్వతానికి తాడుగా వాడిన కథ మనకుతెలుసు. వాసుకి చూపిన భక్తికి మెచ్చి శివయ్య తన మెడలో నాగుపాముకి స్థానం కల్పించాడు. శివయ్య మెడ చుట్టు మూడుచుట్టులుగా అమర్చిన నాగుపాము భూత భవిష్యత్ వర్తమానమనే మూడు కాలాలను సూచిస్తున్నది. పాము కుబుసం విడిచినట్లు మనిషి కూడా పుట్టుక, మరణం, పునర్జన్మ అనే చక్రంలో సాగిపోతున్నాడని అర్థం చేసుకోవాలి.

**విష్ణువు పాన్పు - ఆదిశేషుడు**

ఆదిశేషుడు తన పడగపై భూమిని మోస్తాడు. భగవాన్ విష్ణువు విశ్రాంతి తీసుకునే పానుపుగా శేషుడు సేవలు అందిస్తున్నాడు. స్థిరత్వం, అనంతతత్వాలకు ప్రతీక అయిన ఆదిశేషుడు చూడడానికి కొంత భయంకరంగా కనిపిస్తాడు.

**రామ భక్తుడి వానర రూపం - హనుమంతుడు**

శ్రీరామాయణంలో అద్వితీయ భక్తికి చిహ్నంగా హనుమంతుడిని భావిస్తున్నాం. శక్తి, యుక్తి, భక్తి, స్వామిపై చూపిన అవ్యాజమైన ప్రేమ లాంటి విలక్షణ గుణాలు హనుమంతుడిని దేవుడిగా నిలిపాయి. తన ఇష్ట దైవమైన రాముని సేవలో హనుమ చూపిన భక్తి అనిర్వచనీయం. నిజమైన విధేయత, నిస్వార్థ సేవ, భక్తికి సజీవ సాక్ష్యంగా వానరరూపంలో ఉన్న ఆంజనేయుడు నిత్య పూజలు అందుకుంటున్నాడు.

**జాంబవంతుడిగా ఎలుగుబంటి**

రామాయణంలో మరో విలక్షణ పాత్ర ఎలుగు బంటి రూపంలో ఉన్న జాంబవంతుడు. మహాభారతంలో కూడా ప్రస్తావించిన జాంబవంతుడు అత్యంత శక్తివంతుడు. రాముడికి కూడా సహాయం చేయడానికి సిద్ధపడ్డాడు. భారతంలో శ్రీ కృష్ణుడిని కూడా కలిసిన సందర్భం ఉంది.

# పవిత్ర ప్రస్తావనలు

**యుధిష్టిరుడి విశ్వాసం పొందిన కుక్క**

మహాభారత కథలో యుధిష్టిరుని వెంట కడదాక ఉన్నది కుక్క మాత్రమే. యుధిష్టిరుడు స్వర్గద్వారం వద్దకు చేరి తన వెంట వచ్చిన కుక్కను వెనక్కి వెళ్లమం టాడు. ఆ శునకం ధర్మ దేవతగా మారి నిజరూపం ధరించి, వాస్తవం వెల్లడిస్తుంది.

**సరస్వతీ దేవి వాహనం - హంస**

సృజనాత్మకత తెలివితేటలు, స్వీయ-నియంత్రణ, అందం, ఆకర్షణకు చిహ్నం అయిన హంస జ్ఞానదేవత సరస్వతికి వాహనంగా ముడిపెట్టారు. హంస రంగు రంగుల ఈకలు సమృద్ధిని సూచిస్తాయి. యుద్ధ దేవత, శివ-పార్వతుల కుమారుడైన కార్తికేయునికి వాహనంగా నెమలి ఉంటుంది. ఈ దైవస్వరూప పక్షి అపారశక్తికి, అద్వితీయ భక్తికి ప్రతిరూపంగా నమ్ముతున్నాం.

**దుర్గా దేవి వాహనం - సింహం**

అడవికి రాజు సింహం. అత్యంత బలమైన సింహాన్ని నరసింహ అవతారంగా కొలుస్తున్నాం. నిర్భయత్వం, గంభీరరూపం చెడును అంతం చేసే సామర్థ్యం కలిగిన సింహం వాహనంపై దుర్గాదేవి దర్శనం ఇస్తుంది. దుష్ట శక్తులు దీని ముందు నిలబడలేవు.

**లక్ష్మీ దేవి వాహనం- గుడ్లగూబ**

ధనం, శ్రేయస్సుకు ప్రతిరూపమైన లక్ష్మీదేవి వాహనంగా తెల్ల గుడ్లగూబ. జ్ఞాన అవగాహనలకు చిహ్నమైన గుడ్లగూబ కూడా మన మనసుల్లో భక్తి భావనలను రెట్టింపు చేస్తున్నది.

**ఐరావతం**

ఇంద్రుడి ఏనుగు తెల్లని రంగులో మేఘాల రూపంలో ఐరావతం అనే పేరుతో కీర్తి అందుకుంది.

**కామధేనువు**

సురభి అనే కామధేనువు మానవ సమస్త కోరికలను తీర్చగల గోమాతగా నేటికీ ఆరాధిస్తున్నాం. తన యజమానికి పోషణ, దయ, సమృద్ధిని ప్రసా దించే తల్లిగా, దైవిక జీవిగా గోమాతను కొలు స్తున్నాం.

**మత్స్య, కూర్మ, వరాహ అవతారాలు**

విష్ణుమూర్తి తొలి అవతారంగా మత్స్యప్రభువును చూస్తున్నాం. తొలి జీవులు జలచరాలు అంటూ మన పురాణాలు ఘోషిస్తున్నాయి. రెండవ అవతారమైన కూర్మం లేదా తాబేలు ఉభయచరంగా నీటిలో, నేల మీద మనుగడ సాగించగలదు. మూడవ అవతారమైన వరాహస్వామి పంది రూపంలో భూదేవిని హిరణ్యాక్షుడనే రాక్షసుడి బారి నుంచి రక్షించినట్లు తెలుసుకుంటున్నాం.

రామాయణంలో ఉడుతల ప్రస్తావన ఉంది. లంకకు వారధి కట్టడానికి తనవంతు సహకారం అందించి రాముడి ప్రశంసలను పొందడం, రాముడి చేతితో నిమరడంతో చారలు రావడంలాంటి కథలను విన్నాం. ఉడుతలతో పాటు చిలుకలు, రాబందులు, జింకలు, ఆవులలాంటి జంతువుల ప్రస్తావన ఉండడం గమనిస్తున్నాం. రామాయణంలో గద్దను 'జటాయువు' అని పిలుస్తున్నాం. రావణుడు సీతను అపహరించిన సమయంలో ఆమెను రక్షించడానికి ప్రాణాన్ని ఫలంగా పెట్టింది. చిలుక ముఖం కలిగిన "శుక" అనే మహర్షి వ్యాసుడి కుమారుడు. బ్రహ్మ/వరుణల ఏడు హంసల వాహనం, శక్తికి రూపంగా ఎద్దు, శని వాహనంగా కాకి, వాయు వాహనంగా వెయ్యి గుర్రాలు, విశ్వకర్మకు ఏనుగు, భైరవుని చిహ్నంగా కుక్క, యముడి వాహనంగా దున్నపోతు లాంటి అనేక జంతువుల విశిష్టతను మన పురాణాలు వివరించాయి. నీటిని పాలను వేరు చేయగల గుణం హంసకు ఉంటుంది. సరస్వతికి సంబంధించిన ఈ జంతువులో విచక్షణ గుణాన్ని ప్రతిబింబిస్తున్నది. కల్కి, రేవంత, చంద్రుడు, సూర్యుడు, ఖండోబ వంటి దేవతలతో గుర్రానికి సంబంధం ఉన్నది.

హిందూ సంస్కృతిలో జంతువులతో పాటు పలు రకాల వృక్షాలను కూడా పేర్కొన్నారు. వాటిలో ముఖ్యంగా రావి చెట్టు (అశ్వత్థ వృక్షం), పరమ పవిత్రమైన తులసి, కోర్కెలను తీర్చే కల్పవృక్షం లాంటి వృక్ష సంపద కూడా మన సంస్కృతితో బంధాలను పెనవేసుకున్నాయి. హిందూ పురాణాల్లో జంతురాజ్యంలోని విభిన్న ప్రాణులు ఆధ్యాత్మికతతో సంబంధాలను కలిగి ఉండడం విశేషం. ప్రకృతిలోని ప్రాణికోటి పరిరక్షణతోనే జీవ వైవిధ్యం పరిరక్షితమవుతూ, మానవ మనుగడకు బాటలు వేయడం జరుగుతున్నది. ఇలా ప్రతిజీవికి ఒక ప్రత్యేకత ఉందని తెలుపుతున్న హిందూ పురాణాలు మానవ జాతికి లభించిన అపూర్వ వరాల్ని గుర్తించి జీవులను కాపాడుకోవడానికి నిరంతర కృషి జరగాలని ఆశిద్దాం.



**డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**



# అప్పుడు అలా...! ఇప్పు

**రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరనే నానుడి ఎంత నిజమో.. అధికారంలో ఉన్నప్పుడు అనుసరించే సూత్రాలు, ప్రతిపక్షంలోకి రాగానే మారిపోతాయనేది కూడా అంతే పచ్చి నిజం. రాష్ట్ర శాసనసభ సాక్షిగా ఇప్పుడు సరిగ్గా రకమైన రాజకీయ నాటకం ఆవిష్కృతమవుతోంది. నిన్నటి వరకు అధికారంలో ఉండి, అసెంబ్లీ నియమ నిబంధనలను కఠినతరం చేస్తూ, సభ నిర్వహణ పేరుతో విపక్షాల గొంతు నొక్కేశారని విమర్శలు ఎదుర్కొన్న భారత రాష్ట్ర సమితి (నాటి టీఆర్ఎస్) ఇప్పుడు అవే నిబంధనలను బేఖాతారు చేస్తూ రావడం విశేషం.'అసెంబ్లీకి రండి.. ప్రజా సమస్యలపై చర్చించండి' అని సవాళ్లు విసిరిన అధికార కాంగ్రెస్ పార్టీ.. తీరా ప్రతిపక్ష నేతలు నిరసన తెలపడానికి రాగానే, శాసనసభ గేట్ల ముందే అడ్డుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. అధికారంలో ఉన్నప్పుడు ఒక రకంగా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరొక రకంగా వ్యవహరిస్తున్న ఈ రెండు ప్రధాన పార్టీల తీరుపై ప్రజల్లో ఆసక్తికరమైన విశ్లేషణలు సాగుతున్నాయి.**

రాష్ట్రాన్ని పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్ అసెంబ్లీలో ప్రతిపక్షాల నిరసనలను అడ్డుకునేందుకు అనేక కఠిన నిబంధనలను తీసుకొచ్చింది. సభా ప్రాంగణంలోకి ప్లకార్డులు, నిరసన పత్రాలు, బ్యానర్లు, ప్రత్యేక నిరసన దుస్తులు ధరించి రావడంపై ఆంక్షలు విధించింది. సభా సంప్రదాయాలు, సభాపతి విశేషాధికారాల పేరుతో నాటి విపక్షాలు కాంగ్రెస్, బీజేపీ సభ్యులను పలుమార్లు సస్పెండ్ చేయడమో, లేదా అసెంబ్లీ పరిసరాల్లోకి రాకుండా అడ్డుకోవడమో చేసింది. 'అసెంబ్లీ అనేది చర్చల వేదిక. నిరసనల ప్రాంతం కాదు' అని బీఆర్ఎస్ నేతలు నాడు సుద్దులు చెప్పారు. కాలం తారుమారైంది. విపక్ష పాత్రలోకి వచ్చిన బీఆర్ఎస్ నేతలకు తాము ప్రవేశపెట్టిన నిబంధనలు గుర్తున్నట్లు లేదు.

**నల్ల టీ షర్టులతో రణరంగమైన అసెంబ్లీ గేటు**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తి అయినా, అది ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి రావడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కె.తారకరామారావు, హరీష్‌రావు నేతృత్వంలో ఆ పార్టీ ప్రజాప్రతినిధులు నల్ల చొక్కాలపై కాంగ్రెస్ వైఫల్యాల నినాదాలు రాసుకొని శాసనసభ ప్రాంగణంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, నినాదాలతో కూడిన నల్ల దుస్తులు లేదా టీషర్టులు ధరించి సభలోకి వెళ్లడం అసెంబ్లీ నియమావళికి విరుద్ధమని పోలీసులు, భద్రతా సిబ్బంది వారిని గేటు బయటే అడ్డుకున్నారు. దీంతో అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద పోలీసులకు, బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. తాము సభలోకి వెళ్లకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని పూడ్చిపెట్టడమేనంటూ రోడ్డుపై బైఠాయించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నల్ల చొక్కా వేసుకుని పార్లమెంటులో నిరసన తెలిపితే లేని అభ్యంతరం, తమకు ఎందుకని కేటీఆర్ ప్రశ్నించారు. ఆ తర్వాత నేతల అరెస్టులు,



తోపులాటలు, చొక్కాలు విప్పేసి ఆందోళనలు చేయడం తీవ్ర కలకలం రేపింది.

**అసెంబ్లీకి రావాలంటూ సవాళ్లు...**
**రాగానే అడ్డుగోడలు**

మరోవైపు.. అధికార పక్షం వ్యవహరించిన తీరు కూడా ఆత్మరక్షణలో పడేసేలా మారింది. 'ధైర్యం ఉంటే అసెంబ్లీకి రండి.. ప్రజా సమస్యలపై చర్చించండి, సమాధానం చెప్పడానికి మేము సిద్ధం' అని ముఖ్యమంత్రి, మంత్రులు, పార్టీ ముఖ్య నాయకులు ఇటీవల బీఆర్ఎస్‌కు బహిరంగ సవాళ్లు విసిరారు. తీరా ప్రజా సమస్యలపై, నెరవేరని హామీలపై ప్రశ్నించడానికి ప్రతిపక్ష నాయకులు అసెంబ్లీ గేటు వద్దకు వస్తే, సాంకేతిక, దుస్తుల నిబంధనల సాకుతో వారిని బయటే నిలిపివేయడం విమర్శలకు తావిచ్చింది. సవాళ్లు విసిరి, తీరా వచ్చిన తరువాత లోపలికి రాకుండా అడ్డుకున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. నల్ల టీషర్టులు వేసుకుని వస్తే, సభ లోపల నియమ నిబంధనల ప్రకారం స్పీకర్ హెచ్చరించడమో లేక చర్యలు తీసుకోవడమో చేస్తారు. కానీ,తమను సభలో ప్రశ్నిస్తారనే భయంతోనే అసెంబ్లీ ప్రవేశ ద్వారం వద్దే పోలీసులను పెట్టి అడ్డుకుందని బీఆర్ఎస్ వర్గాలు విమర్శించే అవకాశం దొరికింది

**బీఆర్ఎస్ - కాంగ్రెస్ : నాడు-నేడు**

ప్రతిపక్షాలు నిరసన తెలపడాన్ని సభా ధిక్కారంగా భావించింది అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం. విపక్షాలు ఏ చిన్న నిరసన తెలిపినా సస్పెన్షన్ వేటు వేసింది.ఇప్పుడు అదే పార్టీ ప్రతిపక్షంగా, నిబంధనలకు విరుద్ధంగా నల్ల టీషర్టులు, నినాదాల బోర్డులతో అసెంబ్లీ ముట్టడికి దిగింది. అలాగే, కాంగ్రెస్ ప్రతిపక్షంగా ఉన్నప్పుడు, అధికార పక్షం, విపక్షాల గొంతు నొక్కుతోందని, ప్రజాస్వామ్యాన్ని హత్య చేస్తోందని గగ్గోలు పెట్టింది. ఇప్పుడు రసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు ఉందంటూనే, పోలీసులను గేటు బయటే పెట్టి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అడ్డుకుని అరెస్టు చేయించింది.



విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, 22-ఏ భూముల సమస్యలపై శాసనసభలో చర్చ జరగకుండా కాంగ్రెస్-బీఆర్ఎస్ పార్టీలు కలసి నాటకాలు ఆడుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు ఆరోపించారు. ఒకరు నల్ల



# డు ఇలా..!

శాసనసభ అనేది ప్రజల సమస్యలు చర్చించి పరిష్కారాలు వెతికే పవిత్ర దేవాలయం. రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ద్వంద్వ వైఖరిని వీడాల్సిన అవసరం ఉంది. నియమ నిబంధనలు కేవలం ప్రతిపక్షాలకే పరిమితం కాకూడదు. అలాగే అధికారం ఉన్నప్పుడు తాము ఖండించిన చర్యలనే ప్రతిపక్షానికి మారిన తరువాత అనుసరించడం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమంటున్నారు నిపుణులు. బీఆర్ఎస్ నల్ల టీషర్ట్ నిరసన, కాంగ్రెస్ అడ్డుకున్న తీరు రెండూ కూడా రాజకీయ ప్రయోజనాల కోసం నాటకాలాడటమేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నిబంధనలు, డిమాండ్లు, నిరసనల పేరుతో అసెంబ్లీ చర్చలను పక్కదారి పట్టించడం కంటే, సభలో ప్రజా సమస్యలపై లోతైన చర్చలు జరగడమే ప్రజా స్వామ్యానికి అసలైన మేలు చేస్తుందంటున్నారు.

చట్టసభల విలువలు రోజురోజుకూ దిగజారి పోతున్నాయి. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, సాగునీరు, మౌలిక వసతుల లేమి వంటి సమస్యలపై అర్థవంతమైన చర్చలు జరగాల్సిన వేదికలు, రాజకీయ నాయకుల వ్యక్తిగత కక్షసాధింపులకు, వీధి పోరాటాలకు వేదికలుగా మారుతున్నాయి. ప్రజాప్రతినిధులు సభలో ప్రవర్తిస్తున్న తీరు, వాడుతున్న భాషను సామాన్య పౌరుడు ఏవగించుకునే అసహ్యించుకునే పరిస్థితి ఏర్పడింది.

**అర్థవంతమైన చర్చలు శూన్యం..**
**ఆరోపణలే లక్ష్యం**

ఒకప్పుడు శాసనసభల్లో ప్రజాసమస్యలపై గంటల తరబడి సముచిత రీతిలో విశ్లేషణలు, వాదోపవాదాలు జరిగేవి. కానీ నేటి చట్టసభల్లో విధానపరమైన చర్చల స్థానాన్ని వ్యక్తిగత విమర్శలు ఆక్రమించాయి. అధికార పక్షం విపక్షాల గొంతు నొక్కేందుకు ప్రయత్నించడం, విపక్షాలు సభా సమయాన్ని నిరసనలు, హంగామాలతో వృథా చేయడం పరిపాటిగా మారింది. రూ.కోట్ల ప్రజా ధనంతో నిర్వహించే ఈ సమావేశాలు, నాయకుల రాజకీయ ప్రయోజనాల వేదికలుగా మారాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. స్పీకర్ స్థానాన్ని, సభా సంప్రదాయాలను అగౌరవ పరుస్తూ, పరుష పదజాలంతో దూషించుకోవడం, గేటు బయట ధర్నాలు, తోపులాటలు, దుస్తులు విప్పి నిరసనలు వంటి చేష్టలు ప్రజాస్వామ్యానికే అవమానకరం. సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన నాయకులే క్రమశిక్షణ విస్మరిస్తూ, వారు భావి తరాలకు ఇచ్చే సందేశం ఏమిటి? అనే ప్రశ్నకు సమాధానం దొరకడం లేదు.

వీధి పోరాటాలు, ఆందోళనలు చేయడానికి వీధులు, ధర్నా చౌక్‌లు ఉన్నాయి. కానీ చట్టసభల్లోకి వచ్చి కనీస నియమావళిని పాటించకుండా రణరంగం సృష్టించడం దేనికి? సవాళ్లు విసరడం, తీరా సభకు వచ్చాక సాంకేతిక కారణాల సాకుతో అడ్డుకోవడం లేదా సభలో మైకులు బంద్ చేసి పరస్పర దాడికి దిగడం చూస్తుంటే 'ఈమాత్రం దానికి చట్టసభలు ఎందుకు?' అనే భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది. ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యల పరిష్కారం కంటే స్వపక్ష ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలున్నాయి.

చట్టసభలు కుస్తీ పోటీల కేంద్రాలు కావని, అవి ప్రజాస్వామ్య నిలయాలని అన్ని పార్టీల నాయకులు గ్రహించాల్సిన అవసరం ఉంది. నాయకులు తమ స్వార్థ రాజకీయాలను పక్కనబెట్టి సభా సాంప్రదాయాలను, ప్రజల నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యతను గుర్తించాల్సి ఉంది.

అంతకుముందు.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలంటూ అసెంబ్లీ సమావేశాల తొలిరోజు (సెప్టెంబర్ 7) బీజేపీ చేపట్టిన అసెంబ్లీ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పార్టీ కార్యకర్తలు బారికేడ్లను దాటుకుంటూ, పోలీసుల ఆంక్షలను ఛేదించుకుంటూ అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద ఆందోళనకు దిగారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుతోపాటు పార్టీ నాయకులు, శ్రేణులు వ్యూహాత్మకంగా అసెంబ్లీ వద్దకు దశలవారీగా చేరుకుని, అసెంబ్లీ ప్రాంగణలోకి చొచ్చుకు పోయేందుకు ప్రయత్నించగా,పోలీసు బలగాలు అడ్డుకున్నాయి. ఈ సందర్భంగా బీజేపీ నాయకులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. రాంచందర్‌రావును పోలీసులు అరెస్టు చేసి తీసుకువెళ్తున్న క్రమంలో ఆ వాహనాన్ని బీజేపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో, మరోసారి ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నేతలకు స్వల్ప గాయాలయ్యాయి. రాంచందర్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు ఎన్వీ సుభాష్, మనోహర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, ప్రభాగౌడ్, గణేశ్‌కుందేతో పాటు పెద్దసంఖ్యలో తరలివచ్చిన పార్టీ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీసుస్టేషన్‌లకు తరలించారు. అనంతరం విడిచిపెట్టారు.

**సుజాత గోపగోని**
**సీనియర్ జర్నలిస్ట్, 6302164068**

## కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు: బీజేపీ

డ్రెస్, మరొకరు తెల్ల డ్రెస్ వేసుకుని తిట్టుకున్నట్లు నటించడం తప్ప, ప్రజాసమస్యలపై చర్చించడంలేద న్నారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని, 8 లక్షల మంది విద్యార్థుల సంతకాలతో ముఖ్యమంత్రిని కలుస్తామని విజ్ఞప్తి చేసినా ఆయన స్పందించలేదని విమర్శించారు. విద్యార్థుల సంతకాలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసేందుకు సచివాలయం వద్దకు వెళ్లగా, గేటు దగ్గరే అడ్డుకున్నారని అన్నారు. తమ పార్టీ శాంతియుతంగా కార్యక్రమాలు చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు భయపడుతోందని రామచందర్ రావు నిలదీశారు. ఫీజు రీయింబర్స్ మెంటు బకాయిల విడుదల కోసం తాము చేపట్టిన పోరాటం ఆగబోదని రాంచందర్‌రావు స్పష్టం చేశారు.

కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ,రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన అందిస్తామని గొప్పలు చెప్పుకుని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పార్టీ, ఇప్పుడు ప్రజా సమస్యలపై గొంతెత్తితే అరెస్టులు, ప్రశ్నిస్తే నిర్బంధాలు, నిరసన తెలిపితే లాఠీలతో సమాధానంలా వ్యవహరిస్తోందని విమర్శించారు. తమ పార్టీ సభ్యులు సభ లోపల ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా అడ్డుకోవడం.. సభ బయట ప్రజాసమస్యలపై గొంతెత్తుతున్న నాయకులను అరెస్టు చేయడం దారుణమనవి, ఇది ఇది ప్రజాస్వామ్య పాలన కాదని, పక్కా నియంతృత్వమని వాఖ్యానించారు.




ప్రపంచ చరిత్రలో అక్షరం పాత్ర అత్యంత కీలకమైంది, విప్లవాత్మకమైంది. అక్షరం కేవలం భాషను రాసే సాధనం మాత్రమే కాదు. మానవ నాగరికత- సంస్కృతి, విజ్ఞానం, పరిపాలనలను తరతరాలకు అందించే పునాది. అక్షరాల ద్వారా విజ్ఞానం, సాహిత్యం, శాస్త్రీయ అంశాలు ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి, ఒక తరం నుండి మరో తరానికి వ్యాపిస్తాయి. మణిపూర్‌లో నిప్పురాజేసింది అక్షరమే. మణిపూర్ కవిత్రయం దంగ్జం ఇబోపిషక్ సింగ్, ఇబోంచసింగ్, డబ్ల్యు.రంజిత్ వారి రచనలు మణిపూర్ ప్రజలను రెచ్చగొట్టాయి. ఉదాహరణకు దంగ్జం గేయం-

ఇప్పుడీ నేలపై / ఒక్కరూ బిగ్గరగా మాట్లాడుకోలేరు / ఒక్కరూ స్వేచ్ఛగా ఆలోచించుకోలేరు / చావాలనుకునే వారిని చావనీ / నీ వనరులను పిండేస్తున్న వారిని / మోసగిస్తూ, దొంగిలిస్తూ, బెదిరిస్తూ / ఏడు తరాలకోసం సంపద పోగేస్తున్న వారిని / వాళ్లని నీ కోసం చావనీ / నేనెందుకు చావాలి.

నీలకాంత సింగ్ వ్రాసిన కవిత 'పుట్టుకతో నేను జింకను / కానీ ఇప్పుడు పెద్దపులిగా మారాలని వుంది' అయితే ఇక్కడ శాంతి కోసం పరితపించే కవులు కూడా లేకపోలేదు. ఇరోం చానూ షర్మిల కవిత -

మరణించిన నా శరీరాన్ని / భూమిలో కుళ్లి కృషించిపోనీ / భావి తరాలకు అది కొంత ఉపయోగపడనీ / అక్కడ నుంచే ప్రపంచమంతా రాబోయే తరాలకు / నేను శాంతి పరిమళాల్ని వ్యాపింపచేస్తాను. నేల అదే - నేల కడుపులో దాగిన విత్తనాలు వేరు, పెరిగే పైరు వేరు, పండే పంట వేరు. కానీ పంచుకొని తీర్చుకోవాల్సిన క్షుధార్తి మాత్రం వొకటే. ఆకలి తీరాక ఆస్వాదించే కవిత్వ మాధుర్యం, దాని అనుభూతి ఒక్కటే. ఇదే భిన్నత్వంలో ఏకత్వానికి ప్రత్యక్ష ఉదాహరణ.

భారతదేశపు ఈశాన్య ప్రాంతాలైన అస్సాం, అరుణాచలప్రదేశ్, మిజోరాం, మణిపూర్, నాగాలాండ్, మేఘాలయ, త్రిపురలను సప్త సోదరీమణులు ( 7 సిస్టర్స్ ) ప్రాంతంగా పిలుస్తారు. ఈశాన్య భారతం మానవ పరిణామశాస్త్ర సంగ్రహాలయం. సుమారు 400 భాషలు, మాండలికాలు, 7వరకూ వర్గాలతో విభిన్న జాతుల ప్రజల మతాల సమ్మేళనం. భారతదేశ చరిత్రలో ఈశాన్య రాష్ట్రాల ప్రస్తావన అంతగా కన్పించదు, దురదృష్టం.

సాహిత్య విషయానికొస్తే ఈశాన్య ప్రాంతానిది కేవలం సంఘర్షణ ప్రధానమైన సాహిత్యమే కాదు, ప్రాంతీయ అస్తిత్వం, సాంస్కృతిక మూలాలు, గత వైభవం మొదలైనవి బలంగా వేళ్లునికొని ఉన్నాయి. భక్తి ఉద్యమం మొదలుకొని, సంస్కరణ ఉద్యమాలు, వలసపాలన ప్రభావం క్రైస్తవం, ఆంగ్లభాష విస్తరణ, పశ్చిమ దేశాల ఆధునికత కూడా ఇక్కడ కన్పిస్తున్నాయి.

గిరిజన తెగలు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో సహజంగానే మౌఖిక సాహిత్యం ఉంటుంది. తెగలు మాట్లాడుకునే భాషలకు సాహిత్యం, వ్యాకరణం, లిపి లేక పోయినా మౌఖిక సంపద ఉండకపోదు. మాటను పాటను నమోదు చేసుకునేందుకు శతాబ్దాల క్రితం ఏ విధమైన ధ్వని యంత్రాలు లేకపోయినా లిపి ద్వారా నిక్షిప్తం చేయగలిగారు. లిపి, రాత రానప్పుడు కూడా మనస్సుకు హత్తుకునే భావాల మూలంగా ఒకరి నుండి ఒకరికి జ్ఞాపకాల ద్వారా వచ్చిన సాహిత్యం దొరికింది. ప్రపంచ సాహిత్యంలో గ్రీకు హోమర్, ఫిన్నిష్, కలవెల, సుమేరియ బాబిలోనియన్ల గిల్‌గిమిష్ లాంటి మహాకావ్యాలు లేకపోలేదు.

మణిపూర్ ఈశాన్య ప్రాంతంలో ఉన్న ఒక అందమైన రాష్ట్రం. దీని రాజధాని ఇంఫాల్ రత్నాల భూమిగా పిలిచే పచ్చని కొండలు లోయలతో కూడి మయన్మార్ సరిహద్దులో ఉంది. 'మెయితీ' వీరి ప్రధాన భాష.

మణిపూర్‌కు ఉత్తరాన నాగాలాండ్, దక్షిణాన మిజోరాం, పశ్చిమాన అస్సాం, రాష్ట్రాలు ఉన్నాయి. తూర్పున మాయన్మార్ దేశంతో అంతర్జాతీయ సరిహద్దును కలిగి ఉంది. 1949 సెప్టెంబర్ 21, మణిపూర్ విలీన ఒప్పందంపై సంతకం చేసిన తరువాత అక్టోబరు 15, 1949లో భారత్ యూనియన్‌లో భాగమైంది. తూర్పు స్విట్జర్లాండ్‌గా కూడా ఈ ప్రాంతాన్ని భావిస్తారు.

ప్రాచీన చరిత్ర ప్రకారం ఈ ప్రాంతాన్ని గంధర్వ దేశంగా చెబుతారు. మహా భారతంలో మణిపూర్ ప్రస్తావన ఉంది. అర్జునుడు మణిపూర్ రాకుమారి చిత్రాంగదను వివాహమాడినట్టు, వారి కుమారుడే బభ్రువాహనుడు. గొప్ప సాహసి, యోధుడు. ఆగ్నేయాసియా దేశాలకు మణిపూర్ ముఖద్వారం కావడంతో ఈ ప్రాంతంగుండా చైనా, ఆగ్నేయాసియా దేశాలతో వర్తక వ్యాపారాలు కొనసాగాయి. మణిపూర్‌లోని మోరే పట్టణం భారత్-మయన్మార్ సరిహద్దుల్లో ఉంది. ఇది ఆగ్నేయాసియాతో వాణిజ్యానికి ప్రధాన కేంద్రం. ఆసియా హైవే




మణిపూర్ ద్వారా మయన్మార్‌కు అక్కడి నుండి థాయ్‌లాండ్, ఇతర ఆగ్నేసియా దేశాలతో అనుసంధానత ఉంది.

మణిపూర్‌లో కూకీ, మైతీ, నాగా, పంగల్, మిజో లాంటి ప్రధాన తెగల విభిన్న సంస్కృతులు, భాషలు గల ప్రాంతం. పోలో ఆటకు జన్మస్థలం. కీ॥శ॥ 33వ సంవత్సరంలో "శంఖగ్బ" రాజు నుండి మొదలై 1949 వరకు చివరిరాజు బుధచంద్రవరకు 109మంది రాజులు పాలించారు. సమయానుకూలంగా ఈ ప్రాంతం అనేక పేర్లతో గుర్తింపు పొందింది. అవి- సన్నలైపక్, టిల్లీ కోక్తోంగ్ పోయిరైలం, మితైలిపక్, మైత్రబక్ మొదలైనవి. 16వ శతాబ్దంలో సనహిహెూన్ హన్, 17వ శబాబ్దంలో గరీబ్ నివాజ్, బర్మా (మాయన్మార్) లోనికి చొచ్చుకుని పోయి రాజ్యాన్ని విస్తరించారు. 18వ శతాబ్దంలో పాలించిన మహారాజా భాగ్యచంద్ర (1762-1798) బర్మా సేనలతో పోరాడి మాతృభూమిని జయప్రదంగా కాపాడుకున్న వీరుడు. అలాగే వైష్ణవ ప్రజాదరణకు కూడా కారకుడు. మణిపురి నృత్యంగా ప్రసిద్ధి చెందినవారి శాస్త్రీయ నృత్యం "రాసలీల" సృష్టికర్తగా చరిత్రలో అతడు నిలిచిపోయాడు. అయితే 1891లో ఆంగ్లేయులతో ఖొంగోంలో పోరాడి ఓడిపోయాక 1947 వరకు పరాధీనమైంది.

మణిపూర్ భాష టిబెట్ జర్మన్ భాష అయిన మైతైలోన్, లేదా మీతై భాష (ఏడు మండలి కాల మిశ్రమం) ఈ భాష మాట్లాడేవారు అస్సాం, మిజోరాం, త్రిపుర, బంగ్లాదేశ్, మయన్మార్‌లో కూడా ఉన్నారు. మణిపురిలో వున్న 29 వివిధ తెగల మధ్య అది సంపర్కభాషగా గుర్తింపును పొందింది. దీని లిపి భాష విష్ణుప్రియ. మణిపురి, మయన్మార్, బాంగ్లాదేశ్, మేఘాలయ, అస్సాం, అరుణాచల




# అగ్నికి ఆజ్యం ఆ రచనలే

ప్రదేశ్‌ల్లో కూడ ఈ భాష వాడుతున్నారు. బెంగాలీ లిపిలో ఉన్న విష్ణుప్రియ మణిపురిలో కూడా కొంత సాహిత్యం ఉంది. సుమారుగా 8వ శతాబ్దంలో మణిపూరి సాహిత్యం ప్రారంభమైంది. దీన్ని 3 కాలాలుగా విభజిస్తారు. ప్రాచీన కాలం 8వ శతాబ్ది నుండి 1074 వరకూ మౌఖిక జానపద గేయాలే నాటి సాహిత్యం. మధ్యయుగకాలం 1074 నుండి 1709 వరకు, ఆధునిక యుగం 1709 నుండి నేటి వరకు మణిపూరేర్ ఇతిహాస 1890లో ముద్రితమైంది.

మణిపూర్ చరిత్రను మలుపు తిప్పింది గరీబ్ నిహాజ్‌ను మహారాజ్ (1709–1748). ఇతని కాలంలోనే మైతీలను హిందూమతంలోనికి మార్చింది. అంతే కాక, 1709లో తూర్పు బెంగాల్ నుండి వచ్చిన హిందూ ప్రచారకుడు శాంతిదాస్ గోసైన్ ప్రోద్బలంతో మైతీ రాత ప్రతుల్ని తగలబెట్టించాడు. మైతీ లిపిని సైతం బెంగాలీ లిపిలోనికి మార్చాడు. అప్పటి నుండి సంస్కృతం, బెంగాలీ, బ్రజ్ బోలీల్లో నుంచి హిందూ కట్టుబాట్లు రావడం మొదలైంది. సంస్కృతం, బెంగాలీ నుండి ధార్మిక పౌరాణిక అనువాదాలు ఎక్కువయ్యాయి. కవి అంగోం గోపి (1710–1780) బెంగాలీ నుండి సంస్కృతం నుండి అనేక గ్రంథాలు కావ్యాలు అనువాదం చేశాడు.

అంగోం గోపి గంగాదాస్ సేన్ వ్రాసిన మహాభారతంలోని పరీక్షిత్‌ను బెంగాలీ నుండి అనువదించారు. ఉత్తర కాండను కూడా అనువదించారు, తరువాత యుబరాజ నబానంద రామకృష్ణ దాస్ రాసిన విరాట పర్వాన్ని బెంగాలీ నుండి అనువదించాడు. 18వశతాబ్దం చివరిభాగంలో లాంగ్జామ్ పరశురామ్ బెంగాలీలో రాసిన మహాభారతంలోని గంగాదాస్ రాసిన అశ్వమేధ పర్వాన్ని మైతేయి భాషలోకి అనువదించాడు. ఈ కాలంలో రాసిన మరో గొప్ప అనువాదం గోవింద మిశ్రపండిట్ భగవత్‌గీతను పరశురాం అనువదం. అతడు పాంహీబారాజు (1709–1748) ఆస్థానంలో పనిచేసేవాడు. 1940 నాటికి బెంగాల్ నుండి చైతన్య మహాప్రభు నవ్య వైష్ణవవాదం మణిపూర్ సాహిత్యంలోకి చేరింది. ఆంగ్లేయుల ఆక్రమణ తరువాత ఆంగ్లం కూడా వారి రాతల్ని ప్రభావితం చేసింది. ప్రకృతి ఆరాధన, మణిపూర్ ప్రాభవాన్ని కీర్తించడం నాటి కవిత్వమైంది.

భారత స్వాతంత్ర్యానంతరం చెప్పుకోదగ్గ కవి పద్మశ్రీ క్వైరక్పం చవొబసింగ్ (1895–1950) దేశాభిమానం, మానవీయ దృక్పథం, సార్వత్రిక వాదం పునరావృతమవుతూ లంబం కమల్‌సింగ్ 1899–1934 హిజం అంగం ఫుల్ సింగ్ (1892–1944)ల కవిత్వం వచ్చింది. మణిపూర్ జానపద ప్రభావంతో అంగంఫుల్ సింగో వ్రాసిన 39 వేల చరణాల "ఖంబ దోయిబి ఫైరెంగ్ మణిపూర్ జాతీయ కావ్యంగా సర్వోత్తమమైనదిగా ప్రసిద్ధి చెందింది.

అమలవుతున్న నరకానికి ఆశిస్తున్న స్వర్గానికి మధ్య గల వ్యత్యాసం, కవులు తమను తామే ప్రశ్నించుకుని తెలుసుకున్న జవాబులే కవిత్వం కావడం మొదలైంది. వాస్తవాలు, అసమ్మతి, అవిశ్వాసం, సంశయం, అర్థం కాని అనిశ్చిత ప్రపంచంలో వ్యక్తుల ఔన్నత్యం సమాజంలో కవుల వస్తువులయ్యాయి. ఈ కోవలోని పండితుడే ఎలంగ్బం నీలకాంతసింగ్ (1927–2000). హాస్యరసంతో మానవతావాదం మేళవించిన అశంగ్బం మీనాకేతన్ సింగ్ (1906–1995) దంగ్జం ఇబోపిషక్ సింగ్ (1948). తమకోసం తాము రాసుకుంటున్నట్లు కవిత్వం రాసారు. లైష్రం సమరేందర్‌సింగ్ (1925) కవిత్వం ఈ కోవలోకే వస్తుంది.

మణిపురి కవిత్వంలో ఆధునికతకు బాటలు వేసిన ఇద్దరు ముఖ్యమైన కవులలో ఒకరు ఎలాగ్జాంవ్ నీలకాంతసింగ్, మరొకరు ఎల్.సమరేంద్ర సింగ్. నీలకాంతసింగ్ వ్రాసిన 'ది లాఫ్ ఆఫ్ ఎ గర్ల్' మణిపురి భాషలో బాగా పేరు తెచ్చింది. చట్లాసిన్, కదైదానో ఇబాని తీర్థయాత్ర, పుక్నింగ్ చెప్పుకోదగ్గ కవితా సంపుటాలు. ఇతర కవులకు వస్తే, హెచ్. నబదీప్చంద్ర (1897–1946) అషంగ్బం మీనకేతన్ శింఘ్ (1906–1995) ఆర్.కె.శితల్జిత్ (1913–2008) ఆర్.కె.సురేంద్రజిత్ సింగ్ (1925–1982) ఖైరుద్దీన్ చౌధురి (1934) యుంలెంబం ఇబొంచసింగ్ (1949) మొదలైన వారు నాటి ప్రముఖ కవులు. అక్కడ కవయిత్రులు తక్కువేం కాదు. యుంలెంబం గంభిని దేవి (1945) ఆర్.కె.భుబోన్సన (1951) ఇలబంత యుమ్నం (1952) ఆరంభం ఓంగ్బి మెంచేబి (1955), రొబిన్ ఎస్.నగం గొం (1959) రఘు వైసంగ్దెం (1959) సరత్చంద్‌దియం (1961) బిరేంద్రజిత్ నవొరెం (1962) క్షేత్రిమయుం రాజేన్‌సింగ్ (1968) గంభిని సొరొక్కైబం(1971) నవొరెం బిద్యాసాగర్ (1972) సగొల్సెం లంచెంబమైపై మొదలైనవారు ఈ సాహిత్యానికి వన్నె తెచ్చారు.

ఇప్పటి వరకూ మణిపురి సాహిత్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతులు11 లభించాయి. వారు ఇతర రాష్ట్రాలవారితో పోటీ కంటే వారితో వారే పోటీపడి సమాజానికి మంచి సాహిత్యం అందిస్తున్నారు. ఒక మిత్రుడు అడిగాడు మన మాతృభాష తెలుగు సాహిత్యమే ఎవరూ పట్టించుకుని చదవడం లేదు. ఈశాన్య రాష్ట్రాల గురించి, వారి సాహిత్యం గురించి రాస్తే ఎవరు చదువుతారు అని. నిజమే ఝార్ఖండ్ ఆదివాసీ కవయిత్రి జసింత కర్కెట్ట 'ఉరావ్' భాషలో వ్యక్తం చేసిన అభిప్రాయం.

నా మాతృభాష / అమ్మ నోటిలోనే / ఖైదీ అయిపోయింది / కలల భారం కింద / మాతృభాష నలిగి పోయింది.

ఈశాన్య భారతాన్ని ప్రాంతం, జాతి, భాష మైదాన దేశంలోని సాంస్కృతిక వైవిధ్యాన్ని అర్థం చేసుకొని దాన్ని కాపాడుకోవడానికి కాశ్మీర్ నుండి కన్యాకుమారివరకూ, గుజరాత్ నుండి మణిపూర్ వరకూ భిన్న కాలాల్లో వెల్లి విరిసిన కవిత్వం దోహదపడుతుందని, ఈ దేశపు ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అని నేను నమ్ముతాను. అందుకే ఈ నా మొదటి ప్రయత్నం బ్రిటిష్ వారికి ఒక భాష, ఆ భాషలోని కొత్తదనం, గొప్పతనాన్ని తెలుసుకోవడం, ఆ విధంగా వారికి ఆ తర్వాత ఎంతగానో ఉపయోగపడింది. దాని మూలంగానే వారు భారతదేశంలోనికి సంపూర్ణంగా చొచ్చుకొని వచ్చి అన్నాళ్లు రాజ్యమేల గలిగారు. కాబట్టి ఇప్పటికైనా మనం కళ్లు తెరిచి ఆదే నేల, అదే గాలి, అదే ఆకాశం, కాని భాషల విషయంలో బేధమెందుకు 'మేరా భారత్ మహాన్'.




**డా. కాశింశెట్టి సత్యనారాయణ**
విశ్రాంత ఆచార్యుడు

**విదేశీపాలకుల నుండి విముక్తి లభించి యావత్ భారత్ సంబరాలు జరుపుకుంటుంటే దేశం నడిబొడ్డునున్న హైదరాబాద్ సంస్థానంలోని ప్రజలు మాత్రం బిక్కుబిక్కుమంటూ గడిపారు. హైదరాబాద్ సంస్థానంలో హిందువులు మెజార్టీలుగా ఉన్నా మత మౌఢ్యంతో ఊగిపోతున్న నిజాం పాలనలో కాలం వెళ్లదీస్తున్న ప్రజలకు సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ దృఢ సంకల్పంతో 1948 సెప్టెంబర్ 17న విమోచన లభించింది. పాకిస్తాన్ కుట్రలతో భారత దేశానికి గుండెకాయలా ఉన్న హైదరాబాద్‌ను ఇస్లామిక్ దేశంగా మార్చాలనే నిజాం కుతంత్రాలను 'ఆపరేషన్ పోలో'తో సర్దార్ పటేల్ ఛేదించడంతో హైదరాబాద్‌కే కాకుండా భారతదేశానికి కూడా పెనుప్రమాదం తప్పింది.**



# చరిత్రను

నిరంకుశ నిజాం పాలన నుండి విమోచన లభించినా బుజ్జగింపు ఓటు రాజకీయాలతో అధికారికంగా విమోచన దినోత్సవం జరుపుకోవడానికి ఆసక్తి చూపకపోవడం దురదృష్టకరం. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని హైదరాబాద్ సంస్థానంలో భాగమైన ప్రాంతాల్లో అధికారికంగా సెప్టెంబర్ 17వ తేదీన ఉత్సవాలు నిర్వహిస్తున్నా, నిజాం సంస్థానంలో అధిక భాగమైన తెలంగాణ ప్రాంతంలో మాత్రం దశాబ్దాలుగా ఉద్దేశపూర్వకంగా దాటవేశారు. 2022లో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అధికారికంగా 'హైదరాబాద్ విమోచన దినోత్సవం' నిర్వహించాలని నిర్ణయించింది. బుజ్జగింపులకు అలవాటు పడిన ప్రభుత్వాలు, పార్టీలు హైదరాబాద్ సంస్థానం స్వాతంత్ర్య ఉత్సవాలను ఏ పేరుతో జరుపుకోవాలనే రాజకీయాలకు తెరలేపాయి.

భారతదేశ చరిత్రలో కొన్ని తేదీలు కేవలం కాలగమనంలో మిగిలిపోయిన గుర్తులు కావు. అవి ఒక జాతి చైతన్యానికి ప్రతీకలు. ఒక తరం చేసిన పోరాటానికి గుర్తులు. ఒక దేశం తన భౌగోళిక, రాజకీయ సమైక్యతను కాపాడుకోవడానికి తీసుకున్న నిర్ణయాలకు సాక్ష్యాలు. అలాంటి చారిత్రక తేదీల్లో సెప్టెంబర్ 17 ఒకటి. 1947 ఆగస్టు 15న భారత దేశం బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యం పొందింది. కానీ భారతదేశం నడిబొడ్డున ఉన్న హైదరాబాద్ సంస్థాన ప్రజలకు మాత్రం ఆ స్వాతంత్ర్యం వెంటనే అందలేదు. నిజాం దమనకాండ కొనసాగింది. భారత యూనియన్‌లో విలీనానికి నిరాకరించింది. మరోవైపు హిందువులపై దాడులే లక్ష్యంగా రజాకార్ల హింస, ప్రజలపై అణచివేత ఎక్కువవడంతో, అదే స్థాయిలో వారిపై ప్రజల తిరుగుబాటు కూడా పెరిగిపోయింది. సర్దార్ పటేల్ నేతృత్వంలో భారత సైన్యం 1948 సెప్టెంబర్ 13న ఆపరేషన్ పోలో ప్రారంభించడం, 17న నిజాం లొంగిపోవడంతో హైదరాబాద్ భారత యూనియన్‌లో విలీనమైంది. భారత దేశానికి స్వాతంత్ర్యం లభించిన 399 రోజులకు హైదరాబాద్‌కు విమోచన లభించింది.

సెప్టెంబర్ 17ను హైదరాబాద్ విమోచన దినంగా గుర్తించడం కేవలం ఒక రాజకీయ అభిప్రాయం కాదు. అది భారతదేశ రాజకీయ ఏకీకరణలో ఒక కీలకమైన చారిత్రక ఘట్టాన్ని స్మరించుకోవడం. హైదరాబాద్ విమోచనం అంటే ఒక సంస్థానం భారతదేశంలో కలిసిన సంఘటన మాత్రమే కాదు. దేశం ఒక్కటే, జాతీయ సమైక్యత ఒక్కటే అనే భావన చారిత్రక విజయానికి ప్రతీక. 1947 ఆగస్టు 15న బ్రిటిష్ పాలన ముగిసిన అనంతరం భారతదేశంలోని సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేయడం అతిపెద్ద సవాలుగా మారింది. దేశ తొలి హోంమంత్రి పటేల్ నాటి ఉన్నతాధికారి వి.పి. మీనన్‌తో కలిసి ఈ మహత్తర ఏకీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. దేశంలో ఉన్న అనేక సంస్థానాలు చర్చలు, సంప్రదింపుల ద్వారా భారత్‌లో చేరినా, హైదరాబాద్ నిజాం ప్రభుత్వం మాత్రం మొండికేయడంతో క్లిష్టమైన సవాలుగా మారింది. భారత భూభాగం మధ్యలో విస్తరించి ఉన్న హైదరాబాద్ సంస్థానాన్ని స్వతంత్రంగా ఉంచాలని భావించిన ఏడవ నిజాం ఉస్మాన్ అలీ ఖాన్ భారత యూనియన్‌లో విలీనానికి సిద్ధపడలేదు. పాకిస్తాన్ కుట్రతో పాటు ఇస్లాం మత మౌఢ్యం కూడా తోడవడంతో నిజాం ఎదురు తిరిగాడు. దేశం మధ్యలో తమ చెప్పుచేతుల్లో ఉండే ఒక ఇస్లాం రాజ్యం ఉంటే భారత్‌ను ఇబ్బంది పెట్టవచ్చనే కుట్రలకు పాకిస్తాన్ తెరదీయగా సర్దార్ పటేల్ వేగవంతమైన నిర్ణయంతో నేడు హైదరాబాదే కాకుండా భారత్ కూడా సురక్షితంగా ఉంది. నాటి దేశ ప్రధాని నెహ్రూ నిజాం ప్రభుత్వంపై సైనిక చర్య చేపట్టేందుకు ఊగిసలాడితే, ఏడవ నిజాం పాకిస్తాన్ నుండి సైనిక సహాయం ఆశిస్తున్నట్టు పసిగట్టిన సర్దార్ పటేల్ తాత్సారం చేయకుండా సైన్యాన్ని పంపడంతో తప్పని పరిస్థితుల్లో నిజాం భారత్ ప్రభుత్వానికి లొంగిపోయారు. ప్రస్తుత కాలమాన పరిస్థితుల్లో భారత్ సరిహద్దులో ఉన్న ఇస్లాం దేశాలతో ఎదురవుతున్న పలు సమస్యలను మనం నిత్యం చూస్తున్నాం. అదే దేశం నడిబొడ్డున మరో ఇస్లాం దేశం ఉండుంటే పరిస్థితి ఊహించడానికే భయంకరంగా ఉంది.

సర్దార్ పటేల్ దీన్ని కేవలం హైదరాబాద్ సమస్యగా చూడలేదు. స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే భారతదేశం మళ్లీ అనేక రాజకీయ ముక్కలుగా విడిపోవాలా, లేక ఒక సమైక్య దేశంగా ముందుకు సాగాలా అనే ప్రశ్నకు తావివ్వకుండా భారతదేశం ఒక్కటే అనే భావనతో సైనిక చర్యకు పూనుకున్నారు.

హైదరాబాద్ సంస్థానంలో నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య హక్కులు, స్వేచ్ఛ, భారతదేశంతో విలీనం కోసం అనేక పోరాటాలు జరిగాయి. నిజాం పాలనకు వ్యతిరేకంగా రైతులు, కూలీలు, సామాన్య ప్రజలు, రచయితలు, కవులు, ఉద్యమకారులు అనేకమంది పోరాటంలో పాల్గొన్నారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడిన అమరవీరుల త్యాగం ఈ చరిత్రలో అంతర్భాగం కావడంతో హైదరాబాద్ విమోచన గాథ ప్రజల స్వేచ్ఛా ఆకాంక్షకు ప్రతిబింబంగా మారింది.

హైదరాబాద్ విమోచన చరిత్రలో రజాకార్ల పాత్రను విస్మరించలేం. నిజాంకు వెనుదన్నుగా ఉండేందుకు మజ్లిస్ ఇత్తేహాద్ ముస్లిమీన్‌ను ప్రారంభించిన ఖాసీం రిజ్వీ నేతృత్వంలో రజాకార్లు పట్టణాల్లో, గ్రామాల్లో అరాచకాలు సృష్టించి మహిళలపై అత్యాచారాలు చేశారు. రజాకార్ల దౌర్జన్యాలను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని నిర్ణయానికొచ్చిన పటేల్ హైదరాబాద్ సమస్య పరిష్కారంలో పోషించిన పాత్రను చరిత్ర ఎప్పటికీ మరచిపోలేదు.

అయితే, ఇంతటి కీలకమైన చారిత్రక ఘట్టం దశాబ్దాల పాటు ఎందుకు పెద్దగా జాతీయ గుర్తింపును పొందలేదు అనే ప్రశ్న కూడా సహజంగానే తలెత్తుతుంది. సెప్టెంబర్ 17ను 'విమోచన దినం'గా పిలవాలా, 'విలీన దినం'గా పిలవాలా? 'జాతీయ సమైక్యతా దినం'గా పిలవాలా? 'ప్రజాపాలన దినం'గా పిలవాలా? అనే చర్చలు చాలాకాలంగా కొనసాగుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలకు తగిన గుర్తింపు దక్కడం లేదని ఉద్యమించిన సంఘాలు, పార్టీలు మలిదశ తెలంగాణ




# మళ్లీ చదవాల్సిన రోజు

ఉద్యమంలో సెప్టెంబర్ 17వ తేదీని కూడా ఒక అంశంగా చేసుకున్నాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దీన్ని తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కంటితుడుపుగా 'జాతీయ సమైక్యతా దినోత్సవం'గా ప్రకటించింది. ముస్లిం మైనార్టీల ఓట్లు దూరమవుతాయనే భయంతో, ఎంఐఎం ఒత్తిడితో బీఆర్ఎస్ నేతలు సెప్టెంబర్ 17వ తేదీని పార్టీ కార్యాలయంలో జరుపుకునేవారు. 2023లో తెలంగాణలో అధికారంలోకి వచ్చాక రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సెప్టెంబర్ 17ను 'ప్రజా పాలన దినోత్సవం'గా ప్రకటించింది. ఇక వామపక్షాలు, సంఘాలు దీన్ని 'విలీన దినోత్సవం'గా జరుపుకుంటాయి. బీజేపీ మాత్రం నిజాం నిరాంకుశ పాలన నుండి ప్రజలకు విముక్తి లభించిందనే లక్ష్యంతో 'విమోచన దినోత్సవం'గా జరుపుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం కూడా దీన్నే అనుసరించాలని డిమాండ్ చేస్తోంది.

హైదరాబాద్ సంస్థానంలో ప్రజలకు నిజాం పాలకుల నుండి స్వాతంత్ర్యం లభించిన తర్వాత ఉత్సవాలు నిర్వహించుకోవడంలో వెనకడుగు వేయడం వెనుక బుజ్జగింపు రాజకీయాలే కాకుండా పిరికితనం కూడా కనిపిస్తోంది. దీన్ని ఒక మత కోణంలో చూడడమే దుర్మార్గం. నిజాం నిరంకుశత్వం పాలన నుండి కేవలం హిందువులకే కాదు ముస్లింలకు కూడా ముక్తి లభించింది. అయితే నిజాం మత పిచ్చితో హిందువులను హింసించారనేది సత్యం. నిజాం పానలలో మత పిచ్చే కాకుండా విపరీతమైన నిరంకుశత్వం కొనసాగింది. ప్రజాస్వామ్య హక్కులు లేకపోవడం, భూస్వామ్య, జాగీర్ధారి వ్యవస్థ, వెట్టి చాకిరీ , రైతులపై ఆర్థిక రెవెన్యూ భారాలు, విద్యా రంగంలో వెనుకబాటు, భావ వ్యక్తీకరణపై ఆంక్షలు ఇలా నిజాం పాలనలో నిరంకుశం, ఆంక్షాలు కొనసాగాయి. ఇలాంటి ఇబ్బందులు హిందువులతో పాటు ముస్లింలు కూడా ఎదుర్కొన్నారు. అలాంటిది దీన్ని కేవలం మత కోణంలో చూస్తూ 'విమోచన దినోత్సవం' జరుపుకోవడానికి భయపడడం దురదృష్టకరం.

నిజాం పాలనలో అన్ని సామాజిక వర్గాలు ఇబ్బందులు పడితే దాన్ని హిందూ, ముస్లిం విభజనతో రజాకార్ల వారసులైన ఎంఐఎం స్వాతంత్ర్యం అనంతరం కూడా అదే పంతాలను కొనసాగిస్తూ ఈ అంశాన్ని ముస్లింల ఓటు బ్యాంకుగా మల్చుకుంది. మన రాజకీయాల పార్టీలు కూడా అదే పంథాను కొనసాగిస్తూ విమోచన దినోత్సవం పేర్ల వెనుక ఉన్న రాజకీయాలు చేస్తున్నాయి. 1948 సెప్టెంబర్ 17న భారత త్రివర్ణ పతాకం హుందాగా హైదరాబాద్ నేలపై ఎగిరింది. ప్రజలు గర్వంగా వందేమాతరం ఆలపించారు. ప్రజల విముక్తి భారత జాతీయ సమైక్యతతోనే సంపూర్ణమైంది. అందువల్ల ప్రజల పోరాటాన్ని, భారత జాతీయ సమైక్యతను పరస్పరం వేరు చేయడం చారిత్రకంగా అసంపూర్ణ మైన దృక్పథం. విలీనానికి ముందు ఉన్న పరిస్థితిని కుహనా సెక్యులరిస్టులు స్పష్టంగా చెప్పకపోవడం వారి బుజ్జగింపు రాజకీయాలకు నిదర్శనం. 'సమైక్యత' అనకుండా, ఆ సమైక్యతకు దారితీసిన 'విమోచన' ప్రక్రియను వారు గుర్తుంచుకోవాలి. ఇక్కడ సైనిక చర్య జరిగింది కాబట్టి నిజాం పాలన నుండి విమోచనం లభించిదనడమే న్యాయమైంది. 'విమోచన' అనే పదం ఆ రోజు వరకు కొనసాగిన నిరంకుశ పాలన నుంచి ప్రజలకు వచ్చిన స్వేచ్ఛను ప్రత్యేకంగా గుర్తుచేస్తుంది.

హైదరాబాద్ విమోచనం పోరాటం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగింది. విమోచనం ప్రజాస్వామ్యం కోసం జరిగింది. భారతదేశంలో విలీనం అంటే అందరికీ సమాన రాజ్యాంగ హక్కులు కలిగిన దేశంలో చేరడం. నిజాం ప్రభుత్వంపై చర్యలు తీసుకుంటే ముస్లిం మైనార్టీలకు తప్పుడు సందేశం వెళ్తుందని, అంతర్జాతీయంగా ఇబ్బందులు వస్తాయని నాటి ప్రధాని జంకినా సర్దార్ పటేల్ ముందడుగు వేశారు. విశాలమైన దృక్పథంతో హైదరాబాద్‌కు పటేల్ స్వతంత్ర్యం కల్పించారనే సందేశాన్ని ముందుకు తీసుకెళ్లాలి.

నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. 2022లో కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను ప్రతి సంవత్సరం 'హైదరాబాద్ విమోచన దినం'గా అధికారికంగా నిర్వహించాలని ప్రకటించింది. దీనిని ఒక రాజకీయ కార్యక్రమంగా కాకుండా చరిత్రలో తగిన గుర్తింపు పొందాల్సిన ఒక అధ్యాయానికి జాతీయ స్థాయి గుర్తింపుగా చూడాలి. 1948లో హైదరాబాద్ సంస్థానంలో నేటి తెలంగాణతో పాటు మహారాష్ట్ర లోని మరాఠ్వాడా, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలు కూడా ఉన్నాయి. అందువల్ల సెప్టెంబర్ 17 కేవలం తెలంగాణ చరిత్రకు పరిమితమైన రోజు కాదు. ఇది డెక్కన్ ప్రాంతాన్ని భారత జాతీయ స్రవంతిలో మరింత బలంగా కలిపిన రోజు. అందుకే దీనికి 'హైదరాబాద్ విమోచన దినం' అనే జాతీయ గుర్తింపు ఇవ్వడం ప్రాంతీయ భావజాలాన్ని బలహీనపరచడం కాదు. దానికి విరుద్ధంగా, తెలంగాణ చరిత్రను భారతదేశపు విస్తృత జాతీయ చరిత్రలో స్థిరపరచడం. నేటి యువతకు సెప్టెంబర్ 17 గురించి ఎంత తెలుసు అనే ప్రశ్న వేసుకోవాలి.

సెప్టెంబర్ 17 అంటే నిజాం నిరంకుశ పాలన నుంచి ప్రజలకు విముక్తి లభించిన రోజు. భారత త్రివర్ణ పతాకం హైదరాబాద్ గడ్డపై గర్వంగా ఎగిరిన రోజు. భారతదేశ రాజకీయ సమైక్యత మరింత బలపడిన రోజు. సర్దార్ పటేల్ జాతీయ సంకల్పం విజయవంతమైన రోజు. అమరవీరుల త్యాగాలను స్మరించు కోవాల్సిన రోజు. అందుకే సెప్టెంబర్ 17 విమోచనను గుర్తుచేసే రోజు మాత్రమే కాదు. జాతీయ సమైక్యతను పునరుద్ఘాటించే రోజు. చరిత్రను మరచిపోకుండా, చరిత్రను వక్రీకరించకుండా, చరిత్రలోని జాతీయ స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించడమే హైదరాబాద్ విమోచన దినానికి నిజమైన నివాళి. దేశం ఒక్కటే.. జాతీయ గౌరవం ఒక్కటే.. త్రివర్ణ పతాకం ఒక్కటే.. భారతదేశమే మనందరి సామూహిక అస్తిత్వం అనే భావనను మరింత బలపరచడమే సెప్టెంబర్ 17 మనకు అందించే గొప్ప సందేశం.

– శ్రీపాద




# ఐకమత్యం

సేవ, సాంఘిక సామరస్యం, స్వదేశీ, పౌర క్రమశిక్షణ, భిన్నత్వంలో ఏకత్వం వంటి వాటిలో వేళ్లూనుకున్న ఒక వ్యవస్థీకృత, ఐక్య సమాజానికి ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ పిలుపునిచ్చారు. సమకాలీన విలువలకు అనుగుణంగా తమను తాము మలచుకుని, సమాజాన్ని ముందుకు నడిపించాలని యువతరాన్ని కోరారు. సెప్టెంబర్ 6న లండన్‌లో జరిగిన 'సెలబ్రేషన్ ఆఫ్ వన్‌నెస్' (ఏకత్వ వేడుక) కార్యక్రమంలో ప్రసంగిస్తూ హిందూ భావజాలం కేవలం వ్యక్తికి మాత్రమే పరిమితం కాదని, అది సమాజం, మానవాళి, ప్రకృతిని కూడా కలుపుకొని ఉంటుందని అన్నారు. "హిందువులు ప్రకృతిని కేవలం ఆరాధించడమే కాదు, దానిని ప్రేమిస్తారు కూడా" అని తెలిపారు. ఈ ప్రేమే ఐక్యతకు, వ్యక్తిత్వ, గుణగణాల పరమైన పురోగతికి మూలాధారమని చెప్పారు. సంఘ కార్యకలాపాలు కొనసాగడానికి ఈ సూత్రమే పునాదిగా నిలిచిందని తెలిపారు. వందేళ్ల తర్వాత కూడా ఆ సంస్థ వాతావరణంలోనూ, సభ్యుల ప్రవర్తనలోనూ అదే సూత్రాన్ని చూడవచ్చని పేర్కొన్నారు.

ప్రస్తుత అశాంతియుత కాలంలో ప్రపంచానికి అత్యవసరమైన అంశాలను హిందూ నాగరికత ఏ విధంగా అందిస్తుందన్న ప్రశ్నకు సమాధానంగా, వైవిధ్యమే ఉనికి సహజ స్వభావమని డాక్టర్ భాగవత్ పేర్కొన్నారు. హిందూ దృక్పథం, వైవిధ్యాన్ని అంగీకరిస్తుందని ఆయన చెప్పారు. "ఒక్కటే అనేకం అయ్యింది, అందుకే భిన్న దృక్పథాలు ఏర్పడ్డాయి" అని తెలిపారు. ప్రజలు తమ ఆచరణాత్మక జీవితంలో వైవిధ్యాన్ని ఎదుర్కోవాల్సి ఉన్నప్పటికీ, వివిధ రూపాలను వేర్వేరుగా భావించకూడదని సూచించారు. "మనం ఒక్కటే, అంతా ఒక్కటే; ఈ ప్రాతిపదికనే మేము ప్రతి విషయాన్నీ పరిగణిస్తాము" అని అన్నారు. ఈ విధానం సంఘర్షణల పరిష్కారానికి కూడా ఒక పునాదిని అందిస్తుందని చెప్పారు. శత్రుభావం లేదా పోటీకి బదులుగా "అందరికీ ప్రయోజనకరమైన పరిష్కారం" (win-win solution) గురించి ఆలోచించినప్పుడు సంఘర్షణలను మరింత సులభంగా పరిష్కరించు కోవచ్చు. ఒకరి నష్టంతో మరొకరు లాభపడాలని ఆలోచించే బదులు, ఇరుపక్షాల అవసరాలు ఏమిటో పరిగణించి, ఇద్దరి పురోగతికి కృషి చేయాలని తెలిపారు. మానవులు కూడా ప్రకృతిలో భాగమే కాబట్టి, మానవాళి ప్రకృతిని జయించాలని చూడకూడదని అన్నారు. అందువల్ల, మానవ పురోగతి ప్రకృతి పురోగతికి దోహదపడాలని తెలిపారు. "అభివృద్ధి, పురోగతి ఎందుకు ఒకదాని కొకటి విరుద్ధంగా ఉండాలి? అవి ఒకదానికొకటి పూరకంగానే ఉండాలి" అని అన్నారు. ప్రస్తుతం "హరిత పరిష్కారాలు"గా పిలవబడేవి, మానవ అవసరాలకు పరిష్కారాలను అందించడంతో పాటు ప్రకృతిని కూడా పరిరక్షించడానికి ప్రయత్నిస్తాయని తెలిపారు. "బతకండి, బతకనివ్వండి" అనే సూత్రం కాకుండా, "బతకనివ్వండి, ఇతరులను బతికించండి" అనే సూత్రం ఉండాలని అన్నారు. వ్యక్తి, సమాజం, మానవాళి, ప్రకృతి కలిసి పురోగమించగల ఒక చట్రాన్ని హిందూ తత్వం అందిస్తుందని తెలిపారు. ఆధునిక ఆలోచనా విధానాలు వ్యక్తిగత హక్కులకు, సమాజ ప్రయోజనాలకు మధ్య విభజనను సృష్టి స్తాయని అన్నారు. 'హిందూ రాష్ట్రం', 'హిందుత్వం' అంశాలపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ దీనికి సంబంధించిన మూల సందేశం "మనం జీవిద్దాం, ఇతరులను జీవించనిద్దాం" అని చెప్పారు. ప్రజలు ఇతరులతో మమేకమై, అందరూ కలిసి జీవించేలా చేయగలరని అన్నారు. "హిందూ" అనే పదం అర్థాన్ని వివరిస్తూ, దీనిని కేవలం ఒక నిర్దిష్ట మతపరమైన ఆచారం లేదా జీవనశైలి ఆధారంగా మాత్రమే అర్థం చేసుకోలేమని చెప్పారు. వైవిధ్యాన్ని అంగీకరించి, గౌరవించే సమాజ స్వభావమే 'హిందూ' అని తెలిపారు. ఎందుకంటే విభిన్న మార్గాలు ఒకే లక్ష్యా నికి దారితీస్తాయని అది విశ్వసిస్తుందని చెప్పారు.

విభిన్న అభిరుచులు వేర్వేరు మార్గాలకు దారితీసినప్పటికీ, అంతిమంగా గమ్యం ఒక్కటేనని తెలిపే 'శివ మహిమ స్తోత్రం'లోని ప్రసిద్ధ శ్లోకాన్ని ఆయన ప్రస్తావించారు. వైవిధ్యం సహజమని, సమాజాన్ని ఏకరూపంగా మార్చాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. "ఐక్యతకు ఏకరూపత అవసరం లేదు. వైవిధ్యంలోనే ఐక్యత ఉంటుంది," అని పేర్కొన్నారు. అంతర్లీనంగా ఉన్న ఐక్యతలోనే వైవిధ్యం ఇమిడి ఉంటుందని తెలిపారు. కాబట్టి, ప్రజలు ఆ ఐక్యతను గుర్తించినప్పుడు, వైవిధ్యాన్ని గౌరవించగలరు, అంగీకరించగలరు అని చెప్పారు. "ఆ ఆలోచనే హిందూ ఆలోచన. అటువంటి స్వభావమే హిందూ స్వభావం. అదే హిందూ సమాజం, భారత్ ఇతిహాసం" అని డాక్టర్ భాగవత్ అన్నారు. భారతదేశంలో నాస్తికత్వం మొదలుకొని బహుదేవతారాధన వరకు అనేక రకాలైన ఆలోచనా విధానాలు ఉద్భవించాయని, అదే సమయంలో



# సాధిద్దాం

ప్రజలు వేర్వేరు మార్గాలను అనుసరించవచ్చనే దృక్పథాన్ని భారత్ కలిగి ఉందని ఆయన పేర్కొన్నారు. "మనం ఒకరినొకరు మతం మార్చుకోవాల్సిన అవసరం లేదు. 'మేము మాత్రమే సరైనవాళ్లం' అనేది కాదు; 'మేము సరైనవారమే, మీరు కూడా సరైనవారే' అని భావించడమే హిందూ దృక్పథం," అని అన్నారు. ఈ దృక్పథాన్ని ఒక నిర్దిష్ట వర్గం, ఆరాధనా విధానం, ఆహారపు అలవాట్లు లేదా జీవనశైలికి మాత్రమే పరిమితం చేయలేమని చెప్పారు. ఒక వ్యక్తి తన సొంత మార్గం పట్ల విశ్వాసం, నిబద్ధత కలిగి ఉంటూనే, మరొకరి మార్గం కూడా వారికి సరైనదేనని గుర్తించవచ్చు. "మనం కలిసి ముందుకు సాగవచ్చు. కలిసి పని చేయవచ్చు. కలిసి జీవించవచ్చు. మనం కలిసి జీవించాలి. అదే సత్యం" అని అన్నారు. 'రాష్ట్రం' భావనను వివరిస్తూ, 'నేషన్' (nation) అనే పదాన్ని 'రాష్ట్రం'కు ప్రత్యక్ష అనువాదంగా భావించకూడదని చెప్పారు. ఎందుకంటే ఆ రెండూ వేర్వేరు భావనలను సూచిస్తాయి. భాష, పాలనా విధానం లేదా మతం వంటి అంశాలలో ఉన్న సారూప్యతల ఆధారంగా ప్రజలు ఏకమై, తమ ఉమ్మడి శ్రేయస్సు కోసం నియమాలు వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నప్పుడు ఒక 'దేశం–రాజ్యం' (nation-state) ఏర్పడుతుందని ఆయన అన్నారు. 'రాష్ట్రం' (Rashtra) భావన భిన్నమైనది, ఎందుకంటే ఇందులో 'రాజ్యం' (state) అనేది ప్రాథమిక అంశం కాదు. హిందూ రాష్ట్ర ఉద్దేశ్యాన్ని వివరిస్తూ, వైవిధ్యం అనేది సహజమైనదని, అంతర్లీన వాస్తవికత ఐక్యత అని చెప్పే సత్యాన్ని ప్రపంచంతో పంచుకోవడమే దీని లక్ష్యమని డాక్టర్ భాగవత్ అన్నారు. ఈ సూత్రం మానవాళికి ఎంతో ప్రయోజనకరమని చెప్పారు. ఎందుకంటే ఆత్మ సాక్షాత్కారం శాశ్వత ఆనందానికి, అస్తిత్వ ఐక్యతను అనుభవించడానికి దారితీస్తుంది. భారతీయ రుషులు ఈ సూత్రాన్ని గుర్తించారని, దీనిని ప్రపంచంతో పంచుకోవాలని ఆకాంక్షించారని తెలిపారు. ఇది కేవలం ఒక వ్యక్తి లేదా ఒక చిన్న వర్గం చేయగలిగే పని కాదని, ఈ బృహత్తర కార్యం కోసం యావత్ దేశాన్ని సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కఠినమైన తపస్సు ఆచరించి, తమ కృషి ద్వారా దేశ శక్తిని పెంపొందించిన లోక హితైషులు, సదుద్దేశ్యం కలిగిన వ్యక్తులుగా రుషులను అభివర్ణించారు. 'రాష్ట్రం' (జాతి) భావన ప్రారంభ దశలో ప్రత్యేకమైన 'రాజ్యం' (ప్రభుత్వ వ్యవస్థ) అవసరం ఉండేది కాదని, ఎందుకంటే సమాజమే తన సభ్యులను రక్షించి, వారికి అండగా నిలిచేదని తెలిపారు. అయితే, పరిస్థితులు మారడంతో రాజ్యం, పాలకుడి ఆవశ్యకత ఏర్పడింది. ఒకే లక్ష్యాన్ని పంచుకునే ప్రజలు సమాజంగా ఏర్పడతారని, వారు ఒక నిర్దిష్ట భూభాగంతో అనుసంధానమైనప్పుడు జనపదంగా మారుతారని చెప్పారు. ఇందులో భూమి అనేది ఒక కీలకమైన అంశమని, ఇతర అంశాలు కాలక్రమేణా మారవచ్చని చెప్పారు. "మనం ఎల్లప్పుడూ ఒక జాతిగానే ఉంటూ వచ్చాము" అని తెలిపారు. భారత్ అనేక రకాల రాజకీయ వ్యవస్థలను, పాలనా విధానాలను చూసిందని చెప్పారు. వివిధకాలాల్లో భారత్‌లో చక్రవర్తి సమ్రాట్ పాలన, గణరాజ్యాలు, విదేశీ పాలన వంటి దశలు ఉన్నాయని గుర్తుచేశారు. మరికొన్ని సమయాల్లో ప్రజలు స్వాతంత్ర్యం కోసం పోరాటాలలో నిమగ్నమయ్యారు. "పరిస్థితులు మారాయి. కాబట్టి జనపదం, భూమి కలయికే 'రాష్ట్రం' (జాతి)," అని అన్నారు. ఇతర దేశాల ప్రజలు తమ సొంత సమాజాల లక్ష్యాలను నెరవేర్చుకునే మార్గాలను కనుగొనడానికి స్ఫూర్తినిచ్చేలా జీవించడమే 'రాష్ట్ర' ఉద్దేశ్యమని చెప్పారు. భారత్ తన జీవన విధానం ద్వారా ఇతర దేశాల ప్రజలకు ఒక ఆదర్శంగా నిలవాలని, తద్వారా వారు తమ దేశాల లక్ష్యాలను నెరవేర్చుకుంటూనే తమ జీవితాలను ఎలా గడపాలో తెలుసుకునేలా ప్రేరణ పొందాలని అన్నారు. "'రాష్ట్రం' అంటే మేము భావించేది ఇదే" అని తెలిపారు. జాతీయవాదానికి సంబంధించిన చారిత్రక అనుభవాల కారణంగా ప్రపంచవ్యాప్తంగా 'దేశం' (nationhood) అనే భావన పట్ల కొంత ఆందోళన ఉన్నప్పటికీ, 'రాష్ట్రం' అనే నాగరికతాపరమైన భావనను దాని ప్రత్యేక సందర్భంలోనే అర్థం చేసుకోవాలని అన్నారు. భవిష్యత్ తరాల పట్ల, ప్రపంచాన్ని మెరుగైన ప్రదేశంగా తీర్చిదిద్దడంలో వారి సామర్థ్యం పట్ల తనకు పూర్తి విశ్వాసం ఉందని చెప్పారు. ఈ లక్ష్యం కోసం అన్ని రకాల చిన్నపాటి విభేదాలను పక్కనపెట్టడానికి వారు సిద్ధంగా ఉన్నారు అని అన్నారు. యువత నిజాయతీగా ఉంటారని, ఏదైనా సరైనదని భావించినప్పుడు దానిని ఆచరించడానికి సిద్ధంగా ఉంటారని తెలిపారు. వయసు పెరిగేకొద్దీ ప్రజలకు అనుభవం వస్తుందని, తద్వారా తమ చర్యల వల్ల కలిగే పరిణామాల పట్ల వారు మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తారని తెలిపారు. యువతపై నిర్దిష్ట పద్ధతులను రుద్దకుండా, వారికి స్పష్టమైన లక్ష్యాన్ని, అనుభవం ద్వారా లభించిన అవసరమైన సమాచారాన్ని అందించడమే పెద్దల బాధ్యత అని ఆయన అన్నారు. "లక్ష్యాన్ని నిర్దేశించండి, పద్ధతిని కాదు. ఆ పనిని వారినే చేయనివ్వండి" అని డాక్టర్ భాగవత్ తెలిపారు. అంతేకాకుండా, మునుపటి తరాల కంటే యువత తాము ఆశించిన లక్ష్యాలను మరింత వేగంగా, మరింత ప్రయోజనకరమైన రీతిలో సాధించగలరని అన్నారు. బ్రిటన్, భారత్ ప్రయోజనాల మధ్య ఎప్పుడైనా విభేదాలు తలెత్తితే బ్రిటన్ లోని హిందువుల బాధ్యత ఏమిటన్న ప్రశ్నకు సమాధానమిస్తూ, సాధారణంగా బ్రిటన్ –భారత్ ప్రయోజనాల మధ్య ఎటువంటి సంఘర్షణ ఉండకూడదని అన్నారు. "బ్రిటన్‌లోని హిందువులు, మంచి హిందువులుగా ఉంటే, బ్రిటన్– భారత్ ప్రయోజనాల మధ్య ఎప్పటికీ సంఘర్షణ ఉండదు," అని చెప్పారు. ఒకవేళ అటువంటి పరిస్థితి తలెత్తితే, బ్రిటన్‌లోని హిందువులు సహజంగానే తమ 'కర్మభూమి' అయిన బ్రిటన్ పక్షాన నిలబడతారని

"పరిస్థితులు మారాయి. కాబట్టి జనపదం, భూమి కలయికే 'రాష్ట్రం' (జాతి)," అని అన్నారు. ఇతర దేశాల ప్రజలు తమ సొంత సమాజాల లక్ష్యాలను నెరవేర్చుకునే మార్గాలను కనుగొనడానికి స్ఫూర్తినిచ్చేలా జీవించడమే 'రాష్ట్ర' ఉద్దేశ్యమని చెప్పారు. భారత్ తన జీవన విధానం ద్వారా ఇతర దేశాల ప్రజలకు ఒక ఆదర్శంగా నిలవాలని, తద్వారా వారు తమ దేశాల లక్ష్యాలను నెరవేర్చుకుంటూనే తమ జీవితాలను ఎలా గడపాలో తెలుసుకునేలా ప్రేరణ పొందాలని అన్నారు.



అన్నారు. ఒక వ్యక్తి నివసించే, తన విధేయతను కలిగి ఉండే ప్రాంతాన్ని 'కర్మభూమి' అని, పుట్టిన లేదా మూలాలు ఉన్న ప్రాంతాన్ని 'జన్మభూమి' అని పిలుస్తారని వివరించారు. "హిందుత్వం ఎప్పుడూ కూడా మీ కర్మభూమికి ద్రోహం చేయమని చెప్పదు. మీరు అక్కడ నివసిస్తున్నారు, అక్కడ సంపాదిస్తున్నారు, కాబట్టి మీరు దానికి తగినట్లుగా నడుచుకోవాలి" అని అన్నారు. తమ జన్మభూమి నుండి పొందిన విలువలను ప్రజలు తమ కర్మభూమిలో సంపూర్ణంగా, సరైన రీతిలో ఆచరించాలని, తద్వారా మానవాళికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు (ముఖ్యంగా యూకే, కామన్వెల్త్ దేశాల్లోని యువత) 'వసుధైవ కుటుంబకం', సేవాభావం, 'భిన్నత్వంలో ఏకత్వం' వంటి విలువలను ఆచరణాత్మకమైన ఆర్థిక, సామాజిక మానవతా భాగస్వామ్యాలుగా ఎలా మలచుకోవాలనే ప్రశ్నకు సమాధానమిస్తూ, డాక్టర్ భాగవత్ అటువంటి విధానం ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే ఆవిర్భ వించిందని అన్నారు. ప్రపంచం ఇప్పటికే "గ్లోబల్" (ప్రపంచవ్యాప్త), "వన్ వరల్డ్" (ఏక ప్రపంచం) వంటి భావనలను వినియోగించడం ప్రారంభించిందని, అనేక కార్యక్రమాలు ఆ దిశగా సాగుతున్నాయని ఆయన అన్నారు. విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు (ముఖ్యంగా యూకే, కామన్వెల్త్ దేశాల్లోని యువత) 'వసుధైవ కుటుంబకం', సేవాభావం, 'వైవిధ్యంలో ఏకత్వం' వంటి విలువలను ఆచరణాత్మక ఆర్థిక, సామాజిక, మానవతా భాగస్వామ్యాలుగా ఎలా మలచుకోవాలనే ప్రశ్నకు సమాధానమిస్తూ, అటువంటి విధానం ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే ఆవిర్భవించిందని డాక్టర్ భాగవత్ అన్నారు. ప్రపంచం ఇప్పటికే "గ్లోబల్" (ప్రపంచవ్యాప్త), "వన్ వరల్డ్" (ఏక ప్రపంచం) వంటి భావనలను వినియోగించడం ప్రారంభించిందని, అనేక కార్యక్రమాలు ఆ దిశగా సాగుతున్నాయని తెలిపారు. విదేశాల్లో స్థిరపడిన భారతీయులు తమ 'కర్మభూమి' (తాము జీవిస్తున్న దేశం) పట్ల నిజాయతీగా ఉంటూనే, ఆ దేశానికి, మానవాళికి సేవ చేయడానికి తమను తాము బలోపేతం చేసుకోవచ్చని చెప్పారు. "బ్రిటన్ పట్ల విధేయతతో ఉంటూనే, భారత్‌కు సేవ చేయడానికి మీకు అదనపు వనరులు ,సమయం ఉంటే, అలా చేయకుండా మిమ్మల్ని ఎవరూ అడ్డుకోరు" అని అన్నారు. "ప్రపంచ స్థాయిలో ఆలోచించడం – స్థానిక స్థాయిలో పనిచేయడం (think globally, act locally) అనే సమకాలీన విధానాన్ని ప్రస్తావిస్తూ, ప్రజలు తాము నివసిస్తున్న దేశం పట్ల విశ్వాసంతో ఉంటూనే ప్రపంచ స్థాయి సేవా కార్యక్రమాలకు తమవంతు సహకారం అందించవచ్చని తెలిపారు.

ఆర్ఎస్ఎస్ పనిచేయని రంగం దాదాపు ఏదీ లేదని ఆయన అన్నారు. ఆర్ఎస్ఎస్ ఎటువంటి బ్యానర్లు లేదా క్రెడిట్ (కీర్తి) కోసం పాకులాడకుండా, అందరితో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తుందని చెప్పారు. దేశవ్యాప్తంగా, "ఈశాన్యం నుండి పడమర వరకు", "కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు" స్వయంసేవకులు సమాజం కోసం పనిచేస్తున్నారని తెలిపారు. సంఘం రాబోయే 100 ఏళ్ల గురించి మాట్లాడుతూ, సమాజాన్ని ఏకం చేసే పనిని పూర్తి చేయడానికి అంత ఎక్కువ సమయం పట్టకూడదన్నదే తన మనసులో మెదిలిన మొదటి ఆలోచన అని చెప్పారు. సమాజాన్ని సంఘటితం చేయడం అంటే సమాజ శక్తిని ఏకం చేయడమేనని తెలిపారు. సమాజంలో విస్తృత ఆదరణను పొంది ఉండటం వల్ల, అటువంటి వాతావరణాన్ని సృష్టించడంలో సహాయపడే స్థితిలో ప్రస్తుతం ఆర్ఎస్ఎస్ ఉందని చెప్పారు. "మమ్మల్ని వ్యతిరేకించే వారికి కూడా సంఘం విలువ, సంఘ ఉపయోగం తెలుసు" అని తెలిపారు. అవసరమైనప్పుడు ఆర్ఎస్ఎస్ సేవలను కోరడానికి లేదా కీలకమైన విషయాలలో సహకరించ డానికి వారు వెనుకాడరని, ఆ ఆదరణ లభిస్తోందని డాక్టర్ భాగవత్ చెప్పారు. గ్రామాభివృద్ధి గురించి మాట్లాడుతూ దీని పట్ల అందరికీ శ్రద్ధ ఉందని, అక్కడ వ్యతిరేకత కంటే సహకారమే ఎక్కువగా కనిపిస్తుందని అన్నారు. అదేవిధంగా, భారతదేశంలో గోరక్షణ గురించి ప్రస్తావిస్తూ, అన్ని మతాల ప్రజలు దీనిని అంగీకరించారని అటువంటి ప్రయత్నాలలో ఎవరైనా పాల్గొనవచ్చని తెలిపారు. సమాజం కోసం నిజాయతీగా, నిస్వార్థంగా పనిచేసే వారు ఎవరైనా సరే, ఒకవేళ వారికి ఆర్ఎస్ఎస్ గురించి తెలియక పోయినప్పటికీ, వారిని సంస్థ సహకారులు గానే పరిగణిస్తుందని చెప్పారు. "సమాజం మొత్తాన్ని ఏకం చేయడమే మా ఆలోచన," అని అన్నారు. అయితే, సమాజంలోని ప్రతి ఒక్కరూ 'శాఖ' (ఆర్ ఎస్ఎస్ శిక్షణా కేంద్రం) మైదానానికి రావాల్సిన అవసరం లేదని తెలిపారు. అయినప్పటికీ, ఒకరినొకరు పక్కకు నెట్టేయకుండా అందరూ కలిసి ఒకే మార్గంలో పయనించవచ్చని చెప్పారు. "మేము చేతులు కలిపి, కలిసికట్టుగా ముందుకు సాగుతాము. వ్యవస్థీకృత సమాజం పట్ల మాకున్న భావన ఇదే" అని ఆర్ఎస్ఎస్ సర్‌సంఘచాలక్ అన్నారు. అటువంటి వ్యవస్థీకృత సమాజాన్ని నిర్మించడం అనేది ప్రగతిలో తదుపరి దశ అని, దీనికి మరో 100 ఏళ్లు పట్ట కూడదని అన్నారు. 'సెలబ్రేషన్ ఆఫ్ వన్‌నెస్' (ఏకత్వ వేడుక) కార్యక్రమంలో 326 సంస్థలకు చెందిన 600 మంది పాల్గొన్నారు. హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యులు, హౌస్ ఆఫ్ కామన్స్ ఎంపీలు, మేయర్లు, కౌన్సిలర్లు, సామాజికవేత్తలు ఈ కార్యక్రమంలో హాజరైన వారిలో ఉన్నారు.







**నంద్యాల:** కుటుంబ ఆరోగ్యం, ఆహారపు అలవాట్లు నియంత్రించడంలో ప్రధాన పాత్ర మహిళలదే అని మితంగా తింటే అమృతం–అమితంగా తింటే విషం అని వక్తలు అన్నారు. నంద్యాల జిల్లా స్థానిక క్రాంతినగర్ రామాలయంలో సెప్టెంబర్ 2న ఆరోగ్య భారతి కార్యకర్తల సమ్మేళనం జరిగింది. ఆరోగ్యభారతి జాతీయ సంఘటనా కార్యదర్శి అశోక్ కుమార్ వార్స్‌నేయ, క్షేత్ర సంఘటనా కార్యదర్శి కుమార స్వామి, వక్త అశోక్‌కుమార్ వార్షనేయ పాల్గొన్నారు.

నంద్యాల జిల్లా ఆరోగ్యభారతి అధ్యక్షులు డాక్టర్ పరమేశ్వర్ రెడ్డి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, యస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల అధినేత శనివారపు దినేష్ రెడ్డి, క్రాంతి నగర్ రామాలయం చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, డాక్టర్ రామశర్మ, ఆరోగ్య కార్యకర్తలైన ఉమాదేవి, విజయభాస్కర్ రెడ్డి, రామ కృష్ణారెడ్డి, పుల్లయ్య, చెన్న కేశవులు తదితరులతోపాటు 120 మంది మహిళలు, 90 మంది పురుషులు పాల్గొన్నారు.

**భాగ్యనగర్:** ఆరోగ్య భారతి జాతీయ సంఘటనా కార్యదర్శి అశోక్‌కుమార్, క్షేత్ర సంఘటనా మంత్రి కుమారస్వామి పర్యటన సందర్భంగా ఆరోగ్య వ్యక్తి, ఆరోగ్య కుటుంబం అనే అంశంపై కుటుంబాల ఆత్మీయ సమావేశములు కూకటిపల్లి ప్రగతినగర్, వనస్థలిపురం, భాగ్ లింగంపల్లిలో జరిగాయి.










**ములుగు:** సెప్టెంబర్ 3న ధర్మజాగరణ ఆధ్వర్యంలో జరిగిన బాలకోకుల సమ్మేళనంలో ప్రసంగిస్తున్న వరంగల్ విభాగ్ ప్రచారక్ విఘ్నేష్. 15 పాఠశాల నుంచి కృష్ణుని వేషధారణలో చిన్నారులు పాల్గొన్నారు. ఈ బాల గోకుల సమ్మేళనం గత 26 సంవత్సరాలుగా జరుగుతుంది.



# పంజాబ్ యూనివర్సిటీలో ఎబివిపి హవా

దేశ రాజధానిలో నానా రచ్చా చేసి వార్తలలోకెక్కిన కాక్రోచ్ జనతా పార్టీ వెంటే యువత అంతా నడుస్తోందనుకునే వారికి కళ్లు తెరిపించేలా పంజాబ్ యూనివర్సిటీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. పంజాబ్ యూనివర్సిటీ స్టూడెంట్స్ కౌన్సిల్ అధ్యక్ష పదవిని వరుసగా రెండవ సంవత్సరం కూడా గెలుచుకొని యువత ఎటు ఉందో నిరూపించింది. ఇటీవలే ప్రకటించిన అధికారిక ఫలితాల ప్రకారం ఎబివిపికి చెందిన అంకిత్ బిధాన్ ఆప్‌కు అనుబంధ విద్యార్థి సంస్థ ఎఎస్ఎపి నుంచి పోటీ చేసిన ఆదిల్ బ్రార్‌ను 512 ఓట్ల తేడాతో ఓడించారు. పంజాబ్ యూనివర్సిటీ విద్యార్థి మండలి ఎన్నికలలో వరుసగా రెండు పర్యాయాలు విజయం సాధించి అత్యున్నత పదవిని గెలుచుకోవడం యూనివర్సిటీ చరిత్రలోనే ఇది తొలిసారి. దాదాపు 50 సంవత్సరాల తర్వాత తొలిసారి ఎబివిపి గత ఏడాది ఎన్నికలలో గెలిచింది.

రాష్ట్ర ఎన్నికలు ఆరునెలల్లో జరుగనున్న నేపథ్యంలో పంజాబ్ యూనివర్సిటీలో అఖిల భారతీయ విద్యార్థి పరిషద్ (ఎబివిపి) గెలుపు ప్రాధాన్యతను సంతరించుకుంది. ఎన్నికలు జరిగేముందు విద్యార్థి సంఘాల ఎన్నికలలో గెలుపోటములను ఆ ప్రాంతంలో యువ ఓటర్ల రాజకీయ మనోభావాలను తెలిపే సంకేతంగా పరిగణిస్తారు. యువత బిజెపి పట్ల ఆగ్రహంతో ఉందని భావిస్తున్నవారు కూడా ఈ విజయంతో ఆశ్చర్యానికి లోనయ్యారు.బిధాన్ దీనిని 'జెన్ జెడ్ విజయం'గా అభివర్ణించారు. 'ఇది మోదీజీ విజయం. విద్యార్థులు ఏబీవీపీని ఎంతగా ప్రేమిస్తున్నారో చూపించారు. మేం మా వాగ్దానాలను నెరవేర్చాం,' అని బిధాన్ అన్నారు.

శిరోమణి అకాలీ దళ్ విద్యార్థి విభాగమైన స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఓఐ) ఎబివిపికి మద్దతు అందించడంతో, 2027 ఎన్నికలకు ముందు అకాలీదళ్, బిజెపి తమ కూటమిని పునరుద్ధరించుకోవాలనుకుంటున్నాయన్న ఊహాగానాలను ఖరారు చేసినట్టు అయింది. పంజాబ్‌లో ఎన్నికలకు ముందు పొత్తుపై నిశ్శబ్దం నెలకొన్నప్పటికీ, రెండు పార్టీలు కలిస్తే శక్తివంతమైన శక్తిగా మారగలవని విశ్వవిద్యాలయ ఎన్నికల ఫలితాలు సూచిస్తున్నాయి.

# విజయవంతంగా అంతరిక్షంలోకి 'నాటీ బాయ్'



మహాభారత యుద్ధంలో బర్బరీకుడు కురుక్షేత్ర యుద్ధ క్షేత్రాన్ని తిలకించినట్టుగా, ఇక నుంచి మన దేశం, సరిహద్దులు, చుట్టుపక్కల ప్రాంతాలలో ఏం జరుగుతోందో ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేసే 'కన్ను' ఇప్పుడు అంతరిక్షాన్ని చేరింది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఇఒఎస్-05 భూ పరిశీలన ఉపగ్రహాన్ని మోసుకెళ్లిన జిఎస్ఎల్‌వి-ఎఫ్17ను సెప్టెంబర్ 4న విజయవంతంగా ప్రయోగించడంతో భారత అంతరిక్ష కార్యక్రమానికి భారీ ప్రోత్సాహం లభించింది. "నాటీ బాయ్" అని ముద్దుపేరు గల ఈ జియోసింక్రోనస్ (భూసమవర్తన కక్ష్య) శాటిలైట్ లాంచ్ వెహికల్ (జిఎస్ఎల్‌వి), సంవత్సరాలుగా తన అనూహ్యమైన రికార్డుతో పేరు సంపాదించుకుంది. అందువల్ల, దీని తాజా విజయం ఒక సాధారణ ఉపగ్రహ ప్రయోగానికి మించిన ప్రాముఖ్యతను కలిగి ఉంది.

భూమిపైన 36వేల కిమీల జియోసింక్రొనస్ కక్ష్య నుంచి పని చేసేలా ఇఒఎస్-05ను రూపకల్పన చేసినందున ఈ జిఎస్ఎల్‌వి- ఎఫ్ -17 మిషన్ ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఈ రకమైన కక్ష్య కోసం ఉద్దేశించిన భారతదేశపు తొలి ప్రత్యేక ఇమేజింగ్ ఉపగ్రహం ఇది. ఇది చుట్టుపక్కల ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించ గలదని భావిస్తున్నారు. ఇటువంటి సామర్థ్యం విపత్తు నిర్వహణ, మౌలిక సదుపాయాల పర్యవేక్షణ నుండి వ్యూహాత్మక, జాతీయ భద్రతా, నిఘా వరకు అనేక అనువర్తనాలను కలిగి ఉంటుంది.

ఈ విజయం ఇస్రోకు కీలక సమయంలో లభించింది. సాంప్రదాయకంగా ఇస్రో ప్రధాన ప్రయోగ వాహనంగా పరిగణించే పిఎస్ఎల్‌వి విషయంలో ఈ సంస్థ ఇటీవల ఎదురుదెబ్బలు తిన్నది. జనవరి 2026లో పిఎస్ఎల్‌వి-సి62 ప్రయోగంలో లోపం తలెత్తడంతో, దానిపై సవివరమైన దర్యాప్తు చేపట్టాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో, విజయవంతమైన జీఎస్ఎల్‌వి-ఎఫ్17 ప్రయోగం, భారతదేశం కేవలం ఒకే రాకెట్ రకంపై ఆధారపడకుండా, బహుళ స్వదేశీ ప్రయోగ సామర్థ్యాలను కలిగి ఉందని నిరూపిస్తుంది

"నాటీ బాయ్" అనే ముద్దుపేరే జీఎస్ఎల్‌వి సంక్లిష్టమైన చరిత్రను ప్రతిబిం బిస్తుంది. ఈ రాకెట్ అభివృద్ధి, కార్యాచరణ ప్రయాణంలో వైఫల్యాలను చవి చూసింది, అయినప్పటికీ, దీని కథ పట్టుదలకు కూడా నిదర్శనం. మరింత క్లిష్టమైన మిషన్లకు అవసరమైన క్రయోజెనిక్ ప్రొపల్షన్ టెక్నాలజీని అభివృద్ధి చేయడం భారతదేశానికి ఒక పెద్ద సాంకేతిక సవాలుగా నిలిచింది. ఈ టెక్నాలజీలో నైపుణ్యం సాధించడం, బరువైన ఉపగ్రహాలను స్వతంత్రంగా ఉన్నత కక్ష్యలలోకి ప్రయోగించే దేశ సామర్థ్యాన్ని బలోపేతం చేసింది. ఆత్మనిర్భరతే బహుశా జీఎస్ఎల్వీ-ఎఫ్17 మిషన్ అతిపెద్ద ప్రాముఖ్యత. అంతరిక్ష సాంకేతికత జాతీయ సామర్థ్యం, సమాచార ప్రసారాలు, భూ పరిశీలన, నావిగేషన్, శాస్త్రీయ పరిశోధన, వ్యూహాత్మక భద్రతతో సన్నిహితంగా ముడిపడి ఉంది. స్వదేశీ ప్రయోగ వాహనాలను కలిగి ఉండటం వల్ల విదేశీ సరఫరాదారులపై ఆధారపడటం తగ్గుతుంది. ముఖ్యమైన ఉపగ్రహాలను ఎప్పుడు, ఎలా కక్ష్యలోకి ప్రవేశపెట్టాలనే అంశంపై భారతదేశానికి మరింత నియంత్రణ లభిస్తుంది.

# మతం మార్చుకుంటే కుల రక్షణలు పోయినట్టే



ఒక షెడ్యూల్డు కులాలకు చెందిన వ్యక్తి హిందూ, సిక్కు లేదా బౌద్ధం మినహా ఏ మతంలోకి మారినా అతడి ఎస్సి హోదాను కోల్పోతాడంటూ 24 మార్చి 2026 తాము ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తాజాగా కొట్టివేసింది. న్యాయమూర్తులు ప్రశాంత్ కుమార్ మిశ్రా, మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను తిరస్కరించింది.

రివ్యూ పిటిషన్‌పై మౌఖిక విచారణ కోరుతూ దాఖలు చేసిన దరఖాస్తును కూడా ధర్మాసనం తిరస్కరించింది. 'సమీక్షా పిటిషన్‌పై మౌఖిక విచారణ కోరుతూ దాఖలు చేసిన దరఖాస్తు తిరస్కరించాం. పరిశీలించి, సమీక్షించాలని కోరిన సమీక్షా పిటిషన్‌ను, మార్చి 24, 2026 నాటి తీర్పును కూడా పరిశీలించాం. రికార్డులో స్పష్టంగా ఎలాంటి లోపం కనిపించడం లేదు. అందువల్ల, సమీక్షా పిటిషన్‌ను కొట్టివేస్తున్నాం,' అని సుప్రీంకోర్టు పేర్కొంది. మతం మార్చుకున్న తర్వాత కూడా షెడ్యూల్డ్ కుల హోదా కొనసాగింపునకు సంబంధించి మార్చి 24న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సమీక్షా పిటిషన్ దాఖలు అయింది. హిందూ, సిక్కు లేదా బౌద్ధ మతం కాకుండా వేరే మతంలోకి మారిన తేదీ నుండి, రాజ్యాంగం (షెడ్యూల్డ్ కులాలు) ఉత్తర్వు, 1950 పరిధిలోకి వచ్చే వ్యక్తి షెడ్యూల్డ్ కుల (ఎస్సీ) హోదా రద్దు అవుతుందని కోర్టు తన గత తీర్పులో పేర్కొంది. తాజా ఉత్తర్వు మార్చి 24 నాటి తీర్పును యథాతథంగా ఉంచుతుంది. షెడ్యూల్డ్ కులాల సభ్యులకు అందుబాటులో ఉన్న వివిధ రాజ్యాంగ రక్షణలు, రిజర్వేషన్లు , సంక్షేమ చర్యలకు అర్హతను షెడ్యూల్డ్ కులహోదా నిర్ధారిస్తుంది కాబట్టి, సుప్రీంకోర్టు నిర్ణయం అత్యంత కీలకమైంది. గత తీర్పుకు వ్యతిరేకంగా లేవనెత్తిన కారణాలను పరిశీలించిన అనంతరం, పునఃపరిశీలనకు ఆస్కారం కల్పించే స్పష్టమైన లోపం ఏదీ లేదని నిర్ధారించిన ధర్మాసనం, సమీక్ష పిటిషన్‌ను కొట్టివేసింది.

# నౌకా దళంలోకి తాజాగా ఐఎన్ఎస్ నిపుణ్



సముద్ర గర్భంలోకి చొచ్చుకెళ్లి అత్యంత క్లిష్టమైన ఆపరేషన్లు నిర్వహించే సత్తా కలిగిన స్వదేశీ డైవింగ్ సహాయక నౌక (డీఎస్‌వీ) 'ఐఎన్ఎస్ నిపుణ్' గత సోమవారం భారత నౌకాదళంలో చేరింది. ముంబైలోని నావల్ డాక్‌యార్డ్‌లో నావికాదళ చీఫ్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ సమక్షంలో ఈ నౌకను అధికారికంగా ప్రారంభించారు. గతేడాది ప్రారంభించిన 'ఐఎన్ఎస్ నిస్తార్' తర్వాత నౌకా దళంలో చేరిన రెండో డైవింగ్ సహాయక నౌక ఇది. ఐఎన్ఎస్ నిపుణ్‌ను విశాఖపట్నంలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ సంస్థ స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించింది. దాదాపు 10,500 టన్నుల బరువు మోసే సామర్థ్యం దీనికి ఉం ది. సముద్ర గర్భంలో 300 మీటర్ల లోతు వరకూ వెళ్లి డైవింగ్ ఆపరేషన్లు నిర్వహించగలిగేలా దీనిని నిర్మించారు. వీటితోపాటు ప్రమాదంలో చిక్కుకున్న జలాంతర్గాములను రక్షించడంలోనూ ఇది కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు తెలిపారు.

# పాక్‌లో కూల్చిన ఆలయ పునర్నిర్మాణానికి హామీ



పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్ నరోవాల్ జిల్లాలో కూల్చివేసిన 125 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన హిందూ ఆలయాన్ని పునర్నిర్మిస్తామని పంజాబ్ ప్రభుత్వం ప్రకటించింది. భారీ వర్షాల కారణంగానే ఆలయంలోని కొంత భాగం దెబ్బతిన్నదని పేర్కొంటూ, ఆ ప్రాంతంలో మరమ్మతులు చేపడతామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. పంజాబ్ ముఖ్యమంత్రి మరియం నవాజ్ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ అంశంపై స్పందించింది. మైనారిటీ వ్యవహారాల మంత్రి సర్దార్ రమేష్ సింగ్ అరోరా ఆలయాన్ని సందర్శించినట్లు 'ఎక్స్' వేదికగా ప్రభుత్వం వెల్లడించింది. భారీ వర్షాల కారణంగా ఆలయ సైన్‌బోర్డులోని కొంత భాగం మాత్రమే కిందపడినట్లు మంత్రి పరిశీలనలో గుర్తించారని తెలిపింది. దెబ్బతిన్న ప్రాంతానికి అవసరమైన మరమ్మతులు చేపడతామని స్పష్టం చేసింది.

ఆలయానికి ఆనుకుని ఉన్న భూమిని మదర్సాకు కేటాయించినప్పటికీ, ఆలయానికి చెందిన భూమిని మాత్రం ఎవరికీ లీజుకు ఇవ్వలేదని పంజాబ్ ప్రభుత్వం పేర్కొంది. మతపరమైన ప్రార్థనా స్థలాలకు సంబంధించిన అంశాలు అత్యంత సున్నితమైనవని, ఇలాంటి విషయాల్లో వెలువడే ప్రతి వాదన వాస్తవమా కాదా నిర్ధారించుకోవాల్సిన బాధ్యత మరింత ఎక్కువగా ఉంటుందని ప్రభుత్వం తెలిపింది. నరోవాల్ జిల్లా సిరాజ్ గ్రామంలో ఉన్న ఈ 125 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన హిందూ ఆలయం గత నెలలో కూల్చివేశారు. ఆలయ ప్రాంగణాన్ని పక్కనే ఉన్న మదర్సాలో విలీనం చేసేందుకే ఆలయాన్ని తొలగించారని స్థానికులు ఆరోపించారు. నిషేధిత సంస్థ తహ్రీక్-ఎ-లబ్బాయిక్ పాకిస్థాన్ (టీఎల్‌పీ)తో సంబంధం ఉన్న వ్యక్తులు ఈ కూల్చివేతలో పాల్గొన్నారని కూడా ఆరోపణలు వచ్చాయి. పంజాబ్ ప్రభుత్వం పునర్నిర్మాణానికి హామీ ఇచ్చినప్పటికీ, ఆలయం ఎలా పునర్నిర్మిస్తారు, పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయి అనే అంశాలపై మరిన్ని వివరాలు వెల్లడించాల్సి ఉంది.

కథ

స్కూల్ నుండి రాగానే బ్యాగ్ సోఫాలో పడేసి, కాళ్ల నుంచి బూట్లు అటొకటి ఇటొకటి విదిలించి గదిలోకి వెళ్లిపోయింది ఆశ్రిత. 'మళ్లీ ఈ పిల్లకి ఏదో అయింది' అనుకుంటూ వాటర్ బాటిల్ పట్టుకుని గదిలోకి వెళ్లింది సుస్మిత.

"ఆశూ ఏమైంది? ఎందుకలా ఉన్నావు? కాసిని నీళ్లు తాగు ముందు"అంది దగ్గరగా నిలబడి బాటిల్ అందిస్తూ.

అభావంగా తల దించుకోవడం చూసి కూతురు వీపు మీద చెయ్యేసి నిమురుతూ

"ఏమిటో చెప్పమ్మా? నా బంగారుతల్లి కదూ" అంది సుస్మిత మృదువుగా,

"ఏం లేదమ్మా, ఎందుకో చిరాకుగా ఉంది"

"స్కూల్‌లో ఏమైనా అయిందా? ఎవరైనా ఏమైనా అన్నారా?"

"నథింగ్. ఏం లేదు. ఐయామ్ ఓకే"

"సరే. నీకు స్నాక్స్ పాలు తీసుకొస్తానుండు"

"నాకేమీ వద్దు. తినాలని లేదు"

" అలా అంటే ఎలా? చూడు ఎంత అలసటగా ఉన్నావో. ముఖం కడుక్కుని ఫ్రెష్ అయితే కాస్త హాయిగా ఉంటుంది.

మధ్యాహ్నం ఎప్పుడో స్కూల్‌లో తిన్నావు. పొట్ట చూడు ఎలా లోతుకు పోయిందో. ఏదో ఒకటి తినాలి" అంటూ వంటింట్లోకి వెళ్లి తనకు ఇష్టమైన జంతికలు, పండ్ల ముక్కలు, పాలు తీసుకుని ఆశ్రిత దగ్గరకు వెళ్లింది.

"వద్దన్నాను కదమ్మా. ఆకలి వెయ్యట్లేదు" అంది.

"పోనీ వేడివేడిగా పకోడీలు చెయ్యనా?"

"వద్దు"

"పిజ్జా ఆర్డర్ చెయ్యనా?" అడిగింది సుస్మిత అలాగైనా దారికి వస్తుందని.

"నాకేం వద్దు"అని కూతురు అంటున్నా,

"నా బంగారుతల్లి కదూ. తిను, నా కోసం ప్లీజ్" అంటూ పండ్ల ముక్కలు నోట్లో పెడితే మొత్తానికి ప్లేట్ తీసుకుని తనే నెమ్మదిగా తినడం మొదలు పెట్టింది.

మునుపు చాలా ఉత్సాహంగా ఉండే పిల్ల ఈ మధ్య ఎందుకు ఇలా డల్ గా ఉంటోందో సుస్మితకు ఏ మాత్రం అంతుపట్టట్లేదు.

* * *

సెల్ ఫోన్ రింగైతే తీసింది సుస్మిత. ఎవరా అని చూస్తే ప్రణతి కాలింగ్ అని ఉంది.

"ప్రణతీ ఎలా ఉన్నావు? ఏంటి సంగతులు?" అంటూ పలకరించింది స్నేహితురాలిని.

"బావున్నాను. నువ్వెలా ఉన్నావు? అన్నట్టు నా డార్లింగ్ ఆశ్రిత ఎలా ఉంది?" అడిగింది ప్రణతి.

"ఆశ్రితతో పాటు అందరం బావున్నాము. చాలా రోజుల తరువాత గుర్తొచ్చా కదా" అంటూ నిష్ఠూరమాడింది.

"వద్దు తిట్టద్దు. అన్నట్టు నీకొక సర్ప్రైజ్ న్యూస్ చెబుదామని చేసాను"

"అవునా అదేమిటో త్వరగా చెప్పు"

"ముందు నువ్వు గెస్ చెయ్యి"

"ఏమిటో తెలియట్లేదు. చెప్పెయ్యచ్చు కదా ప్లీజ్"

"ఎల్లుండి బయలుదేరి నీ దగ్గరకు వస్తున్నాను. ఒక నాలుగు రోజులు నీ ఇంట్లోనే ఉంటాను"

"అవునా, నిజంగా మంచి సర్ప్రైజ్. ఎంత ఆనందంగా ఉందో చెప్పలేను"

"సరే అయితే, వచ్చాక హాయిగా ఎంజాయ్ చేద్దాం. బోలెడు కబుర్లు చెప్పుకుందాం"

ఫోన్ టీపాయ్ పైన పెట్టి టీవీ ఆన్ చేసింది సుస్మిత. కళ్లు టీవీ చూస్తున్నాయి కానీ మనసంతా ఆశ్రిత చుట్టే తిరుగుతోంది.

మళ్లీ ఫోన్ రింగైన శబ్దానికి ఆలోచనలలోంచి ఉలికిపడి టీవీ వాల్యూమ్ తగ్గించి, ఫోన్ వైపు విసుగ్గా చూసింది.

'అమ్మ కాలింగ్' అని చూసాక బటన్ నొక్కి

"అమ్మా చెప్పు? ఏంటి విషయం?" అంది.

"ఏమీ లేదమ్మా. ఊరికే చేసాను. ఆశ్రిత స్కూల్‌కి వెళ్లిందా? ఏం చేస్తున్నావు?" అడిగింది తల్లి.

"అవును వెళ్లిందమ్మా. ఏమీ చెయ్యట్లేదు. టీవీ



# రంగు రెక్కలు

పద్మావతి రాంభక్త

చూస్తున్నాను. అన్నట్టు ప్రణతి వస్తున్నానని ఫోన్ చేసింది" అంది ఆనందంగా.

"అవునా! పోనీలే బాల్య స్నేహితురాళ్లిద్దరూ సరదాగా గడపండి. ఇంతకీ ఎన్నాళ్లు ఉంటుంది?"

"నాలుగైదు రోజులు ఉంటానంది. అవునమ్మా తనొస్తుందని తెలియగానే నాకు ఆనందంగా ఉంది"

"ఆ నాలుగు రోజులు అమ్మతో మాట్లాడవన్న మాట"

"ఎందుకు మాట్లాడనూ. ప్రణతి చేత కూడా మాట్లాడిస్తా"

"సరే నుస్మీ ఉంటాను. ఎవరో బెల్ కొడుతున్నారు"

* * *

ప్రణతి రాగానే ఆత్మీయంగా కౌగిలించుకుంది సుస్మిత.

"ఏమిటిలా చిక్కిపోయావు?" అంది ప్రణతి సుస్మితను తేరిపారా చూస్తూ.



"కళ్ల చుట్టూ నల్లని వలయాలు వచ్చాయి కూడా" అంది సుస్మిత చుబుకం ఎత్తి పరీక్షగా చూస్తూ.

"అదంతా నీ ప్రేమ తల్లీ! ఉండు మంచి అల్లం టీ తాగుతూ కబుర్లు చెప్పు కుందాం" అంటూ టీ కోసం స్టౌ మీద నీళ్లు పెట్టింది. ఇద్దరూ వంటింట్లోనే టీ తాగుతూ కబుర్లు నంజుకున్నారు.

బెల్ మోగడం విని వెళ్లి తలుపు తీసింది సుస్మిత.

ఆశ్రిత లోపలకి రాగానే

"హలో డార్లింగ్. ఏమిటి సంగతి? ఇంకా ఇదివరకులా అల్లరి చేస్తున్నావా నాటీగర్ల్?" అని చిలిపిగా నవ్వుతూ భుజం మీద చెయ్యేసి పలకరించింది ప్రణతి.

"హలో అంటే" అంటూ ముక్తసరిగా పలకరించి గదిలోకి వెళ్లి తలుపేసుకున్న ఆశ్రితను చూసి "ఏమిటి స్మితా, ఆశ్రిత అంత డల్ గా ఉంది. ఇదివరకు నన్ను చూడగానే అంటీ అంటూ ఊపిరాడనీయ కుండా కబుర్లు చెప్పేది?"

"అదే నాకూ అర్థం కావట్లేదు ప్రణతీ. మా ఆయనకు ట్రాన్స్‌ఫరై వచ్చి ఇక్కడ స్కూల్‌లో జాయిన్ చేసామ!ముందు బాగానే ఉండేది. ఆ తరువాత ఏమిటో నెమ్మది నెమ్మదిగా ఇలా డల్గా తయారైంది. ఏమిటంటే చెప్పదు"

"వివరంగా చెప్పు.ఎప్పటి నుండీ ఇలా? చదువు ప్రెజర్ ఎక్కువ ఉందేమో, మదర్‌గా ముందు నీకే తెలుస్తుంది కదా?"

"నీకు తెలియంది కాదు కదా! చదువు అంటూ నేను తనని అసలు ఒత్తిడి చెయ్యను. తనంతట తనే శ్రద్ధగా చదువుకుంటుంది. మార్కులు తక్కువ వస్తే ఈసారి బాగా చదివి బెటర్‌గా తెచ్చుకుంటానని తనే చెప్తుంది. కానీ ఈ మధ్య చదువు మీద కూడా అంత ధ్యాస లేదు తనకు. ఎప్పుడూ ఏదో ఆలోచనలో ఉంటోంది"

"మరి స్కూల్‌లో టీచర్స్‌ని కలవలేకపోయావా? వాళ్లు ఏమైనా ఈ విషయంలో సహాయం చేసేవారేమో"

"అదీ చేసాను.వాళ్లు కూడా క్లాస్‌లో డల్‌గా ఉంటోంది. మీకే కబురు పెడదాం అనుకుంటున్నాం. మీరే ఈలోగా వచ్చారు అన్నారు"

"హ. చూద్దాం ఏమిటో. ఇంకా చెప్పు ఈ మధ్య తన గురించి నువ్వు గుర్తించిన విషయాలు"

"ఈ స్కూల్‌లో జాయిన్ అయ్యాక ముందు చాలా హుషారుగా ఉండేది. కొత్త ఫ్రెండ్స్ చేసుకున్నానని, వాళ్లంతా చాలా మంచి వాళ్లని చెప్పింది"

"ఊ ..ఇంకా. నీతో ఏం మాట్లాడేది. చిన్నచిన్న విషయాలు కూడా వదలకుండా గుర్తు చేసుకుని చెప్పు"

"ఆ... స్కూల్‌లో చేరిన నెల తరువాత అనుకుంటా, సంగీతం నేర్చుకుంటాను అంటూ మొదలుపెట్టింది. అంతకు మునుపు నేనెప్పుడో సరదాగా జాయిన్ చేస్తానన్నా, ఇంట్రస్ట్ లేదని చెప్పింది. ఏదో మామూలుగా టీవీలో పాటలు చూడడం తప్ప తను ఎప్పుడూ కూనిరాగాలు తీయడం కూడా నేను చూడలేదు. నేను విని ఊరుకుంటే వదలకుండా పట్టుబట్టి సంగీతం క్లాస్‌లో చేరింది"

"ఓహ్ గుడ్. మంచిదేగా సంగీతం నేర్చుకుంటే"

"మంచిదే కానీ ఒక నెల సంగీతం క్లాస్‌కు సరిగ్గా వెళ్లిందో లేదో నా వల్ల కాదు అని మానేసింది. దానికీ మేము ఏమీ అనలేదు"

"పోనీలే తనకి నచ్చలేదేమో. ఫ్రెండ్స్ ఎవరో సంగీతంలో జాయిన్ అయి ఉంటారు. వాళ్లని చూసి సరదాపడి ఉంటుంది"

"మేము కూడా అదే అనుకున్నాం. కానీ ఈసారి డాన్స్ క్లాస్‌లో చేరతానని పేచీ పెట్టింది"

"మరేం చేస్తారు"

"నీకు తెలుసు కదా తనకి ఆయాసం వస్తూ ఉంటుందని. అదే చెప్పాం కానీ మొండిపట్టు పట్టింది. ఇక తన మాట కాదనలేక జాయిన్ చేసాను కానీ డాన్స్ టీచర్‌కి తనని ఎక్కువ కష్టపెట్టకుండా సింపుల్ స్టెప్స్ నేర్పించమని తన ఎదురుగానే చెప్పాను. ఈసారి పది రోజులు వెళ్లి ఇక వెళ్లనని తెగేసి చెప్పింది. ఏమిటో ఈ పిల్ల సంగతి అర్థం కావట్లేదు".

"నేను కనుక్కుంటానులే. నువ్వు ఎక్కువ ఆలోచించి బాధపడకు"

"ఏమో నాకేం తోచడం లేదు. సరే నువ్వు మాట్లాడి చూడు. వాళ్ల డాడీ ఎంత అడిగినా కూడా నోరు విప్పట్లేదు తను"

* * *

మర్నాడు ప్రణతి సుస్మితను తీసుకుని ఆశ్రిత స్కూలుకు వెళ్లింది. అక్కడ ప్రిన్సిపల్‌ను, టీచర్లను కలసి లంచ్ అవర్‌లో ఆశ్రిత ఫ్రెండ్స్‌ను కూడా కలిసి చాక్లెట్స్ ఇచ్చి కాసేపు సరదాగా కబుర్లు చెప్పింది

"ఎందుకు అంటీని తీసుకుని స్కూల్‌కి వచ్చావమ్మా?" అడిగింది ఆశ్రిత తల్లిని.

"ఊరికే వచ్చాం. మా ఫ్రెండ్ వాళ్లు ఈ ఊరికి మూవ్ అవుతున్నారు. తను నాకు తెలిసిన మంచి స్కూల్స్ ఏమైనా ఉన్నాయేమో అని కనుక్కోమంది. నువ్వు చదువుతున్న ఈ స్కూల్ మంచి స్కూల్

కదా...ఒకసారి చూసి తన పిల్లలను జాయిన్ చెయ్యడానికి సజెస్ట్ చేద్దామని నేనే మీ అమ్మని వెడదాం అని అడిగాను” చెప్పింది ప్రణతి దానికి జవాబుగా.

ఇంటికి వచ్చాక

“ఈ మధ్య ఆశ్రిత సెల్ ఫోన్ వాడుతోందా?” అనడిగింది ప్రణతి.

“అవును. ఈ స్కూల్‌లో హోంవర్క్, పాఠాలలో అంశాలు ఫోన్‌లో పంపుతారు. అలాగే ఏ ముఖ్యమైన విషయమున్నా, అనుకోకుండా స్కూల్‌కు సెలవు ప్రకటించినా, వాట్సాప్‌లో మెసేజ్ చేస్తారు. అందుకే తనకి సెల్ ఫోన్ కొనిచ్చాం”

“తను ఏం చూస్తోందీ ఫోన్‌లో గమనించావా?”

“తను మా ఎదురుగానే సెల్ ఫోన్ వాడుతుంది. అప్పుడప్పుడు సరదాగా రీల్స్ అవీ చూస్తుంది. తనకి ఇన్ స్టా ఎకౌంట్, ఫేస్ బుక్ అకౌంట్ ఉంది. కానీ ఫోన్ లాక్ చేసుకోదు, అకౌంట్స్ అన్నీ ఓపెన్ అకౌంట్స్ కాబట్టి....”



ఆశ్రిత ఫోన్ చెక్ చేసాక ప్రణతికి కాస్త విషయం అర్థమైంది. సుస్మితతో కొన్ని విషయాలు మాట్లాడి, చర్చించాక ఇద్దరూ నిద్రకు ఉపక్రమించారు. ఆ రోజు ఆదివారం కావడం, సుస్మిత భర్త ఫ్రెండ్‌ను కలవడానికి బయటకు వెళ్లడంతో ఇంట్లో ముగ్గురే ఉన్నారు. ఆశ్రిత హోమ్ వర్క్ చేసు కుంటుంటే తన ఎదురుగా స్నేహితురాళ్లు ఇద్దరూ కబుర్లు మొదలుపెట్టారు.

“ఛ ఛ. తనేదో తప్పు చేస్తోంది. చూస్తోంది అని కాదు. హఠాత్తుగా తన ప్రవర్తనలో మార్పుకిఇ కారణం ఏమై ఉంటుందా అని”

“పరవాలేదు నాకు అర్థమైంది నువ్వు చెపుతున్నది. నా శ్రేయోభిలాషివి, ప్రాణస్నేహితు రాలివి కనుకే మా అమ్మకు కూడా చెప్పని విషయాలు నీతో పంచుకుంటాను”

“అంత ఉత్సాహంగా ఉండే పిల్ల ఇప్పుడు ఎందు కిలా ఉందో అని ఆలోచిస్తూ, తనకి సంబంధించిన విషయాలన్నీ వివరంగా తెలుసుకుంటున్నాను. రాత్రి అందరూ నిద్రపోయాక తన ఫోన్ తీసుకుని నా దగ్గరకు రా చెప్తాను” అంది ప్రణతి సాలోచనగా.

⁂ ⁂ ⁂

ఆశ్రిత ఫోన్ చెక్ చేసాక ప్రణతికి కాస్త విషయం అర్థమైంది. సుస్మితతో కొన్ని విషయాలు మాట్లాడి, చర్చించాక ఇద్దరూ నిద్రకు ఉపక్రమించారు.

ఆ రోజు ఆదివారం కావడం, సుస్మిత భర్త ఫ్రెండ్‌ను కలవడానికి బయటకు వెళ్లడంతో ఇంట్లో ముగ్గురే ఉన్నారు. ఆశ్రిత హోమ్ వర్క్ చేసు కుంటుంటే తన ఎదురుగా స్నేహితురాళ్లు ఇద్దరూ కబుర్లు మొదలుపెట్టారు.

“స్మితా, భారతి తన భర్తతో ఈ మధ్య ఇన్‌స్టా వీడియోలు చేసి తెగ పాప్యులర్ అయింది తెలుసా” అంది ప్రణతి.

“అవునా నేను అంతగా ఏవీ ఫాలో అవను ప్రణతీ”

“అలాకాదే. నువ్వు చిన్నప్పుడు చక్కగా పాడేదానివి కదా. ఎప్పుడైనా సరదాగా పాటలు పాడి వీడియోలు మీడియాలో పెట్టచ్చు కదా”

“చెయ్యచ్చేమో కానీ నాకు ఆశూతో టైమ్ స్పెండ్ చెయ్యడం ఇష్టం. వాటిలో పడితే ఇక అందులోకి వెళ్లిపోతానేమో అని అనిపిస్తుంది. ఇది వరకు అప్పుడప్పుడు రీల్స్ అవీ చూసేదాన్ని. కానీ చూస్తుంటే టైమ్ అసలు తెలిసేది కాదు. ఒకేసారి గంటసేపు ఫోన్ పట్టుకుని కూర్చున్నానా! అని ఆశ్చర్యంగా అనిపించేది. అందుకే నెమ్మదిగా అలవాటు తప్పించు కున్నాను. ఇప్పుడు తను స్కూల్‌కి వెళ్లాక ఏ మాత్రం టైమ్ ఉన్నా మంచి మంచి పుస్తకాలు చదువుతాను”

“అదీ నిజమేలే. రీల్స్ చూస్తున్నప్పుడు డోపమైన్ విడుదలైనా ఆ కాసేపు మాత్రమే. అది ఒక సుడిగుండం లాంటిది. తెలియకుండానే లోపలకు లాగేస్తుంది, నెమ్మదిగా అడిక్ట్ అయిపోతాం”

“కానీ మంచి మంచి విషయాలు కూడా తెలుస్తాయిగా సోషల్ ప్లాట్ ఫాంల వల్ల”

“అదీ నిజమే అనుకో కానీ దాని వల్ల వృథా అయ్యే సమయం కన్నా, అవే విషయాలను చదివి కూడా తెలుసుకోవచ్చు కదా. ఎక్కువ సోషల్ మీడియాలో గడిపే వాళ్లు డిప్రెషన్‌కు లోనవుతారుట తెలుసా. దేనికైనా కంట్రోల్ ఉండాలి. మన మనసు మన నియంత్రణలో ఉండాలి. దురదృష్టవశాత్తు ప్రపంచం అటు వైపే పరుగులు తీస్తోంది”

ఉన్నట్టుండి ఆశ్రిత “మా స్కూల్లో వినీల, సుజాత డాన్స్ వీడియోలు ఇన్ స్టాలో పోస్ట్ చేస్తారాంటీ. మా ఫ్రెండ్స్ అందరూ చూసి తెగ మెచ్చుకుంటారు. చాలా మంది చూసి వాళ్లలా పాప్యులర్ అవుదామని ట్రై చేస్తారు. వినీలా వాళ్లకి వేలల్లో ఫాలోవర్స్ కూడా ఉన్నారు” అంది.

“అవునా ఆశూ. కానీ అందరూ ఏది చేస్తే అది చెయ్యక్కర్లేదు. డిఫరెంట్గా ఉండాలి. ‘దు నాట్ ఫాలో ద క్రౌడ్’ అన్నది తెలుసు కదా”

“నిజమే ఆంటీ” అంది ఆశ్రిత సాలోచనగా.

⁂ ⁂ ⁂

ప్రణతి ఊరు బయలుదేరేటప్పుడు “హాలీడేస్‌లో చదువు” అంటూ రెండు మంచి పుస్తకాలు ఆశ్రితకు బహూకరించింది.

కొన్నాళ్ల తరువాత ప్రణతి సుస్మితకు ఫోన్ చేసింది.

“ఎలా ఉన్నావు స్మితా? ఆశ్రిత ఎలా ఉంది?” అని అడిగింది.

“నీ దయ వల్ల బాగానే ఉన్నాను తల్లీ. ఆశ్రిత ఇప్పుడు ఉత్సాహంగానే ఉంటోంది. అయినా ఏం మంత్రం వేసావే”

“ఏ మంత్రం తంత్రం లేదు. తను అడాలసెంట్ ఏజ్‌లో ఉంది. ఎదిగే వయసులోని హార్మోన్ల ప్రభావం వల్ల విసుగు చిరాకు ఒక వైపు, కొత్త స్కూల్‌లో అడ్జస్ట్‌మెంట్ మరొకవైపు తనని ఇబ్బంది పెడు తున్నాయి. దీనికితోడు పాత స్కూల్‌లో తనని అందరూ బాగా చదువుతుందని మెచ్చుకునేవారు. ఇక్కడికి వచ్చాక అది కొంచెం తగ్గింది. దాంతో ఆశూ ఐడెంటిటీ క్రైసిస్ వల్ల బాధ పడుతోంది. వినీలా వాళ్లలా గుర్తింపుపొందాలనే ఆరాటంతో డాన్స్ నేర్చు కుంటాననీ మరేదో నేర్చుకుంటాననీ నీ దగ్గర మారాం చేసింది”

“అవునా. ఇవన్నీ నీకెలా తెలుసు?” అంది సుస్మిత ఆశ్చర్యంగా.

“ఆ రోజు తన ఫోన్ చూసేను కదా ! సాధారణంగా మనం ఏ వీడియోలు చూస్తే అవే వీడియోలు ఫోన్ పంపిస్తూ ఉంటుంది. మన ఫోన్ మనలను గమనిస్తూ ఉంటుంది. అంతా ఇంటర్నెట్ మాయాజాలం. తను ఎక్కువగా వాళ్ల ఫ్రెండ్స్ వీడియోలు చూస్తోందని తెలుసుకున్నాను. తన ఫ్రెండ్స్‌ను ఆ రోజు స్కూల్లో కలిసాను కదా. వాళ్ల అకౌంట్స్ కూడా చూసాను. అన్నీ చూసాక నాకు కాస్త కాస్తగా విషయం అర్థమైంది. అదీకాక తన ఎదురుగా మనం మాట్లాడుకున్నవి వింటుందని తెలుసు. ఏదేమైనా ఆశ్రిత తెలివైన పిల్ల. ముడుచు కుంటున్న తన రంగురెక్కలను తెరిచి తనే ఎగరడం నేర్చుకుంటుంది”

“తల్లీ! నీకు శతకోటి నమస్కారాలు. అయినా తమరు సైకాలజీలో పీహెచ్‌డీ కదా”

“అదేం కాదు కానీ ఈ సోషల్ మీడియాలోకి మనం ఎప్పుడు తొంగి చూసినా, ప్రపంచమంతా ఎంతో సంతోషంగా ఉన్నట్టు, మన జీవితాలలోని లోటుపాట్లు పెద్దవిగా అనిపిస్తాయి. ఎవరూ దీనికి మినహాయింపు కాదు”

“అదీ నిజమేలే. ఆ రీల్స్ అవీ ఇన్ స్టాలో, ఫేస్ బుక్‌లో చూడడం అలవాటు అయిపోతే అడిక్షన్ నుండి బయటపడడం కూడా కష్టమే. అన్నట్టు ఆశూ ఇప్పుడు చిన్న చిన్న కవితలు కథలు రాస్తోంది”

“మంచిదేగా. కానీ తనని గమనించడం మాత్రం మానకు” ★

# 'బంగారు' కలతో ఏషియాడ్‌కు భారత్!

ఆసియా ఇరవయ్యోవ (2026) క్రీడాసంరంభానికి జపాన్ ప్రారిశ్రామిక నగరాలు అయిచీ- నగాయోలు వేదికగా వినూత్నతరహాలో తెరలేచింది. అక్టోబర్ 4 వరకూ జరిగే ఈ బహుముఖ క్రీడాసమరంలో 768 మంది సభ్యుల భారీ బృందంతో భారత్ పోటీకి దిగింది.ఆసియాక్రీడల కంటే మెరుగైన ఫలితాలు సాధించాలన్న పట్టుదలతో భారత అథ్లెట్ల బృందం ఉరకలేస్తోంది.



ఆసియా క్రీడోత్సవాలు .. కొద్దిగంటల క్రితమే జపాన్ వేదికగా అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 45 దేశాలకు చెందిన 11వేల మంది క్రీడాకారులు 43 క్రీడలకు చెందిన 71 అంశాలలో తలపడుతున్నారు. మొత్తం 469 పతకాలు ఆసియాఖండ దేశాల అత్యుత్తమ అథ్లెట్లను ఊరించి ఉడికిస్తున్నాయి. భారత అథ్లెట్లలో 269 మంది పురుషులు, 234 మంది మహిళలు ఉన్నారు. వీరు 43 క్రీడలకు గాను 35 క్రీడలకు చెందిన అంశాలలో మాత్రమే తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు.

## 1951 నుంచి 2023 క్రీడల వరకూ....

ప్రపంచ యుద్ధాలు, ఇతర రాజకీయ కారణాలతో ఒలింపిక్స్ నిర్వహణ పలుమార్లు నిలిచిపోయినా.. ఆసియా క్రీడలు మాత్రం 1951 నుంచి నిరాటంకంగా కొనసాగుతూ వస్తున్నాయి. ఆసియాదేశాల క్రీడాసమరం రూపకల్పన, నిర్వహణలో చురుకైన పాత్ర పోషిస్తున్న భారత్, పతకాల వేటలో మాత్రం అంతంత మాత్రంగానే ఉంటూ వస్తోంది. స్థాయికి తగ్గట్టుగా భారత అథ్లెట్లు చైనా, జపాన్, కొరియా లాంటి దేశాల అథ్లెట్లతో పోటీపడలేకపోతున్నారు.

2014 ఆసియాక్రీడల పతకాల వేటలో 8వ స్థానానికి పడిన భారత్.. ఆ తర్వాత నాలుగేళ్లకు జరిగిన 17వ ఆసియాక్రీడల్లో 11 స్వర్ణాలతో సహా మొత్తం 57 పతకాలతో పతకాల పట్టిక 4వ స్థానంలో చోటు దక్కించుకోగలిగింది. జకార్తా వేదికగా ముగిసిన 18వ ఆసియా క్రీడల్లో 18 స్వర్ణాలతో సహా మొత్తం 70 పతకాలు మాత్రమే సాధించిన భారత్ కేవలం ఐదేళ్ల వ్యవధిలోనే తన పతకాల సంఖ్యను 107కు పెంచుకోగలిగింది.

## 70 నుంచి 107 పతకాల స్థాయికి...

చైనా వేదికగా ముగిసిన 19వ ఆసియాక్రీడల్లో భారత్ రికార్డుస్థాయిలో 107 పతకాలు సాధించడం ద్వారా సరికొత్త చరిత్ర సృష్టించింది. హాంగ్జు వేదికగా 2023లో జరిగిన ఈ క్రీడల్లో భారత్ 28 స్వర్ణ, 38 రజత, 41 కాంస్యాలతో సహా శతపతకాల రికార్డును చేరుకోగలిగింది. క్రీడాకారుల అంకిత భావానికి ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికత జత కలవడంతో భారత్ పతకాల పంట పండించుకో గలిగింది. గత 71 సంవత్సరాలలో ఎన్నడూ లేనంతగా 107 పతకాలతో భారత్ పతకాల పట్టిక నాలుగోస్థానంలో సగర్వంగా నిలిచింది. చైనా వినువీధిలో 28సార్లు మువ్వన్నెల జెండా రెపరెపలకు తోడు జాతీయ గీతాలాపనతో భరతజాతి మెరిసి మురిసింది. శతపతకాల లక్ష్యాన్నిచేరటానికి భారత్ 7 దశాబ్దాలపాటు వేచిచూడాల్సి వచ్చింది. 1951 ప్రారంభ ఆసియాక్రీడల పతకాల పట్టిక రెండో స్థానంలో నిలిచిన భారత్... 1962 జకార్తా గేమ్స్‌లో 3వ స్థానం సంపాదించింది. ఆ తరువాత అత్యుత్తమంగా ప్రస్తుత క్రీడల్లో మాత్రమే 4వ స్థానం సంపాదించ గలిగింది. ఇప్పటి వరకూ జరిగిన మొత్తం 19 ఆసియాక్రీడల్లో భారత్ సాధించిన బంగారు పతకాలు 206గా ఉండటం విశేషం.

## మహిళా అథ్లెట్ల వాటా 46 పతకాలు ...

గత 18 ఆసియాక్రీడల్లో ఎన్నడూ లేని విధంగా భారత మహిళా అథ్లెట్లు పలు అపురూప విజయాలు సాధించారు. భారత్ సాధించిన మొత్తం 107 పతకాలలో మహిళలు సాధించినవే 46 ఉన్నాయి. మిక్సిడ్ విభాగంలో పురుష అథ్లెట్లు భాగస్వాములుగా మరో 9 పతకాలను మహిళా అథ్లెట్లు గెలుచుకొన్నారు.

## మహిళా అథ్లెట్లే భారత్ ప్రధాన బలం...!

చైనా వేదికగా ముగిసిన 19వ ఆసియాక్రీడల్లో భారత్ రికార్డుస్థాయిలో 107 పతకాలు సాధించడంలో మహిళా అథ్లెట్లు కీలకపాత్ర పోషించారు. పురుషులకు తాము ఏమాత్రం తీసిపోమని తమ అపురూప విజయాలతో చాటి చెప్పారు. మొత్తం 38 రకాల క్రీడాంశాలలో జరిగిన 45 దేశాల ఈ పోటీలలో భారత్ 655 మంది అథ్లెట్ల భారీబృందంతో బరిలో నిలిచింది. బృందంలో 330 మంది మహిళా అథ్లెట్లు సైతం ఉన్నారు.

ఆసియాక్రీడల టేబుల్ టెన్నిస్ చరిత్రలో భారత మహిళలు తొలి పతకాన్ని గెలుచుకోడం ద్వారా చరిత్ర సృష్టించారు. మహిళల డబుల్స్‌లో ముఖర్జీ సిస్టర్స్ సుతీర్థ- ఐహిక సెమీఫైనల్లో చైనాజోడీ పై సంచలన విజయంతో రజత పతకం అందుకొన్నారు. మహిళల 5 వేల మీటర్ల పరుగులో ఆఖరి 30 మీటర్ల దూరంలోనే జపాన్‌కు చెందిన ప్రత్యర్థి రిరికాను అధిగమించడం ద్వారా పారుల్ చౌదరి బంగారు పతకం సొంతం చేసుకొన్న తీరు క్రీడాభిమానులకు కలకాలం గుర్తుండి పోతుంది. జావలిన్ త్రోలో అనురాణి బంగారు పతకం, గోల్ఫ్ మహిళల వ్యక్తిగత విభాగంలో అధితి అశోక్ రజత పతకం సాధించారు. ఆసియా క్రీడల మహిళల గోల్ఫ్ చరిత్రలోనే వ్యక్తిగత విభాగంలో పతకం సాధించిన భారత తొలి మహిళగా రికార్డుల్లో చేరింది.

## తెలుగు రాష్ట్రాల అథ్లెట్లు సైతం...

భారత అథ్లెట్లు సాధించిన మొత్తం 28 బంగారు పతకాలలో తెలుగు రాష్ట్రాల సూపర్ ఆర్చర్ జ్యోతి సురేఖ వెన్నం సాధించినవే మూడు స్వర్ణాలు ఉన్నాయి.కాంపౌండ్ ఆర్చరీ మహిళల వ్యక్తిగత, టీమ్ విభాగాలతో పాటు మిక్సిడ్ విభాగంలో సైతం జ్యోతి సురేఖ బంగారు పతకాలు సాధించింది. గాంగ్జు ఆసియాక్రీడల్లో అత్యధికంగా మూడు బంగారు పతకాలు సాధించిన భారత మహిళగా నిలిచింది. హైదరాబాద్ షూటర్ ఈషాసింగ్ పిస్టల్ షూటింగ్ విభాగంలో ఓ స్వర్ణంతో సహా మొత్తం నాలుగు పతకాలు సొంతం చేసుకొంది. మహిళల 100 మీటర్ల హర్డిల్స్ రేస్‌లో విశాఖ పట్నం రన్నర్ జ్యోతి ఎర్రాజీ రజత పతకం గెలుచుకొంది. చదరంగం మహిళల టీమ్ విభాగంలో భారత్‌కు రజతం దక్కింది.



**కృష్ణారావు చాప్పరపు**
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

# దేశానికి సేవా



**గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రారంభమైన తన పాలనా ప్రయాణం నుంచి నేడు భారత ప్రధానమంత్రిగా దేశసేవ చేస్తున్న దశ వరకు ఆయన లక్ష్యం దేశ, ప్రజా సేవే. ఆ లక్ష్యంతోనే ప్రభుత్వాధినేతగా నరేంద్ర మోదీ 25 సంవత్సరాలు నిరాటంకంగా తన నాయకత్వాన్ని కొనసాగించారు. ఈ సేవ అపూర్వమైనది. మాతృభూమి పట్ల నిస్వార్థ సేవాభావం, ప్రతి పేద, అణగారిన పౌరుడిని ఉన్నతి కోసం అచంచల సంకల్పం, 'నాగరిక్ దేవో భవ' అనే మంత్రంతో నాయకత్వం సాగితే ఎంత పరివర్తన సాధ్యమవుతుందో ఈ ప్రయాణమే సాక్ష్యంగా నిలుస్తోంది.**

మోదీ సేవాకాలం గురించి వివరించే ముందు, ఈ 25 సంవత్సరాల కాలంలో ఆయన ఏం చేశారో తెలుసుకోవాలి. ఆయన ప్రయాణాన్ని నిజంగా అర్థం చేసుకోవాలంటే, ప్రభుత్వంలో ఆయన చేసిన సేవను మాత్రమే కాకుండా, దానికి ముందు దాదాపు నాలుగు దశాబ్దాలపాటు సాగిన ఆయన ప్రజా, సంస్థాగత సేవను కూడా పరిశీలించాలి.

ఆయన సంస్థలో నిస్వార్థంగా, అనామకంగా పనిచేశారు. సంస్థాగత వర్గాల వెలుపల అప్పట్లో ఆయన గురించి చాలామందికి తెలియదు. ఆయనకు ఎన్నికల అనుభవం లేదు. అయినప్పటికీ, పార్టీ సంస్థాగత వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారు.

ఆయన జీవితమంతటా ప్రత్యేకంగా కనిపించే లక్షణం మాతృభూమి పట్ల సంపూర్ణ సమర్పణ భావం, ఆమె కోసం పనిచేయాలనే అచంచల సంకల్పం. ఈ భావంతోనే 17 ఏళ్ల వయసులో ఇంటిని విడిచి వెళ్లిన ఆయన, ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. హిమాలయాలకు వెళ్లారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో సన్యాసిగా మారాలనే ఆలోచనతో రామకృష్ణ మిషన్‌ను సందర్శించారు. చివరకు, ఆర్‌ఎస్‌ఎస్ స్వయంసేవకుడిగా తన జీవిత పిలుపును గుర్తించారు.

ఆయన జీవితంలో వ్యక్తిగత ఆశయం లేదు.

ఉన్నది – ఒక లక్ష్యం.

అది – మాతృభూమికి అచంచల సేవ చేయడం.

ఆ మార్గం అచంచలమైంది. సేవే జీవితానికి ప్రధాన లక్షణంగా నిలిచింది.

ఒకే జీవితం. ఒకే లక్ష్యం.

ఈ సంకల్పంతోనే ఆయన ఎన్నికల రాజకీయాల్లోకి ప్రవేశించడానికి ముందు దశాబ్దాలపాటు సేవ చేశారు. ప్రభుత్వాధినేతగా దాదాపు 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తర్వాత కూడా ఆ లక్ష్యం నాటిలాగా నేటికీ అంతే బలంగా, అంతే సజీవంగా ఉంది. బహుశా అందుకే మోదీ ఎప్పుడూ అలసిపోయినట్లు కనిపించరు. ఎందుకంటే ఆయన ఇప్పటికీ వికసిత భారత్ అనే తన కలను సాకారం చేసేందుకు నిరంతరం ముందుకు సాగుతూనే ఉన్నారు.

ఈ సంవత్సరాల్లో ఆయన కోట్లాది భారతీయుల జీవితాల్లో సమూల పరివర్తనను తీసుకొచ్చారు. ఆయన నాయకత్వంలో దాదాపు 25 కోట్లమంది పేదరికం నుంచి బయటపడ్డారు. 2019లో 3.23 కోట్ల గ్రామీణ కుటుంబాలకు మాత్రమే ఉన్న కుళాయి నీటి సదుపాయం 2026 నాటికి 15.84 కోట్ల కుటుంబాలకు చేరింది. 12.11 కోట్లకు పైగా గృహ మరుగుదొడ్లు నిర్మింపచేశారు. దీంతో 2014లో దాదాపు 39 శాతంగా ఉన్న గ్రామీణ పారిశుధ్య కవరేజ్ సార్వత్రిక స్థాయికి చేరుకుంది. ప్రధానమంత్రి ఉజ్వల యోజన ద్వారా 10.57 కోట్లకు పైగా ఎల్పీజీ కనెక్షన్లు గ్రామీణ మహిళలకు అందాయి. దీనివల్ల మహిళల ఆరోగ్యం మెరుగు పడటంతో పాటు ఇళ్లలో వంట పొగ కారణంగా ఏర్పడే కాలుష్యానికి గురయ్యే పరిస్థితి తగ్గింది.

ఆయుష్మాన్ భారత్ ద్వారా 43.93 కోట్ల ఆరోగ్య కార్డులు జారీ అయ్యాయి. తద్వారా ఆర్థికంగా బలహీన వర్గాల కుటుంబాలకు అందుబాటు ధరల్లో వైద్యసేవలు విస్తరించాయి. పీఎంజీకేఏవై ద్వారా 81 కోట్లకు పైగా లబ్ధిదారులకు ఉచిత ఆహారధాన్యాలు అందిస్తూ, దేశవ్యాప్తంగా పేద కుటుంబాల ఆహార భద్రతను మరింత బలోపేతం చేశారు. ప్రాథమిక విద్యలో బాలికల డ్రాప్‌అవుట్ రేటు 2013–14లో 4.6 శాతం ఉండగా, 2024–25 నాటికి 0.3 శాతానికి గణనీయంగా తగ్గింది. డిజిటల్ పాలనా సంస్కరణల ద్వారా ఆధార్ ఆధారిత రేషన్‌పంపిణీ సాధ్యమైంది. అదే సమయంలో ఆకాంక్షిత జిల్లాలు, గిరిజన ప్రాంతాల్లో నీరు, పారిశుధ్యం, జీవనోపాధి రంగాల్లో లక్షిత చర్యల ద్వారా సంక్షేమ కార్యక్రమాల పరిధి మరింత విస్తరించింది.

మహాత్మా గాంధీ వంటివారు పేదలు, బలహీన వర్గాలకు అభ్యున్నత గురించి చేసిన సూచనలు, ప్రసంగాలు దశాబ్దాలపాటు పుస్తకాలకే పరిమితం అయ్యాయి. కానీ, నేడు ఈ ఆదర్శాన్ని కార్యరూపంలోకి తీసుకువచ్చే దిశగా భారత్ ముందుకు సాగింది. ఏళ్లుగా వరుసలో చివరగా మిగిలిపోయినవారికే నేడు అవకాశాలు, అభివృద్ధి ఫలాలు ముందుగా అందుతున్నాయి. విభిన్నంగా, విడివిడిగా జరిగే సంక్షేమ పంపిణీ నుంచి ప్రతి అర్హుడికి ప్రయోజనం చేరే సాచ్యురేషన్ ఆధారిత సమగ్రత వైపు పాలన మారింది.

జాతీయ భద్రత రంగంలోనూ భారత్ ఒక గాఢమైన పరివర్తనను చూసింది.

దశాబ్దాల హింస, అస్థిరత తర్వాత, 2026 నాటికి వామపక్ష తీవ్రవాదం భౌగోళిక విస్తృతి, ప్రభావం భారీగా తగ్గింది. విశ్వాస్, నిర్మాణ్, జన కల్యాణ్ అనే మూడు స్తంభాల ఆధారంగా సాగిన నిరంతర చర్యలే ఈ పరివర్తనకు పునాదిగా నిలిచాయి – ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడం, అభివృద్ధిని బలోపేతం చేయడం, గతంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలకు సంక్షేమాన్ని చేరవేయడం.

గత పన్నెండు సంవత్సరాల్లో ఉగ్రవాదంపై భారత్ చేపట్టిన సమగ్ర పోరాటం, ఉగ్రవాదం విషయంలో దేశం అనుసరిస్తున్న జీరో టాలరెన్స్

# కాలమే అమృతకాలం

విధానాన్ని ప్రతిబింబిస్తోంది. బలోపేతం చేసిన చట్టపరమైన వ్యవస్థలు, సంస్థాగత సంస్క రణలు, నిఘా వ్యవస్థల సమన్వయం ద్వారా కేంద్ర, రాష్ట్ర సంస్థల మధ్య సమన్వయం గణనీయంగా మెరుగుపడింది.

2014 నుంచి 2026 మధ్య భారత రక్షణ రంగం కూడా సమూలంగా మారిపోయింది. సంస్కరణలు, అధిక పెట్టుబడులు, ఆత్మనిర్భరతకు ఇచ్చిన బలమైన ప్రోత్సాహంతో దేశం తన సామర్థ్యం, శక్తి, అంతర్జాతీయ విశ్వసనీయతను మరింత విస్తరించిన కాలం ఇది.

2013–14లో రూ. 2.53 లక్షల కోట్లుగా ఉన్న రక్షణ బడ్జెట్ 2026–27 నాటికి రూ. 7.85 లక్షల కోట్లకు పెరిగింది.

2014–15లో రూ. 46,429 కోట్లుగా ఉన్న స్వదేశీ రక్షణ ఉత్పత్తి 2025–26 నాటికి రూ. 1.78 లక్షల కోట్లకు పెరిగింది.

అదే సమయంలో రక్షణ ఎగుమతులు 2013–14లో రూ.686 కోట్ల నుంచి 2025–26లో రికార్డు స్థాయిలో రూ.38,424 కోట్లకు పెరిగాయి. నేడు భారత రక్షణ ఉత్పత్తులు 80కి పైగా దేశాలకు చేరుతున్నాయి.

2014 నుంచి 2026 మధ్య భారత్ కేవలం ‘మహిళా సంక్షేమం గురించి మాట్లాడే విధానంనుంచి, అన్ని రంగాలు,సంస్థల్లో ‘మహిళా నేతృత్వంలోని అభివృద్ధి’ని ముందుకు తీసుకెళ్లే దిశగా మారింది. ప్రభుత్వ విధానం ద్వారా మహిళలకు ఆరోగ్యం, విద్య, పోషణ, జీవనోపాధి, ఆర్థిక సాధికారత, నాయకత్వ అవకాశాలకు మెరుగైన ప్రాప్యత లభించింది.

మహిళలను కేవలం అభివృద్ధి పథకాల లబ్ధిదారులుగా చూడటం నుంచి, భారత అభివృద్ధి ప్రయాణానికి నాయకులు, చోదకశక్తులుగా గుర్తించే స్థాయికి దేశం చేరుకుంది. గత దశాబ్దంలో రవాణా, గృహ నిర్మాణం, నీరు, ఇంధనం, లాజిస్టిక్స్, డిజిటల్ నెట్‌వర్క్ రంగాల్లో మౌలిక వసతుల నిర్మాణాన్ని భారత్ వేగవంతం చేసింది. భారీస్థాయి పెట్టుబడులు రవాణా సౌలభ్యాన్ని మెరుగు పరిచాయి, సేవల పంపిణీని బలోపేతం చేశాయి, డిజిటల్ ప్రాప్యతను విస్తరించాయి, వివిధ ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చాయి. ఈ కార్యక్రమాలన్నీ కలిసి భారత పోటీతత్వాన్ని బలోపేతం చేసి, ఆధునిక, సమగ్ర ఆర్థిక వ్యవస్థగా దేశ పరివర్తనకు తోడ్పడ్డాయి.

2014 నుంచి 2026 వరకు సాగిన పాలనా ప్రయాణం భారత పౌరుల రోజువారీ జీవితాలను సమూలంగా మార్చింది. సురక్షిత గృహాలు, స్వచ్ఛమైన వంట ఇంధనం, సురక్షిత తాగునీరు, మెరుగైన పారిశుధ్యం ద్వారా కుటుంబాలకు కొత్త అవకాశాలు లభించాయి. నమ్మదగిన విద్యుత్ సరఫరా, తక్కువ ఖర్చుతో వెలుగు, విస్తరించిన రవాణా నెట్‌వర్క్‌లు కోట్లాది ప్రజలకు సౌకర్యం, అనుసంధానాన్ని తీసుకొచ్చాయి.

కొత్త జాతీయ రహదారులు, ఆధునీకరించిన రైల్వేలు, మెట్రో వ్యవస్థలు, ప్రాంతీయ విమాన కనెక్టివిటీ దూరాలను తగ్గించి, వివిధ ప్రాంతాలకు చేరుకునే అవకాశాలను విస్తరించాయి. జన్ ధన్, ముద్ర వంటి కార్యక్రమాల ద్వారా గతంలో బ్యాంకింగ్ వ్యవస్థకు దూరంగా ఉన్న కోట్లాది ప్రజలకు బ్యాంకింగ్, రుణ సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి.

ఈ చర్యలన్నీ కలిసి దేశవ్యాప్తంగా కుటుంబాలకు మరింత స్థిరత్వం, గౌరవం, అవకాశాలను అందించాయి. భారత్ గత పన్నెండు సంవత్సరాల్లో సాధించిన ప్రయాణం సమగ్ర అభివృద్ధికి ప్రతిబింబం. పాలన ప్రజల రోజువారీ జీవితాలను మార్చడమే కాకుండా, దీర్ఘకాలిక వృద్ధికి అవసరమైన పునాదులను కూడా మరింత బలపరిచింది. భారత నాగరికత, వారసత్వానికి కూడా ‘వికాస్ భీ, విరాసత్ భీ’ అనే దృక్పథంతో గత పన్నెండు సంవత్సరాల్లో కొత్త ప్రాధాన్యం లభించింది.

ప్రసాద్, హృదయ్ వంటి వారసత్వ ఆధారిత పర్యాటక పథకాల ద్వారా ప్రధాన ఆధ్యాత్మిక, చారిత్రక ప్రదేశాల్లో మౌలిక వసతులను మెరుగు పరచి, సందర్శకుల అనుభవాన్ని మార్చారు. భారత్‌లోని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాల సంఖ్య 31 నుంచి 44కు పెరిగింది. యోగా, కుంభమేళా, దుర్గా పూజ, గర్బా వంటి భారత అమూర్త సాంస్కృతిక వారసత్వానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించింది. అదే సమయంలో విదేశాలకు వెళ్లిపోయిన భారత పురాతన వస్తువులను తిరిగి తీసుకురావడం, మ్యూజియంల అభివృద్ధి వంటి చర్యలు భారత నాగరికత పట్ల గర్వాన్ని మరింత బలోపేతం చేసి, ప్రపంచ సాంస్కృతిక రంగంలో భారత నాయకత్వాన్ని పెంచాయి.

భారత్ కేవలం ఒక భారీ డిజిటల్ మార్కెట్‌గా ఉన్న స్థాయి నుంచి, ప్రపంచ స్థాయి సాంకేతిక శక్తిగా ఎదుగుతున్న దేశంగా కూడా పరివర్తన చెందింది.

నేడు డిజిటల్ పబ్లిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, స్వదేశీ ఆవిష్కరణలు, స్టార్టప్ వ్యవస్థలు, ఆధునిక సాంకేతిక సామర్థ్యాల ద్వారా ప్రపంచ సాంకేతిక అభివృద్ధికి దిశానిర్దేశం చేసే దేశంగా భారత్ ఎదుగుతోంది. ప్రభుత్వం నిరంతరంగా చేసిన పెట్టుబడులు దేశీయ సాంకేతిక సామర్థ్యాలను బలోపేతం చేసి, ప్రపంచ స్థాయిలో భారత విశ్వసనీయతను పెంచాయి.

భారత్ నిర్మించిన విశ్వసనీయ డిజిటల్ పబ్లిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, సమగ్ర డిజిటల్ పాలన, పెరుగుతున్న అంతర్జాతీయ భాగస్వామ్యాలు దేశాన్ని ప్రపంచానికి విశ్వసనీయ సాంకేతిక భాగస్వామిగా నిలబెడు తున్నాయి. ఈ విజయాలు వికసిత్ భారత్ 2047కు పునాదులు వేస్తూ, భవిష్యత్ ప్రపంచ సాంకేతిక రంగాన్ని తీర్చిదిద్దడంలో భారత పాత్రను మరింత బలోపేతం చేస్తున్నాయి.

మానవాళి చరిత్రలో ఎదురైన అతిపెద్ద సంక్షోభాల్లో ఒకటైన కోవిడ్–19 మహమ్మారి సమయంలో కూడా భారత్ అసాధారణ సామర్థ్యం, స్థైర్యాన్ని ప్రదర్శించింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తూ దేశవ్యాప్తంగా భారీ జనాభాకు వ్యాక్సిన్లు అందించడంతో పాటు, డిజిటల్ వ్యాక్సినేషన్ సర్టిఫికెట్లను సులభంగా అందుబాటులోకి తీసుకువచ్చింది. స్వదేశీ కోవిడ్–19 వ్యాక్సిన్లను అభివృద్ధి చేసిన దేశాల్లో భారత్ కూడా ఒకటిగా నిలిచింది. 100కు పైగా దేశాలకు వ్యాక్సిన్లు, వైద్య సహాయం అందిస్తూ భారత సామర్థ్యం తన ప్రజలకు మాత్రమే కాకుండా మొత్తం మానవాళికి ఉపయోగపడగలదని చాటిచెప్పింది.

మోదీ సేవాకాలం ప్రతిబింబించే విస్తృత పరివర్తన ఇదే. భారత్ 2047 వైపు ముందుకు సాగుతున్న ఈ సమయంలో మోదీ దృక్పథం స్పష్టంగా ఉంది – ప్రపంచ వేదికపై సగర్వంగా నిలబడే సంపూర్ణ అభివృద్ధి చెందిన భారత్. అదే సమయంలో తన నాగరిక విలువలు, సాంస్కృతిక గుర్తింపు, జాతీయ స్వభావంలో దృఢంగా పాతుకుపోయిన భారత్.

ఆయన సేవాకాలమే భారతదేశ అమృతకాలంగా మారింది.



**ఎన్. రామ్‌చంద్రరావు**
రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు

# కలాం కలకు తొలి అడుగు | కథ



అబ్దుల్ కలాం చిన్నప్పటి నుంచే ప్రకృతిని, ఆకాశాన్ని ఎంతో ఆసక్తిగా గమనించేవాడు. ముఖ్యంగా పక్షులు ఆకాశంలో ఎగురుతుంటే... అవి ఎలా ఎగురుతున్నాయో తెలుసుకోవాలనే ఆసక్తి అతనిలో ఉండేది.

రామేశ్వరంలోని పాఠశాలలో చదువు కుంటున్న సమయంలో కలాం జీవితాన్ని ప్రభావితం చేసిన గురువుల్లో శివసుబ్రహ్మణ్య అయ్యర్ ఒకరు. ఒకరోజు అయ్యర్ తరగతి గదిలో పక్షులు ఎలా ఎగురుతాయో విద్యార్థులకు వివరించారు. అయితే పాఠం విన్న తర్వాత కలాంకు ఆ విషయం పూర్తిగా అర్థం కాలేదు. అప్పుడు అయ్యర్ కేవలం పుస్తకంలోని విషయాన్ని చెప్పడంతో ఆపలేదు.

విద్యార్థులను రామేశ్వరం సముద్ర తీరానికి తీసుకెళ్లారు. అక్కడ ఆకాశంలో ఎగురుతున్న సముద్ర పక్షులను ప్రత్యక్షంగా చూపిస్తూ, వాటి రెక్కల కదలిక, శరీర నిర్మాణం, గాలి ప్రవాహంతో వాటి సంబంధం గురించి వివరించారు. ఆ అనుభవం కలాం మనసులో చెరగని ముద్ర వేసింది.

పుస్తకంలో చదివిన ఒక సైన్స్ పాఠం... అతని ముందు ప్రత్యక్ష అనుభవంగా మారింది. ఆ రోజు నుంచి కలాంకు విమానాలు, ఎగరడం, ఆకాశం వంటి విషయాలపై ఆసక్తి మరింత పెరిగింది. భవిష్యత్తులో విమానాల రూపకల్పన, ఏరోనాటిక్స్ రంగంలో పనిచేయాలనే ఆలోచన అతనిలో బలపడింది.

అయితే ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఎంతో కష్టపడ్డాడు. సైన్స్, గణితంపై మరింత ఆసక్తిని పెంచుకున్నాడు. తర్వాత భౌతిక శాస్త్రం చదివి, మద్రాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ అభ్యసించాడు. ఆ తర్వాత భారతదేశ అంతరిక్ష, రక్షణ పరిశోధన కార్యక్రమాల్లో శాస్త్రవేత్తగా పనిచేశాడు. భారతదేశ ఉపగ్రహ ప్రయోగ వాహన కార్యక్రమంలోనూ, క్షిపణి అభివృద్ధి కార్యక్రమాల్లోనూ కీలక పాత్ర పోషించాడు.

ఒకప్పుడు సముద్ర తీరంలో పక్షులు ఎగురుతుంటే ఆసక్తిగా చూసిన ఆ చిన్న బాలుడు, భారతదేశానికి అంతరిక్ష, రక్షణ రంగాల్లో సేవ లందించిన ప్రముఖ శాస్త్రవేత్తగా ఎదిగాడు. తర్వాత భారతదేశ రాష్ట్రపతిగా కూడా దేశానికి సేవలందించాడు.

ఒక మంచి గురువు విద్యార్థికి కేవలం సమాధానాలను అందించడమే కాకుండా, స్వతంత్రంగా ఆలోచించే విధానాన్ని కూడా నేర్పగలడు. ★

## మంచిమాట

మాటలలో మంచితనం ఉంటే..
మనసుల్లో స్థానం దొరుకుతుంది

## మెదడుకు మేత

ఒక్క కాలిపై నిలబడి, వందల మందికి నీడనిచ్చేది.
ఎండకైనా, వానకైనా అందరికీ తోడుగా నిలిచేది.. ఏమిటి?

## పద్యం

**అడిగి చేయని పనియెంతయు**
**చెడిపోయినను దిద్దలేము చింతింతురుగాకన్**
**అడిగి చేసిన కార్యముల**
**చెడినను దిద్దవచ్చు తెలివిగల సుమతీ!**

భావం : ఆలోచించకుండా, సలహా తీసుకోకుండా చేసిన పనివల్ల సమస్యలు వస్తే వాటిని సరిచేయడం కష్టం. అవసరమైనప్పుడు పెద్దలను లేదా తెలిసినవారిని అడిగి నిర్ణయం తీసుకోవడం మంచిది.

## శ్లోకం

**దత్త్వాయాచంతి పురుషా**
**హత్వా వధ్యంతి చాపరే**
**పాత యత్వాచ పాత్యంతే**
**పరైరితి చ మే శ్రుతమ్**

భావం : దాతలే యాచకులు కావచ్చు. విజేతలు పరాజితులూ కావచ్చు. ఒకప్పుడు ఇతరులను కూల్చినవాడే ఇప్పుడు తానే కూలిపోవచ్చు. ఏదీ స్థిరం కాదు... అసాధ్యమూ కాదు.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| తెలంగాణ | అమరావతి |
| ఆంధ్రప్రదేశ్ | హైదరాబాద్ |
| కర్ణాటక | బెంగళూరు |
| తమిళనాడు | చెన్నై |
| కేరళ | తిరువనంతపురం |

## శాస్త్రవేత్తలు



### డా. ఆత్మారామ్

ఉత్తరప్రదేశ్‌కి చెందిన ప్రముఖ రసాయన శాస్త్రవేత్త, పరిశోధకుడు. అక్టోబర్ 12,1908న జన్మించారు. గాజు, సిరామిక్స్ రంగాల్లో పరిశోధనలు చేసి, దేశీయంగా ఉపయోగపడే సాంకేతికతల అభివృద్ధికి కృషి చేశారు. Central Glass and Ceramic Research Institute(CSIR) డైరెక్టర్‌గా పనిచేశారు. అనంతరం ఆ సంస్థ డైరెక్టర్ జనరల్‌గా, అలాగే కేంద్ర ప్రభుత్వానికి సైన్స్ అండ్ టెక్నాలజీ అంశాల్లో ప్రధాన సలహాదారుగా సేవలందించారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఆయన చేసిన విశేష కృషికి భారత ప్రభుత్వం 1959లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.

## జనరల్ నాలెడ్జ్

1. భారతదేశంలో తొలి బయోస్ఫియర్ రిజర్వ్ ఏది?
2. "గ్రాండ్ ఓల్డ్ మ్యాన్ ఆఫ్ ఇండియా" అని ఎవరిని పిలుస్తారు?
3. ప్రపంచంలో అతిపెద్ద మడ అడవులు ఏ ప్రాంతంలో ఉన్నాయి?

జవాబులు: 1. నీలగిరి బయోస్ఫియర్ రిజర్వ్; 2. దాదాభాయ్ నౌరోజీ; 3. సుందర్బన్స్.

## భక్తాగ్రేసరులు

### శొంఠి వెంకట రమణయ్య



శొంఠి వెంకటరమణయ్య ప్రఖ్యాత వాగ్గేయకారుడు త్యాగరాజు గురువు. వెంకటరమణయ్య తన తండ్రి శొంఠి వెంకటసుబ్బయ్య సంగీత వారసత్వంతో తంజావూరు ప్రాంత సంగీత ప్రపంచంలో ప్రముఖ స్థానం పొందారు. భారతీయ సంగీత పరంపరలో విశిష్ట వ్యక్తిత్వం కలవారు. తులజాజీ మహారాజ్‌తో అర్థ సింహాసనం గౌరవం అందుకున్నారు.ఎందరినో సంగీత విద్వాంసులుగా తీర్చిదిద్దారు. వెంకట రమణయ్య దక్షిణామూర్తి స్వరూపమైతే,త్యాగయ్య అపర సుబ్రహ్మణ్యేశ్వరుడిగా సంగీతజ్ఞులు శ్లాఘిస్తారు. త్యాగయ్యను 'గురువును మించిన శిష్యుడి'గా అక్కున చేర్చుకున్నారు. శిష్యుడి ప్రతిభపై అపార నమ్మకం గల ఆయన, ఉద్దండ సంగీత విద్వాంసుల సమక్షంలో ఆయనతో పాడించారు. 'శొంఠి' వారి ఇంటిపేరు మాత్రమేనని, ఆయన మనసు చక్కెర పొంగలి అని సంగీతాభిమానులు చమత్కారంగా శ్లాఘిస్తారు.




# వారఫలాలు

14-20 సెప్టెంబర్, 2026

**మేషం :** అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

రుణాలు చాలావరకూ తీరుస్తారు. సన్నిహితులతో వివాదాలు తొలగుతాయి. ఎంతటి వారినైనా వాక్చాతుర్యంతో ఆకట్టుకుంటారు. భూములు కొనుగోలు యత్నాలు సానుకూలం. ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి. వ్యాపారులకు పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగులకు అదనపు విధులు మీదపడవచ్చు. రాజకీయ, పారిశ్రామివర్గాల కృషి ఫలిస్తుంది. 19,20 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. హనుమాన్‌ఛాలీసా పఠించండి.

**వృషభం :** కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ముఖ్యమైన కార్యక్రమాలు చకచకా సాగుతాయి ఆస్తి వివాదాలు పరిష్కారం. ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. వాహనసౌఖ్యం. వ్యాపారులకు విస్తరణ కార్య క్రమాలలో పురోగతి. ఉద్యోగులకు విధి నిర్వహణలో మరింత ప్రోత్సాహకరంగా ఉంటుంది. రాజకీయ వర్గాలకు ఊహించని అవకాశాలు దక్కుతాయి. కళాకారులు, పరిశోధకులకు కాస్త ఊరట లభిస్తుంది. 14,15 తేదీల్లో బంధువులతో వివాదాలు. అనారోగ్యం. ఆదిత్య హృదయం పఠించండి.

**మిథునం :** మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

విద్యార్థులకు కొన్ని అవకాశాలు సంతృప్తినిస్తాయి. ప్రత్యర్థులను సైతం ఆకట్టుకుంటారు. జీవిత భాగస్వామి ద్వారా ధన, ఆస్తిలాభాలు. వ్యాపారులు మరింత లాభాలు దక్కించుకుంటారు. ఉద్యోగులకు సంతోషం కలిగించే సమాచారం అందుతుంది. పారిశ్రామిక వర్గాల యత్నాలు సఫలం. రచయితలు, క్రీడాకారులకు నూతనోత్సాహం. 16,17 తేదీల్లో ఆస్తి వివాదాలు. శారీరక రుగ్మతలు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

**కర్కాటకం:** పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

కాంట్రాక్టర్లు శుభవార్తలు వింటారు. వాహనాలు, భూములు కొనుగోలు చేస్తారు. సేవాకార్యక్రమాలపై ఆసక్తి చూపుతారు. వ్యాపారులకు అనుకున్న లాభాలు దక్కుతాయి. పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగులకు కొత్త బాధ్యతలు దక్కుతాయి. రాజకీయవర్గాలకు కొంత ఉత్సాహవంతంగా ఉంటుంది. రచయితలు, క్రీడాకారులకు ఊరట లభిస్తుంది. 17,18 తేదీల్లో అనారోగ్యం. కుటుంబంలో సమస్యలు. హయగ్రీవ స్తోత్రాలు పఠించండి.

**సింహం :** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ఆదాయం కంటే ఖర్చులు పెరుగుతాయి. ఆలోచనలు స్థిరంగా ఉండవు. వ్యాపారులకు పెట్టుబడులు ఆలస్యమవుతాయి. లాభాలు స్వల్పంగా. ఉద్యోగులకు విధి నిర్వహణలో అవాంతరాలు ఎదురుకావచ్చు. కళాకారులు, రచయితలకు అవకాశాలు నిరాశ పరుస్తాయి. 16,17 తేదీల్లో శుభవార్తలు. వాహనయోగం. నూతన పరిచయాలు. కనకధారాస్తోత్రాలు పఠించండి.

**కన్య :** ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

కాంట్రాక్టర్లకు ఉత్సాహవంతంగా ఉంటుంది. వాహనాలు, భూముల కొనుగోలులో ఆటంకాలు తొలగుతాయి. వ్యాపారులకు ఆశించిన విధంగా లాభాలు దక్కుతాయి. ఉద్యోగులకు విధుల్లో ప్రతిబంధకాలు తొలగుతాయి. రాజకీయవర్గాలు, రచయితలకు మరింత ప్రోత్సాహకరంగా ఉంటుంది. 18,19 తేదీల్లో శారీరక రుగ్మతలు. మానసిక ఆందోళన. విష్ణుధ్యానం చేయండి.

**తుల :** చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. కుటుంబంలో శుభకార్యాలు నిర్వహిస్తారు. భూములు, వాహనాల కొనుగోలు యత్నాలు సఫలం. వ్యాపారులకు లాభాలు కొంత ఊపందుకుంటాయి. ఉద్యోగులకు బాధ్యతలు కొంత పెరిగినా సమర్థతను చాటుకుంటారు. పారిశ్రామిక వర్గాలు, రచయితలకు కొత్త ఆశలు చిగురిస్తాయి. 14,15 తేదీల్లో అనుకోని ఖర్చులు. అనారోగ్యం. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

**వృశ్చికం :** విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వాహన, గృహయోగాలు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. చిన్ననాటి సంఘటనలు గుర్తుకువస్తాయి. వ్యాపారులకు విస్తరణ కార్యక్రమాలు అనుకూలిస్తాయి. ఉద్యోగులకు మరింత ప్రోత్సాహం. రాజకీయవర్గాలు, రచయితలు అనుకున్న విజయాలు సాధిస్తారు. 19,20 తేదీల్లో బంధు విరోధాలు. ఆరోగ్యభంగం. ఆంజనేయ దండకం పఠించండి.

**ధనుస్సు :** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

కొన్ని వివాదాల నుంచి బయటపడతారు. ఇంటి




సింహంభట్ల సుబ్బారావు

6300674054


నిర్మాణయత్నాలు కలసివస్తాయి. బంధువులతో కీలక విషయాలు చర్చిస్తారు. వ్యాపారులకు అనుకున్న లాభాలు తథ్యం. ఉద్యోగులు విధి నిర్వహణలో ఆటంకాలు అధిగమించి ముందుకు సాగుతారు. పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులు గుర్తింపు పొందుతారు. 16,17 తేదీల్లో ఖర్చులు. కుటుంబంలో ఒత్తిడులు. గణేశాష్టకం పఠించండి.

**మకరం :** ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. వాహనాలు, ఆభరణాల కొనుగోలు యత్నాలు సఫలం. వ్యాపారులకు అనుకున్న లాభాలు దక్కుతాయి. కొత్త పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు ఉండవచ్చు. రాజకీయ వర్గాలకు కొంత ఉత్సాహవంతంగా ఉంటుంది. రచయితలు, పరిశోధకులకు కొత్త ఆశలు. 19,20 తేదీలలో శారీరక రుగ్మతలు, బంధువులతో తగాదాలు. దుర్గాదేవి స్తోత్రాలు పఠించండి.

**కుంభం :** ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

ధార్మిక కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. వ్యాపారులు గతం కంటే మెరుగైన లాభాలు అందుకుంటారు. పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగులకు నూతనోత్సాహంతో అడుగువేస్తారు. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు కాస్త ఊరట లభిస్తుంది. రచయితలు, క్రీడాకారులు కొత్త ప్రణాళికలు రూపొందించుకుంటారు. 14,15 తేదీల్లో దూరప్రయాణాలు. అనుకోని ఖర్చులు. దేవీ ఖడ్గమాల పఠించండి.

**మీనం :** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

నూతన ఉద్యోగయత్నాలు కలసివస్తాయి ఆహ్వానాలు అందుకుంటారు. వాహనాలు, ఆభరణాలు కొంటారు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. ఆలోచనలు కార్యరూపంలో పెడతారు. వ్యాపారులకు మరింత అనుకూల సమయం. ఉద్యోగులకు పనిభారం నుంచి కొంత విముక్తి లభిస్తుంది. రాజకీయవేత్తలు, కళాకారులకు గందరగోళం కాస్త తొలగుతుంది. 16,17 తేదీల్లో శారీరక రుగ్మతలు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

# పదరసం-581

## ఆధారాలు

**అడ్డం**

1. ఆలస్యం, తాత్సారం (2)
2. పేరు, బొట్టు (2)
3. లక్ష్మణ కుమారుడి తల్లి (4)
6. బేసికి వ్యతిరేకం (2)
7. కనికట్టు (3)
8. అంధకారం (3)
10. కట్టుబాటు, పద్ధతి (3)
11. రుచులు ఇన్నిట (2)
12. యుక్తమైన (2)
13. తల్లి, నేల (2)
14. సంకెల, హారం (3)
15. అట్లు పోసుకునే సాధనం (2)
16. మధ్యలో (3)
17. సేద్యం, ప్రయత్నం (2)
19. విచారం, దుఃఖం (2)
20. విక్రయాలే (4)
21. ఉపకారం... అటు నుంచి (2)
23. కామాక్షి క్షేత్రం (2)
25. వంచకుడు (3)
27. చిహ్నం (2)
29. కంటకం (2)
30. పర్వతాల్లో శ్రేష్ఠమైనది (2)
31. అబద్ధం (2)
32. సంపన్నుడు (4)

**నిలువు**

1. మీ చేతిలోని పత్రిక (3)
2. అల్లెతాడు (2)
3. సరస్వతి, అలనాటి సాహిత్య పత్రిక (3)
4. మాట, పలుకు (2)
5. శ్రీ కృష్ణదేవరాయల మంత్రి, అప్పాజీ (4)
6. పడవ / ఓడ నడిపేవాడు (3)
7. వేదమాత (3)
9. తక్కువ మాట్లాడేవాడు (4)
10. నిధి, ఆశ్రయం (3)
11. భార్యాభర్తలే (5)
14. పోట్లాట, కోలాహలం (3)
15. పెత్తండ్రుల భార్యలు (4)
17. కల్పితం, నకిలీ (3)
18. కోపం, తేలిక (3)
22. సోదరి కుమారుడు (4)
24. లేత ఆకు (3)
26. బలపంతో రాసుకునే సాధనం (3)
28. దీనికి వచ్చి ముంత దాచనేల? (2)
29. పోపుల పెట్టెలోని ఒక ద్రవ్యం.. కింద నుంచి (2)

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | ■ | 2 | | ■ | 3 | 4 | | 5 |
| | ■ | 6 | | ■ | 7 | | | ■ | |
| 8 | 9 | | ■ | 10 | | | ■ | 11 | |
| ■ | 12 | | ■ | 13 | | ■ | 14 | | |
| ■ | | ■ | 15 | | ■ | 16 | | | ■ |
| 17 | | ■ | | ■ | 18 | ■ | 19 | | ■ |
| | ■ | 20 | | | | ■ | ■ | 21 | 22 |
| 23 | 24 | ■ | | ■ | 25 | 26 | | ■ | |
| ■ | 27 | | ■ | 28 | ■ | | ■ | 29 | |
| 30 | | ■ | 31 | | ■ | 32 | | | |

## పదరసం - 580 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 ఆ | రం | 2 భం | ■ | ■ | 3 ఐ | రా | 4 వ | 5 తం | ■ |
| ల | ■ | 6 డ | ప్పు | ■ | శ్వ | ■ | 7 చ | తు | 8 రు |
| 9 స్యం | 10 ద | నం | ■ | 11 కా | ర్యం | ■ | న | ■ | జు |
| ■ | ను | ■ | 12 ఇ | ల | ■ | 13 పే | ము | ■ | వు |
| 14 అ | జు | డు | ■ | 15 క్షే | మం | ■ | ■ | 16 ల | ■ |
| 17 పా | లు | ■ | 18 చా | పం | ■ | 19 మీ | ■ | 20 వ | క్త |
| యం | ■ | 21 చె | ర | ■ | 22 ఆ | రా | 23 ధ | న | ■ |
| ■ | 24 ర | ■ | 25 కు | డు | ము | ■ | న్వం | ■ | 26 తా |
| 27 ప | ధి | 28 కు | డు | ■ | ద | ■ | 29 త | ను | వు |
| సి | ■ | ప్ప | ■ | 30 పా | ము | ■ | రి | ■ | లు |

సినిమా

సినిమా వాళ్లకు సంక్రాంతి చాలా పెద్ద సీజన్. ఆ సమయంలో ఒకటి రెండు రోజుల తేడాతో నాలుగైదు చిత్రాలు విడుదలైనా, మంచి విజయాలను అందుకుంటాయి. చిన్న సినియాలు పెద్ద సినిమాలతో ధైర్యంగా పోటీ పడే సీజన్ అది. గడిచిన కొన్నేళ్లుగా ఆ పండగకు విడుదలైన పెద్ద చిత్రాలే కాదు చిన్న సినిమాలు సైతం మంచి విజయాలను సాధించి, చిత్రసీమను సుసంపన్నం చేశాయి.

# సంక్రాంతికి ముందే సినిమా సందడి





వచ్చే సంక్రాంతికి ఎప్పటిలానే ఆసక్తికరమైన పోరు సాగనుంది. సంక్రాంతికి రెండు వారాల ముందే ఇద్దరు సీనియర్ స్టార్ హీరోలు బరిలోకి దిగుతుండటం విశేషం. వీరిద్దరి సినిమాలు కూడా డిసెంబర్ 24న విడుదల కాబోతున్నాయి. గత యేడాది అగ్ర చిత్రాల నిర్మాతలు ఏ మాత్రం ప్లానింగ్ లేకుండా వ్యవహారం చడంతో మంచి సీజన్‌ను మిస్ చేసుకున్నారు. డిసెంబర్ చివరి వారంలో స్టార్ హీరోల హిందీ సినిమాలు విడుదల అవుతుంటాయి. ఆ అలవాటు మన తెలుగులోనూ ఉంది. కానీ గత డిసెంబర్ చివరి వారంలో ఏ స్టార్ హీరో సినిమా విడుదల కాలేదు. 'శంబాల, దండోరా, ఈషా, ఛాంపియన్' లాంటి మీడియం బడ్జెట్ చిత్రాలే ఆ వారంలో వచ్చాయి. వీటిలో 'ఛాంపియన్, శంబాల' ఫర్వాలేదనిపించాయి. ఈసారి మాత్రం స్టార్ హీరోలు ఆ సీజన్‌ను వదులు కోవడానికి సిద్ధంగా లేరు. డిసెంబర్ 24న నందమూరి బాలకృష్ణ 'దాదా' సినిమాతో పాటు అక్కినేని నాగార్జున వందో సినిమా 'కింగ్ 100' విడుదల అవుతోంది.

నాగార్జున 'కింగ్ 100' మూవీ షూటింగ్ మొదలై చాలా కాలమే అయినా... దానికి సంబంధించిన అప్ డేట్స్ మాత్రం పెద్దంతగా ఇవ్వలేదు. తమిళ దర్శకుడు పా. కార్తీక్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. గతంలో నాగార్జునతో హిట్ చిత్రాలలో నటించిన టబు ఇందులో హీరోయిన్. ఈ మధ్య వచ్చిన 'కుబేర' తరహాలోనే ఇదికూడా ఆర్థిక లావాదేవీలు, మోసాల చుట్టూ సాగే కథలా తాజాగా విడుదలైన గ్లింప్స్ చూస్తే అర్థమౌతోంది. నాగార్జునకు డిసెంబర్ నెల బాగానే కలిసొచ్చిందని చెప్పాలి. ఇప్పుడంటే ఆయన సంక్రాంతి సీజన్‌లో సినిమాలు విడుదల చేస్తున్నారు కానీ గతంలో ఐదారు చిత్రాలు డిసెంబర్‌లోనే విడుదలై మంచి విజయాన్ని అందుకున్నాయి. మరీ ముఖ్యంగా డిసెంబర్‌లో వచ్చిన 'మన్మథుడు, మాస్, కింగ్' సినిమాలు ప్రేక్షకాదరణ పొందాయి. ఇక 'రగడ' సినిమా అయితే... రేపు 'కింగ్ 100' రాబోతున్న తేదీనాడే (డిసెంబర్ 24, 2010) విడుదలైంది. అంటే పదహారేళ్ల తర్వాత నాగార్జున సినిమా మళ్లీ అదే తేదీకి వస్తోందన్న మాట. ఇక తెలంగాణ నేపథ్యంలో విజయేంద్ర ప్రసాద్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న నాగార్జున చిత్రం 'రాజన్న' సైతం డిసెంబర్‌లోనే విడుదలైంది. ఆ రకంగా ఆయనకు కలిసి వచ్చిన డిసెంబర్‌లో వస్తున్న 'కింగ్ 100' ఏ స్థాయి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

బాలకృష్ణ డిసెంబర్ సినిమాల విషయానికి వస్తే... ఆయన కెరీర్ ప్రారంభంలో తన అన్న హరికృష్ణతో కలిసి 'రామ్ రహీమ్' సినిమాలో నటించారు. వీరిద్దరూ టైటిల్ రోల్ ప్లే చేసిన ఆ చిత్రం డిసెంబర్‌లోనే వచ్చింది. అలానే 'కథానాయకుడు, పట్టాభిషేకం, రక్తాభిషేకం, లారీ డ్రైవర్, అశ్వమేథం, టాప్ హీరో, విజయేంద్రవర్మ, రూలర్'తో పాటు 'అఖండ, అఖండ 2' చిత్రాలు సైతం ఇదే నెలలో విడుదలయ్యాయి. ఆ రకంగా బాలకృష్ణకు డిసెంబర్ కూడా కలిసి వచ్చిందనే చెప్పాలి. ఇప్పుడు మరోసారి 'దాదా' చిత్రం డిసెంబర్ 24న రాబోతోంది. దాని దర్శకుడు గోపీచంద్ మలినేని 2023లో బాలకృష్ణ తో తెరకెక్కించిన 'వీరసింహారెడ్డి' చక్కని విజయం సాధించింది. దాంతో 'దాదా' మీద సహజంగానే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తోంది.

## ఆసక్తికరంగా సంక్రాంతి సీజన్!

వచ్చే యేడాది సంక్రాంతి బరిలో నిలుస్తున్న సినిమాలు కూడా దేనికదే ప్రత్యేకమైంది. జనవరి 8న 'మహాకాళి' సినిమా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కాబోతోంది. 'హను-మాన్' సినిమాతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రశాంత్ వర్మ ఈ సినిమాకు క్రియేటర్‌గా వ్యవహరించడంతో పాటు నిర్మాణ భాగస్వామిగా ఉన్నారు. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో 'మహాకాళి' కూడా ఒకటి కావడం విశేషం. పూజా అపర్ణ కొల్లూరు ఈ సినిమాకు దర్శకురాలు. వెంకటేశ్ – కళ్యాణ్ రామ్ హీరోలుగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న 'జనవరి 12 విడుదల' మూవీ జనవరి 12న రాబోతోంది. గత కొంతకాలంగా అనిల్ రావిపూడి తన సినిమాలను సంక్రాంతి సీజన్‌లో విడుదల చేస్తున్నాడు. ఆ సెంటిమెంట్‌ను విడిచి పెట్టకుండా ఇప్పుడీ సినిమాను సంక్రాంతికే బరిలోకి దించుతున్నాడు. సాయి దుర్గా తేజ్ హీరోగా నటిస్తున్న 'సంబరాల యేటి గట్టు' సినిమా అదే తేదీన విడుదల కానుంది. ఆ మర్నాడే (13న) చిరంజీవి 'కాకా'గా జనం ముందుకు రాబోతున్నాడు. మేనమామ సినిమాకు ఒక రోజు ముందు సాయి దుర్గా తేజ్ తన సినిమాను విడుదల చేయడానికి అంగీకరిస్తాడా? అనే సందేహాన్ని ట్రేడ్ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

ఇదిలా ఉంటే... శర్వానంద్ హీరోగా శ్రీనువైట్ల తెరకెక్కిస్తున్న 'జార్జ్ క్రిష్' సంక్రాంతి కానుకగానే జనవరి 14న విడుదల కానుంది. రవితేజ హీరోగా హసిత్ గోలి దర్శకత్వంలో దిల్ రాజు నిర్మిస్తున్న సినిమాను ఇదే రోజున విడుదల చేయబోతున్నట్టు ఇటీవల ప్రకటించారు. ఆ రకంగా వచ్చే యేడాది సంక్రాంతికి స్ట్రయిట్ తెలుగు సినిమాలే ఆరు రాబోతున్నాయి. మరి వీటికి తమిళ చిత్రాలు ఒకటి రెండు జత అయ్యే ఛాన్స్ కూడా లేకపోలేదు. ఈ యేడాది ప్రథమార్థంతో పోల్చితే ద్వితీయార్థం సినిమాల ఫలితాలు బాగున్నాయి.

**– అరుణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్**


DR. R. RAVINDRANATH REDDY
BJP State Executive Member,
Telangana
DR.R.PARIJATHAM
MD.DGO
కుమార్తెలు
హరితా రెడ్డి, అర్చనా రెడ్డి
కొడుకు, కోడలు
ఋషికేష్ రెడ్డి, డా.గాయత్రి
రావుల రవీంద్రనాథ్ రెడ్డి గారికి
82వ జన్మదిన శుభాకాంక్షలు...
(సెప్టెంబర్ 20)
RAHUL
MULTI SPECIALITY HOSPITAL
DR. MANISHA REDDY
MBBS, MD, IDPCCM
PAEDIATRICS & GOLD MEDALIST
Regd. No. 0471
DR. HARIN REDDY ILLURI
MBBS, MS, FMAS, GENERAL&
Laparoscopic Surgeon)
Regd. No. 08900
SERVING TO THE PEOPLE SINCE 45 YEARS
RAHUL MULTI SPECIALITY HOSPITAL
KOTHAKOTA - 509381 , Wanaparthy Dist.

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 48

